UNIVERSAL LIBRARY
OU_204975
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 L19P Accession No. T2925

Author లక్ష్మీనరసింహము

Title ప్రసన్నయాదవము

This book should be returned on or before the date last marked below.

ప్రసన్నయాదవము

గ్రంథకర్త:

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు.

ప్రకాశకర్త:

కురుకూరి సుబ్బారావు

సరస్వతీ బుక్కుడిపో,

బెజవాడ.

కాకినాడ:

కాకినాడముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1935

రిజిష్టర్డు] [వెల రు 0-8-0.

ధరణికోట.

(రెడ్డిరాజుల చరిత్ర)

[గ్రంథకర్త:—సోమరాజు రామానుజరావుగారు.]

రెడ్డివీరుల దేశభక్తి! రెడ్డివీరుల ధర్మాసక్తి!! రెడ్డివీరుల కార్యసిద్ధి!!!

అక్షరలక్షలుచేయుపద్యములు! అసమానమైన గద్యములు!!

ప్లాటు మహాశ్చర్యకరము! వెల రు 1—4—0. పాట లానందభరితములు!!

బెజవాడ మైలవరం బాలభారతీసభవారిచే ప్రదర్శింపబడుచున్నది.

కొండవీటియందలి యనపోతనాయనితో రాచకొండయందలి రెడ్డిరాజులకు ధరణికోటవద్ద జరిగిన మహాసంగ్రామకథ - రెడ్డివీరుల నోట వెలువడు ప్రతిమాటయు వీరరసోత్సాహభరితమై రెడ్డికులమునం బుట్టిన పిరికివానినిసయితము వీరాధివీరునిగా మార్పజాలియున్నది. సహజముగ తాను ముసలివాడయ్యు - తన్ను "తాత" యని పిలిచిన కోపగించుకొను విచిత్రస్వభావముగల వెంకన్నచర్యలు కడుపుబ్బనవ్వించును. కథానాయికయగు వీరభద్ర తాను వరించిన ఖడ్గనారాయణునకు కారాగృహమునకు లేఖ పంపుట - వీరపూజోత్సవమున వింతయగ్ని పుట్టుట - అగ్నిహోత్రోత్పాదనమున, ననంతమగు కోలాహలము - కోలాహలమున ఘోరహత్యలు- హత్యలలో నవరోధములు అవరోధములందు విరోధములు- కొండారెడ్డి కుతంత్రపరాయణత్వము- త్రాగి ప్రేలిన యనపోతనాయనిచే పరాభవింపబడి తక్షణము స్వబుద్ధిని సవరించుకొని వెలమలలో చేర సంకల్పించుట- ఆగ్రహావశమున తాను హతమార్ప దలంచిన వెంకన్నను మాని, వీరభద్ర నిర్మించిన గృహపుతల త్రెంచి-యది ఖడ్గనారాయణని శిరస్సగుట గాంచి ఖడ్గనారాయణునే చంపినట్లు భ్రమించుట- వీరరసమున హాస్యము- వెలమరాజును చంపబోయి, యచ్చట ఖడ్గనారాయణుని, నిజరూపముం జూచి, భూతముగా నెంచి మరింత విభ్రాంతినందుట- ఖడ్గనారాయణుడు, విజయానంతరమున తనచద్మరూపములను ప్రదర్శించుట- మహాద్భుతము. అనపోతనాయని దాసీపుత్రునిగా నెఱింగి వెలమ రాణి నిండుసభలో నాతనిం బొడిచి తాను పొడుచుకొని వెలమపౌరుషమును నిలుపుట- మహానాటకము- రంగస్థలరంజకమైనది- చదివినకొలదియు నవలవలె నుత్సాహమును ముందునకు ద్రోయును-రెడ్లపరితాపము చూడవలచినవారి కిదియే యుత్తమగ్రంథము.

కురుకూరి సుబ్బారావు, సరస్వతీ బుక్ డిపో, బెజవాడ, కృష్ణాజిల్లా.

ప్రసన్నయాదవము

ఇది

చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులుగారిచే

రచియింపఁబడినది.

ప్రకాశకు:

రుకూరి సుబ్బారావు

సరస్వతీ బుక్‌డిపో, బెజవాడ.

కాకినాడ:

కాకినాడముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1934

...ైట్]

[వెల 0—8—0.

ఈనాటకమునందువచ్చు పాత్రలు.

పురుషులు.

మహేంద్రుఁడు — దేవతలరాజు

బృహస్పతి — దేవగురువు.

జయంతుఁడు — మహేంద్రుని కుమారుఁడు.

మాణిభద్రుఁడు — కుబేరుని సేవకుఁడు.

నరకాసురుఁడు — ప్రాగ్జ్యోతిషాధిపతియగు రాక్షసరాజు.

పంచజనుఁడు, నిశుంభుఁడు, మురుఁడు — నరకాసురుని సేనాధిపతులు

వజ్రకంఠుఁడు, మందపాలుఁడు — నరకాసురునిబంట్లు.

సూతుఁడు — నరకుని సారథి.

భగదత్తుఁడు — నరకాసురునికుమారుఁడు.

శంబరుఁడు — నరకాసురుని మంత్రి.

శుక్రాచార్యులు — రాక్షసగురువు.

చిత్రరథుఁడు — గంధర్వుఁడు.

పులహుఁడు, బృహదశ్వుఁడు — బదరికాశ్రమమునులు.

దారుకుఁడు — కృష్ణునిసూతుఁడు.

దేవలుఁడు — కృష్ణుని యంతఃపురపరిచారకుఁడు.

శ్రీకృష్ణుఁడు — కథానాయకుఁడు.

స్త్రీలు.

ఊర్వశి — స్వర్గలోకవేశ్యకాంత.

సత్యభామ — శ్రీకృష్ణునిదేవి.

శ్రీ

ప్రసన్న యాదవ నాటకము.

నాంది.

మ. మును లాస్థానకవీంద్రు; లాగమచయంబు ల్వాందిబృందంబు; స
జ్జనచిత్తంబులు కొల్వుకూటములు; సంద్రంబు ల్ధనాగారము;
ల్మనుజు ల్సేసెడి సేవ యుపాయనము; బ్రహ్మాండంబు సామ్రాజ్య మె
వ్వని కాయాదిమచక్రవర్తి కృపఁ గాపాడు సభాస్తారులన్.

మఱియు,

తే. గీ. ప్రాణికోటుల నెల్లఁ బాత్రములఁ జేసి
జగ మనెడు మహారంగ దేశంబునందు
నాటకంబుల నేర్పుతో నడపు నట్టి
సూత్రధారుండు మిముఁ బ్రోచు శుభము లొసఁగి.

సూత్రధారుఁడు—[నాంద్యనంతరమున తెరసంకుఁ జూచి] పారిపార్శ్వకా! నీవొకసారి యిటు రాఁగలవా ?

పారిపార్శ్వకుఁడు—[ప్రవేశించి] అయ్యా! ఇదిగో వచ్చియున్నాఁడను. నేనేమి జేయవలసియున్నది ?

సూత్ర—ఓయీ ! సాయంకాలమునుండి ప్రయత్నము జేయుచున్నను నీవిప్పటికిని రంగకృత్యమును సిద్ధముచేయలేకపోతివా ?

పారి—అయ్యా ! మీరు నిష్కారణముగా నాపై నేరము మోపుచున్నారు. అంతయు నీవఱకే సిద్ధమయి యున్నయది. సభాసదులతో మనముఁ బ్రయోగింపఁబోవు రూపకమును గూర్చి మీరు చెప్పవలసినది చెప్పకపోవుటయే యాలస్యము.

సూత్ర—ఏమీ! నాదే యాలస్యమా? అట్లయిన నిదిగో చెప్పుచున్నాఁడను. రసికశిఖామణు లగునోసభాసదులారా! విద్వజ్జనవిధేయుఁ డగు బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహకవిచేత నాంధ్రభాషలో రచియింపఁబడిన ప్రసన్నయాదవ మనువీరరస ప్రధానరూపకమును, మే మీరాత్రి యిచ్చటఁ బ్రయోగింపఁదలఁచుకొన్నారము. కావున మీరు సావధానులరయి చిత్తగింతురు గాక!

పారి—అయ్యా! ఈనాటకగుణాగుణంబులం గూర్చి యించుకేనియుఁ జెప్పవైతివేమి?

సూత్ర—దానిఁగూర్చి చెప్పఁదగినవాఁడను నేను గాను.

ఉ. కవి సొన్నారి, కృతు ల్నగల్, కథయె బంగారంబు, శ్లేషాది స
త్కవనంబు ల్నగిషీపను, ల్లసదలంకారంబు లుద్యన్మణీ
నివహంబుల్; క్రుతిపేల్మి యెట్టిదియొ, తన్నిర్మాత నే ర్పెట్టిదో
వివరింపందగు నాణెకాండ్రు గద! యుర్వి న్పండితగ్రామణుల్.

పారి—ప్రబంధ మెట్లున్నను బ్రయోగకుశలుర మగుమనము సభాసదుల రంజింపఁ జేయఁగలమని నేఁ దలంచెద.

సూత్ర—ఓపండితమన్యా! గర్వోక్తులతో నేమి ప్రయోజనము?

క. తనరూపము, తనవిద్యయుఁ
దన నేర్పును దనగుణంబు దనగానము, గ
న్గొని యెవఁడు సంతసింపఁడు?
తనవిషయము నెంచ నొరులె తగువారుసుమీ!

మఱియు నీ వనినయట్లు మనము ప్రయోగకుశలులమే యయిన నంతమాత్రమున సభాసదులు సంతసిల్లరు, ఏమనిన—

ఉ. కృతి రసవంతమయ్యు నది కింపొనఁగూర్పదు నాటకు లను
రతమెయి నాడకుండినఁ; బ్రదర్శకు లెల్లఁ బ్రయోగపద్ధతి
జ్ఞతురులె యైన నేమి కృతి చప్పని దైనపుఁ డాప్రయోగము
న్నతియును మంచిదైనపుడె నిండుముదం బగుఁ జూచువారికిన్

పారి— అట్లయిన గ్రంథచమత్కృతియుఁ బ్రదర్శకులసామర్థ్యముఁ గనిపెట్టుటకు సభాసదులు మాత్రము నేర్పరులయి యుండవలదా ?

సూత్ర—ఓయీ! ఇటు వినుము.

తే. గీ. కవియు నాటకు ల్నేర్పరుల్గావలయును
సభ్యు లగువార లెప్పుడు చతురమతులె
వంటకత్తియ జాణ గావలయుఁ గాక!
తినెడువారికిఁ దద్రుచు దెలియకున్నె ?

పారి—సరే! చతురమతు లయినసభాసదు లందఱు కావ్యమునందును మన ప్రయోగమునందును గల గుణమ్ములు గ్రహించి యానందింతురు గాక!

సూత్ర— గుణగ్రహణపారీణులే యట్లు జేయుదురు. తదితరులు దోషాన్వేషణముఁజేయుచుందురు. అయినను నీ నాటకమును బ్రయోగించునపు డెల్లసభాస్తారులతో నిట్లు మనవిజేయుమని కవి యాన తిచ్చియున్నాఁడు.

తే. గీ. సత్కవి యొనర్చు కావ్యంబు సరసువోలె
స్వచ్ఛమై రసవంతమై సౌఖ్యద మగుఁ
గుటిలధీవరు లరసములు గ్రోలలేక
నీచగతి విహారములకై నెమకికొందుర.

మఱియు

తే. గీ. శ్రీపురాణపండకులాబ్ధి శీతకరుఁడు
సరసుఁ డాంధ్రగీర్వాణభాషావిదుండు
మల్లయార్యుండు నావేనమామ యగుటఁ
గవిత యెటులున్న నీకృతిఁ గణుతిఁ గాంచు.

పారి—అయ్యా! నీవు సభాసదులతోఁ జెప్పవలసిన దంతయుం జెప్పితివి గనుక నేనిక నాటకప్రయోగమున కారంభించెదను.

సూత్ర—వేషము లన్నియు సిద్ధము జేసితివా ?

పారి—సిద్ధమయి యెంతసేపయినది? అదిగో ! మనమిత్రుఁడు మహేంద్రుని వేషము ధరించికొని మహావైభవముతోఁ గొలువుండుటకు ముచ్చటపడుచున్నాఁడు.

సూత్రి—(చూచి) ఔనౌను. ఈసభాసదులతో నింకొకమాట మనవిచేసి పోవుదము. ఓసదస్యులారా !

మ. అమరాధీశునికొల్వుఁ జూచి యటుపై నయోధ్యావర్ణ్యశ్రీమంజువా
క్యము లాలించి సుఖించి, ద్వారకను సత్యాపద్మగంధీసమే
తు మురారాతినిఁ గాంచి, మీఁద హరి దైత్యుల్ పోరు సంగ్రామమ
ధ్యమునం దించుక నిల్చి, మీమనసు లత్యానందముం బొందుతన్.

[అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.]

ఇది ప్రస్తావన.

ప్రసన్నయాదవము

ప్రథమాంకము.

రంగము—ఇంద్రసభ.

[అప్పుడు పీఠములమీఁదఁ గూర్చుండి మహేంద్రుఁడు, బృహస్పతి, జయంతుఁడుఁ బ్రవేశించుచున్నారు.]

మహేం—(విచారముతో నిట్టూర్పు విడిచి) ఆచార్యా!

పొడ వడఁగెన్ హిరణ్యకశిపుండు, గతించెను దారకాసురుం
డడఁగెఁ గథావశేషుఁ డయి యాదశకంఠుఁడు, మాకిఁకన్ భయం
బుడిగె నటంచు నిత్రిదివ ముద్ధతదానవకంటకంబ యా
య్యెడుఁగద యంచు నేఁ దసగ నీనరకుం డెటునుండి వచ్చెనో. 1

బృహ—మహేంద్రా! ఎటునుండి వచ్చెనో యననేల? పద్మగర్భుని యవివేకమునుండియు మన మందభాగ్యమునుండియు—

ఆ. వె. మొదలఁ జేసినాఁడు పిదప దైత్యుతపంబు
మెచ్చినాఁడు వరము లిచ్చినాఁడు
వేల్పుఁబెద్ద యనుచుఁ బేరు పెద్దయె కాని
యతఁడ చేసె మనకు నధికహాని.

మహేం—పద్మగర్భుని నిందించుటకన్న మనభాగధేయమును దూరుట యుక్తము. నేఁ జేసినదోస మేమోకాని యీనాపరిపాలనము దినదినగండము వేయేండ్లాయు వన్నట్టు లున్నది. ఒకరాక్షసుఁడు గాఁడు. ఒకనాఁటి పరితాపము గాదు. మూఁడు జగంబులకు నేకచ్ఛత్రాధిపత్యంబు వహించి ముప్పదిమూఁడుకోటులదివ్యులకు నాయకుఁడ నయిన నేను క్షణక్షణము నసురభీతిచేఁ గుండెలు జేతఁబట్టుకొనియుంటఁ జూడ నాలో నాకె సిగ్గగుచున్నది. అనవరతచిత్తసంక్షోభకారణ మయిన యీసామ్రాజ్యంబు నేలుటకన్న నిరపాయంబును, నివృత్తసకలలౌకికవ్యాపారంబును, నిర్మనస్తాపమును నగుముని వృత్తిఁబూని నారాయణుచరణంబు శరణంబుగాఁ గాసలనుంట సముచితం బని తోఁచుచున్నది. అమరపక్షపాతి యగు నబ్జనాభుం డెన్నెన్ని యవతారంబు లెత్తి యెందఱెందఱి దైత్యులం దునిమినను నిర్జరులభాగ్యదోషంబున వారి కులంబులు తామర

తంపరలయి నానాఁట నభివృద్ధిఁ జెంది యినుకపాతరలట్లు తఱుఁగకున్నవి. పాపనిరతంబును, గుణరహితంబును నగు నాయధమదానవానీకంబునకు వంగి వంగి జోహారు లొనర్ప లేక, యొదిఁగి యుండలేక, సపర్యలు సలుపలేక, విసిగిపోవుచుంటిని. ఈనరకాసురుండు ముఖచ్ఛేదనమున సోమకునికన్నఁ, క్రౌర్యంబున దారకునికన్న, మగఁటిమి హిరణ్యకశిపునికన్నఁ, బరకాంతాసక్తి రావణునికన్న మిన్నయట! విశేషించి లోకభయంకరుండు మురుండును, దుష్కార్యారంభుండు నిశుంభుండును, క్రూరస్వభావుండు హయగ్రీవుండును, శౌర్యధనుండు పంచజనుండును వానికిం బాసటయయి వచ్చి నాలుగుభుజంబు లట్లుపనసింతురు. ఇంతకు వారిపైకరిగిన మనబలగంబు గతి యేమియయ్యెనో తెలియదయ్యె. నేఁ డది యేమో కాని శూరజనసులభంబగు నుత్సాహము నాహృదయమున నెలకొనియుండలేదు. నాయనస్సు పరాజయమునే శంకించుచున్నది.

బృహ—మహేంద్రా! వెఱవ నేటికి ?

తే. గీ. మూఁడుదలఁచిన మేల్కీళ్ల నీడ లట్లు
ధృతియు భీతియుఁ బొడసూపు హృదయమునను
సాధుజనములు వానిసూచన లెఱింగి
భావిగతుల బుద్ధిని నెంచి పని యొనర్తు.

వెఱచినమాత్రమున నాపదలుదూరమునకుఁ బోవు. ధైర్యమూనిన నవి సమీపమునకు రావు. వగచి జేయునది లేదు. కావున నుదాత్తపురుషలక్షణ మగు ధైర్యము విడచి యుండరాదు.

జయం—ఆచార్యా! అసురేశ్వరున కింత వెఱఁగుపాటుఁ గలిగించు నా దైత్యుఁ డెవ్వరి కుమారుఁడు ? ఏమి మహిమవాఁడు ? ఈయుదంత మెఱిఁగింపఁబోలునేని నా కెఱిఁగింప వేఁడెదను.

బృహ.—వత్సా! ఎఱిఁగింపరాకేమి? చెప్పెద వినుము. వినియుందువు గదా తొల్లి భువనకంటకుఁ డగుహిరణ్యాక్షుఁ డనుదానవకులసార్వభౌముఁడు కలఁ డని. ఆతఁడు తన మగఁటిమి నిర్జరుల కజేయుఁడై భూమిదేవిని సిలుగులఁబెట్ట నాకారణమున ననవరతమా దేవపక్షపాతి యగు నారాయణుండు శ్వేతవరాహరూపమెత్తి యారక్కసుఁ బరిమార్చి భూమిదేవిని నుద్ధరించి తనకొమ్మున ధరియించి బుజ్జగించె. అప్పుడు పురుషోత్తమునకును భగవతియగు వసుంధరకును నరకుఁడు జన్మించె. పదపడి వాఁడు తన తపోవిశేషమున వారిజాసనుని మెప్పించి వరములఁ బడసి మర్త్యలోకము జయించి దివమును జట్టుముట్టి యిప్పుడు మనకు వెఱపుఁగొలుపునంతవాఁడయ్యె.

జయం—[ఆశ్చర్యముతో] ఏమి? భువనరక్షణపరాయణుఁ డగునారాయణు నకును, విశ్వహితకారిణి యగుధారుణికిని నుదయించిన నందనుఁడో యితఁడు? ఈతఁడు నింద్యకర్మములకు వెనుదీయనిరక్కసుఁ డె ట్లయ్యెను?

బృహ—కుమారా! ఆశ్చర్యమేల? చూడుము.

తే. గీ. నిఖిలజనులకుఁ జల్లనినీడ నిచ్చు
వృక్షశాఖలు రాపాడు వేళలందు
పొడమ నగ్నికణము కాల్చు నడవు లెల్ల
జన్మభూమితో నేమి యసాధ్యమునకు.

మహేం—కుమారా! ఇది యట్లేన చూడుము.

తే. గీ. జలదములనుండి పిడుగులు జారుచుండు
మంచివారికి ఖలులు జనించుచుండ్రు
నంతమాత్రాన సద్భావించవలదు
ఖలులకెపుడైన నుత్తమగుణము గలుగు ద్రు.

జయం—అయ్యా! మీరు సెలవిచ్చినదంతయు నిశ్చయము. మా పుత్రకుఁడతులం బగు కాఠిన్యమునకుఁ దోఁడు గలస్థయిర్యంబునను సత్ప్రతిపాద్యప్రతాపంబునను నాఁడు క్రమంబునఁ దల్లిదండ్రులఁ బోలి పుట్టెఁ గావున నతఁడు నిజ్జ్యాయ కడే మనుచుంటిని తోఁచు చున్నది; యుద్ధవార్త దెలుపుటకు సమరాంగణంబునుండి యింతవరకు నెవ్వఁ డొక్కఁడు రాకుండుటకుఁ గారణ మేమయి యుండును?

బృహ—అదిగో నెవ్వఁడో యిటు వచ్చుచున్నాఁడు. (పోల్చిచూచి) కుబేర పరిజనుఁ డగుమాణిభద్రుఁడు.

మహేం—ఈతఁ డేమివార్త చెప్పనోకదా! ముఖవైఖరి కీడును సూచించెను.

[అప్పుడు మాణిభద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మాణి—(తనలో) కటకటా! నేను మిక్కిలి మందభాగ్యుఁడను. ఈశ్రవణ కఠోర మగువార్త మహేంద్రునకు నే నెట్లు విన్నవింతును? అయినను స్వామి యగు కుబేరుని నియోగము నడుపక తప్పదుకదా!

చ. అనుపమధర్మమార్గచరు లైనసుపర్వులు పాఱుచుండ దు
ర్జనులు కృపావిహీనులును రక్కసు లాజి జయంబు గాంచుటల్
గనుఁగొన ధర్మమే జయముగాంచెను నంట యబద్ధ మంచునున్
ఘనభుజసారమే విజయకారణ మంచును నేఁ దలంచెదన్.

[ప్రకాశముగా] రక్షింపుము. రక్షింపుము. త్రిలోకాధినాథా !

(అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

మహేం—(సంభ్రమముతో) ఓయీ ! ఏమి మూడినది ! దేవసైన్యపరాజయ మెఱింగింప వచ్చితివా ?

బృహ—నాకలోకము ముక్కడిరక్కసుల పాలయినదా ?

జయం—దేవకాంతల యదృష్టములు విపరీతములై యయ్యెనా ?

మాణి—[లేచి) దేవా ! మందభాగ్యుఁడ నైననేను దేవరకు దేవసేనల విజయ మంగళవార్తలు దెలుప నోఁచుకొననైతిని.

మహేం—ఆదేవాసురసమరము మన కశుభపరిణామ మెట్లయ్యెనో సంగ్రహముగా మాకెఱింగింపుము. కాలోచితముగ వలయుప్రతిక్రియ యొనర్చుకొందము.

మాణి—(అంజలిపట్టి) దేవరవారు రవధరింతురుగాక ! ఆవిధమున ముర, నిశుంభ పంచజన, హయగ్రీవ సమధిష్ఠితంబులయి దైత్యదానవానీకంబులు లోకంబులు మ్రింగు లాగున నార్చుచుఁ దేర్చి నిల్చిన, యమ, యాదఃపాల, దహన, ధనప, పవన, పశుపతి ప్రముఖు లగుదిక్పాలకులు వేలుపుమూఁకలం గూర్చుకొని యరదంబులు, ద్విరదంబులు, బాణంబులు, తూణంబులు, హయంబులు, భటచయంబులు, నాయత్తంబు గావించుకొని మొగంబులు పన్ని యెదుర్కొనుటయు నుభయబలంబులు నోహరి సాహరిఁ బెనఁగి సమరం బొనర్చె. అప్పుడు నిర్జరసైన్యారణ్యంబుపయిఁ గారుచిచ్చుమచ్చున దైత్యనాయకుఁడు పెచ్చు పెరిఁగి,

సీ. కలుషుఁగిత్తులఁబూని కౌబేరబలముఁ జెఱకుఁగిట్టల నట్లు నఱికినాఁడు
యమకాలఁ జెలరేఁగి యగ్నిదేవునిమూఁక సన్నచీమల నట్లు చమిరినాఁడు
గుదియఁ జేతనుఁబూని కదిసి వాయుని సేన నాలమందల నట్లు తోలినాఁడు
శరపరంపర లేసి జముబంట్ల మేనులు చించి జల్లెడ లట్లు జేసినాఁడు
క్రొవ్వులుఁబోలు దైత్యులకోర్తలఁ జెడి
వేల్పు లలమేఁకలటుపాటి విఱుగవలసె
దిక్కుతెలిసవార లోదివిజనాథ !
దిక్కుమాలినవారలై తిరుగవలసె.

మఱియు సేనలు పోయినపోకఁగాఁ దిరిగి జూడక చనుటయు,

తే. గీ. సుకృశానుని తేజంబు మంటఁ గలసె,
నాఁటివరుణదేవునిశక్తి నీటఁ గలసె,

నెచటికో వాయుబల మెల్ల నెగిరిపోయెఁ,
జిక్కె సగమయ్యె నీశానుఁ డుక్కుదక్కె.

మహేం—[విచారముతో] అన్నన్నా! ఎంతకష్టము! అన్వల నేమయినది.

మాణి.—అనంతరము సంగ్రామప్రసిద్ధు లగుసిద్ధులును, రిపుజనదుస్సాధ్యు లగు సాధ్యులును, పరాక్రమవార్యత్ములగు యక్షులును, ధనుర్విద్యాధరు లగువిద్యాధరులును గరుడగంధర్వాదు లగుతక్కిగిల ఖేచరులును, నిశాచరులం దలపడిరి.

బృహ—దైవము వారికయిన దోడుపడకపోయెనుగాఁ!

మహేం—దానవులకుఁ దోడుపడియె ననుఁడు. ఆతరువాత నేమి జరిగినది?

మాణి—ఏమి జరిగినది యని యడుగ నేల? ఈయశుభము తుదముట్టఁజెప్పెద వినుండు.

తే. గీ. అసురసేన విజృంభించి యంతదఱుపు
వేల్పుజోదులు వెన్నిచ్చి విఱిగి చనిరి
యొకఁడు పోయినదెసకు నింకొకఁడుపోక
తెగినహారంబులోని ముత్తియములట్లు.

బృహ—సరే! ఇంక వినవలసిన దేమియున్నది?

ఆ. వె. జ్వలనదేవుఁ డోడె, జలధినాయకుఁడోడె,
దండపాణి యోడె, ధనదుఁ డోడె
కూల్చువాఁ డెవండు కుటిలదైత్యులఁగ్రొ
వ్వనుభవింపవలయు నంతెగాక.

మహేం—అయ్యా! మాణిభద్ర! ఇప్పుడు నాయనుంగునెచ్చెలు లగుదిక్పాలు లెందున్నవారు?

మాణి—దేవా! ఎందున్నవారని తెలుపుదును! కొందఱు పలాయితు లగుచుండ దానవులు వారినిఁ బట్టుకొని బంధించి శిబిరంబులనుంచిరి; కొందఱు వాహనంబుల నెక్కియు మఱికొందఱు పాదచారు లయియుఁ దల విరియఁబోసికొని వెనుక జూడక పోయెడుచో తెలియంగక దానవులబారిఁ బడక తప్పించుకొన నూదనిఁ బాఱు చుండిరి. కొందఱు పరువిడలేక యెందేని నక్కి ముక్కియున్నవారు.

మహేం—హా సఖులారా! దిక్పాలులారా! మీకెట్టిగతి ప్రాప్తించెను! ఓయీ దండధర! ఎన్నఁడును నీడవోని నీకాలదండమునకు నేఁ డింతపాటు వచ్చెనే! నిజ

ప్రతాపప్రకంపితకాలకంఠుఁడగు దశకంఠునిఁ బూరికిం గొనని నీమగంటిమి తుచ్ఛుఁడగు నరమునిస్త్రోల మొక్కవోయెనే? ఓయివరుణా! మృత్యుపాశసంకాశంబు లగు నీపాశంబులు దనుజశరీరప్రదేశంబుల నిర్దగ్ధంబు లయ్యెనే? అగ్నిదేవా! శాత్రవసేనాతూలంబులంగాల్చు నీకీలంబులు దనుజులకుఁ జంద్రకిరణజాలంబులయి తోఁచెనే? ఓయీ నైర్ఋతా! వజ్రం వజ్రేణభిద్యతే యనునట్లు మాయాబలశోభితు లగుదానవులను దానవాంశమునఁ బొడమిన నీవు నిర్జింతు వని కొంత యాశతో నుంటిమి. అదియెల్ల వమ్మయ్యె. మిత్రమా! కుబేరా? నిరుపమానుగ్రహసమర్థుఁ డగుభగవానుఁడు కాలకంధరుఁడు నీకు సంగడికాఁడై నిను గాచుచున్నను నీకీపాటులు దప్పవయ్యె.

ఆ. వె. నరకుఁ డేఁచినాఁడు నారాయణుఁడు తోడు
సురవైరితోడ నుసి కటించు
జింత దక్కియుండఁ జెట్టు లింతలుపుట్టె
నుక్కువేఁడఁ గాల్చె లక్కశిల.

జయం—అయ్యా! మిక్కిలి యధైర్యము పడియెదవేల? ఆపత్సమయంబున శూరు లనుసరింపఁదగినమార్గ మనుసరింపుఁడు.

మాణి—మహేంద్రా! ఊరక యధైర్యముపడి యేమిజేయుదురు? ఇంకను నాచరింపవలసిన దింక కలదు. నేను చెప్పునది సాంగముగా విని సమయానుకూలముగా నెయ్యది కర్తవ్యమో దాని నొనర్తురు గాక!

మహేం—అట్లయిన నీచెప్పవలసినదంతయుఁ జెప్పుము వినుచున్నాఁడను.

మాణి—పిమ్మట యక్షేశ్వరుఁడు కుబేరుఁడు రణరంగమునుండి తొలఁగి తన మాయమున్నైఁ గూడుకొనుచుండి పరుగిడుచు మార్గాయాసముచేత వగర్చుచు నెంతయుఁగష్టమున నన్నుఁజేరి యిట్లు సందేశ మంపె. త్రిలోకాధినాథా!

చ. నే నిటులైతి; నాజి రజనీచరవీరుఁడె గెల్చె; వాయు, వై
శ్వానరముఖ్యులుం దొలఁగి పాఱిరి, కావఁగదయ్య నందనో
ద్యానము, సంగనాతతి, సుధాకలశంబును, పారిజాతసం
తానసముఖామరద్రుమవితానమును, న్మన కామధేనువున్.

మహేం—మిత్రమా! కుబేర! ఆపత్సమయమునందును స్వామిహితమును మఱవని నీచరిత్రము శ్లాఘాపాత్రము. ఓయీ! మాణిభద్ర! అట్లయిన నిప్పుడు రాక్షసేంద్రుని యుద్యమ మేమి?

మాణి—దేవా! దురాత్ములయినశాత్రవులు జయమొందినపుడు పరాజితులయిన పగతుర నేమి సేయుదురో యదియే వానియుద్యమము.

బృహ—అదియేదో తేటతెల్లముగా నెఱిఁగింపుము.

మాణి—దానవబలంబులు దేవబలంబులను నుఱుమాడి వెన్నంటి తఱుముచుండ మేఘగంభీరభీషణంబు లగుఘోషణంబులతో రాక్షసరాజు తనబలంబుల కిట్లని యానతిచ్చె.

ఆ. వె. పూలతోఁట లనక పుణ్యభూములనక
రాజనగరు లనక రచ్చ లనక
వేల్పుఁబ్రోలు సొచ్చి వీరదానవులార!
కొంకు జంకు లేక కొల్లఁగొనరొ.

బృహ—అట్లయిన మనము మనజాగరూకతమీఁద నుండవలయును.

మహేం—ఆచార్యా! ఎయ్యది యీయవసరమం దాచరణీయమో, యెయ్యది యనాచరణీయమో నే నెఱుఁగఁజాలకున్నవాఁడ. మనసేన దన్ను దెలియఁగును, రాక్షసుల యున్న తెఱఁగును విని నామనమున సముత్సాహంబు డిందుపడినది. త్రిదివంబు విడిచిపోవుచున్న పరిజనంబులు పడునగచాట్లు తలంపునకు వచ్చి కన్నుఁగాలు కదపనీయవు. దానవు నెదుర్కొందమన్న వాని నోర్చు టరిది. కావున నిప్పుడు నేనే మార్గ మవలంబింపవలయునో మీరు నిర్ణయింపవలయును.

[తెరలో.]

ఓహో! సిద్ధ, సాధ్య, విద్యాధర, గంధర్వ, యక్ష, కిన్నర, ఖేచరులారా! త్రిలోకాధినాథుఁ డగుమహేంద్రుఁ డెందున్నవాఁడు? ప్రాగ్జ్యోతిషాధినాథుఁ డగుదానవేశ్వరుఁ డాతని దర్శనము సేయవచ్చినాఁడు. కావున నాతఁ డున్నతా వెఱిఁగింపుఁడు.

బృహ—(ఆలకించి) కడపటిపని చేయుటకు రాక్షసాధముఁ డిదిగో నీదెసకే వచ్చినాఁడు.

మహేం—ఆచార్య! ఆచార్య! కర్తవ్యము! కర్తవ్యము!!

జయం—అంతఃపురరక్షణ మవశ్యకర్తవ్యము.

ఆ. వె. శౌర్యశక్తి దలఁపఁ జనకయుండుట వేలు
శత్రుధాటి దలఁపఁ జనుట వేలు
రెండు పోల్చిచూడ మొండిరక్కసునకు
సకల మిచ్చి చనుట చాల మేలు.

మహేం—అట్లయిన స్త్రీలగతియేమి? తక్కుంగలవారలగతియేమి?

సీ. కనఁబడ్డసతినెల్లఁ గవయఁజూచెడు నీచు గారవించునె వేల్పుఁగన్నియలను?
మాపేరు వినినంత మండిపడెడుదాయ ముద్దుసేయునె నాదుపుత్రకులను?
స్వర్గమంతయుఁ బాడుసలుప నెంచెడుకూళ విడిచిపోవునె కల్పవృక్షములను?
మునియాగపశువుల మ్రుచ్చిలించెడుపాపి యపహరింపఁడె వేల్పుటావు నకట?
కరుణ యెట్టిదో యెఱుఁగని కటికచెనఁటి
బ్రతుకనిచ్చునె నింక నైరావతమును?
ముజ్జగంబులదొర కింత మూఁడు ననుచు
నించుకేనియుఁగలనేని నెఱుఁగనైతి. 15

బృహ—నాఁ డెంతఘాతుకకర్మనయిన నొనర్చుటకు సందేహింపఁడు. కావున, నచ్చరలను, దక్కుంగల వియచ్చరాంగనలను మేరుపర్వతగుహాలకుఁదోడ్కొనిపొమ్మని జయంతకుమారు నంపుట యుచితము. అమృతభాండమును కాముగవియు వారలతోఁ బోవుఁగాక!

మహేం—అట్లయిన నింక జాగొనరించిన ప్రయోజనమేమి? వత్సా! జయంతా!

చ. తడయకుమన్న! దానవకదంబము సేరకమున్న వేలుపుం
బడఁతులతోడ మీజనని భద్రముగాఁ గొనిపోఁ గదన్న! కా
రడవులకైనఁ బర్వతగుహాంతరభూములకైనఁ జెచ్చెర
న్గడువఁగఁ గొంతకాల మిటఁ గ్రమ్మఱవత్తురుగాక యందఱున్. 16

మఱియుఁ బులోమునిగారాబుపట్టియుఁ జతుర్దశభువననాయకుని పట్టమహిషియు, ననూర్యంపశ్యయునగు మీయంబతో నాలుబిడ్డలసంరక్షణము సేయఁజాలనివజ్రపాణి యిట్లు చెప్పె నని పలుకుము.

చ. మనమునఁ దొంటిసంపదలమాట దలంపకు, శోక మెచ్చు; నొ
క్కనెలవునంద కష్టములు గాఁపురముండునె యెల్లయప్డు; మే
ల్దినములు వచ్చు; వెండియును దివ్యుల కోసఖి! యాకురాలువే
ళను జిగిదూలుచెట్లు మరల న్మధుమాసమున న్జిగుర్పవే?

జయం—దేవా! అట్లయిన మీరానతిచ్చినట్లు జేసెద. (అనిపోవును.)

[తెరలో.]

చ. తునియలుగాఁగఁ గొండలను ద్రుంచినదోర్బలశాలి, యాయహ
ల్యను వలపించినట్టి రసికాగ్రణి స్వర్గపురైకనాథుడున్

గను లోకవేయి దాల్చి జగత్త్రయము గనిపెట్టునేత, య
య్యనిమిషనాథుఁ డేడి దనుజాధిపుఁ డాతనిఁ జూడఁ గోరెడున్. 18

బృహ—అదిగో నడచుచున్న తమాలవృక్షములో, పుంజీభూతము లగు కాఱు చీఁకటులో యన రాక్షసులు మన యున్న దెసకే వచ్చుచున్నారు. ఇదియును మేలే. ఇంతలో జయంతకుమారుఁడు కాంతాసంతానమును నిరపాయముగాఁ గొనిపోవచ్చును.

మహేం—ఆచార్యా? ఇపు డీతనితో నెట్లెదుర్కొని సంభాషింతము? సామ వాక్యములతోఁ బట్టుపఱచిన సంధికి సంగీకరించునేమో ?

బృహ—ఎంత వెఱ్ఱివాఁడవు ! దురాత్ముఁడు శాంతవచనములఁ జక్కఁబడునే ?

తే. గీ. అధముఁ డగువాని సామవాక్యముల యోగ్యు
లనునయింప నాతని యల్క యినుమడించు
నెఱయఁ గ్రాగిన చమురుపై నీళ్ళు చల్లఁ
బొగయు మంటయుఁ బుస్సున నెగయునట్లు. 19

మహేం—అట్లయిన నతఁడు రాకమున్న యనుష్ఠేయము నుపదేశింపుఁడు.

బృహ—అది యీపాటికే యుపదేశింపఁబడినది. అయినను మఱియొకమాఱు చెప్పెద. ఆదానవుఁ డీకొలువుకూటముం జొచ్చినతోడనే నీవును నేనును మనవైరమును మనమనములనుండి దూరముగఁ దోలి యతని సబహుమానంబుగ నెదుర్కొని చింతామణీభద్రపీఠంబున నాసీనుఁ గావించి నాకభువనంబును, నందనవనంబును, గల్పభూరుహంబును గనకాంబుజములు వాని కొసంగి మనము దొలఁగుట కార్యము.

మహేం—మన మెచ్చట నుండవలసినవారము ?

బృహ—మేరుగుహలచెంతనో, మానససరోవరములపొంతనో ?

మహేం—మన కీదుఃఖమునుండి విమోచన మెప్పుడు ?

బృహ—రాక్షసుని మరణసూచన మెప్పుడో యప్పుడు.

మహేం—అది సంభవించు టెట్లు ?

బృహ—ఇట్లు ఆశ్రితావనపరాయణుఁ డగునారాయణుఁడు దుష్టదానవనిగ్రహంబునకును, శిష్టమానవానుగ్రహంబునకును యాదవవంశమున నుదయించెనని పరమేష్ఠి సనత్కుమారునకుఁ జెప్పుచుండఁ దొల్లి యొకనాఁడు నేను వింటిని. మనమా దేవకీనందను నాశ్రయించి యీవిపత్సాగరము నీఁదుదము. అతనిచేతఁ గానితదన్యునిచే నీలోకకంటకుఁడు పిల్కుమాగడు. మేటిరాకాసులఁ బోకార్ప నతఁడు కంకణము గట్టియున్నవాఁడు. ఆనందనందనచరణారవిందముపాలఁ బడినవారు చెడినవారు లేరు.

మ. అగదంకారము లాజవంజవతమోహారప్రభావంతము
ల్జగదానందదముల్ సురారియువతీసౌభాగ్యలుంటాకము
ల్నిగమోర్వీజశిఖాప్రనాళములు కాళీయాహినిర్బంధముల్
భగవంతుం డగుదేవకీతనయు శుంభత్పాదపంకేజముల్.

కావున నాపుండరీకాక్షునకడకు మాణిభద్రుని నుచితసందేశముతోఁ బుత్తెంచుము. దాన మన నెంజిలి సమగ్రముగాఁ దీఱును.

మహేం—అవివేకాంధకారాతిశయమునఁ జెన్నుగానక తిరుగులాడుచున్న నా మనస్సునకు మీవచోదీపికలచేఁ జక్కనిదారి పొడకట్టెడి. అట్లొనర్చెద. అయ్యా! మాణిభద్రా! నీవు మాకు దూతవై యసురకార్యము నిర్వర్తింపవలయు. ఇదిసకలభువనహితము.

మాణి—దేవా! ఆజ్ఞాపింపుము. సేవకునకిది మహాప్రసాదము.

మహేం—అట్లయిన నో మాణిభద్రా! జగద్భద్రసంధాయకుఁ డగు వసుదేవుఁడు వాసము సేయు ద్వారకానగరమున కేగి యందుండు కమలాకరప్రభాకరుఁ డగు నా పుండరీకలోచను సందర్శించి దివౌకసులయాజ్ఞ సవినయముగా విన్నవించి,

సీ. కాళీయఫణిఫణాగ్రములఁ దాండవమాడు నడుగుదమ్ములకు జోహారులనుము
అదితికశ్యపులకు నవతరించిననాఁడు మాకొసంగినమేలు మఱువకనుము
అసురసంతతియిట్టు లిట్టిబాట్లు పఱచుచుండ నోపనికైవడిఁ జూచుటొప్పదనుము
ఈతెఱంగునఁ జేయ లాతివారమె మేము చాలకాలమునాఁటి సఖులమనుము

ఆలుబిడ్డలదెసఁజూచి యమరవిభుఁడు
వేయుగన్నుల బాష్పము ల్విడిచెననుము
అసురఁ గడతేర్చుమని తన కలఁతి యనుము
దైవహిత మాట నియ్యది తప్పదనుము.

మాణి—దేవా! అట్లంతయు విన్నవించెదను.

బృహ—దానవుఁడు వచ్చునటుకు నీ విటనుండి యతనిపల్కులువిని చెయిద ములఁగని యవ్వల నరుగుము. అప్పుడు నిర్జరులయవస్థ యాదవేంద్రునకు సమగ్రముగ నెఱిఁగింప నవకాశ ముండును.

మాణి—హా! కష్టము. కష్టము. దానవసైన్యంబులు సవిధభూములకు రానే వచ్చినవి.

బృహ—మహేంద్రా!

చ. మనమున నించుకేని యనుమానము నొందక దానవేశ్వరు
న్గని వినయంబుతో నెదురుగా జని గద్దియ జేర్చు; లావు మా
యునపుడు నల్పుఁడై యొదిగియుండుట న్యూనత గాదు; గ్రీష్మమం
దున బలుతిప్పలుంబడునదు ల్లోలు కాదునఁ బూర్తిఁ జెందవే ?

మఱియు నోసునాశీర !

తే. గీ. అధిక తేజస్వులకు నైన నప్పుడప్పు
డుచ్చనీచంబులగ్గుచుండుఁ జూవె
జగము వెలయింపఁగల సూర్యచంద్రులకును
గ్రమతనుదయాస్తమయములు గలుగునట్లు.

మహేం—దేవగురువుయుపదేశములు శిరసావహించినాఁడ.

[నరకాసురుఁడు, పంచజనుఁడు, వజ్రకంఠుఁడు ప్రవేశించుచున్నారు.]

నర—ఓయీ పంచజనుఁడా! బాహుబలంబున, బుద్ధివైభవమున మనకన్న నల్పుఁడగు మహేంద్రుని సింహాసనభ్రష్టునిఁ గావించి నాకలోకంబున నుండి పారఁదోలక మన వంశకర్తలగు నాదిరాక్షసు లూరకుండుటకుఁ గారణ మేమి ?

పంచ—దేవా ! ఆమహాత్ములూరకుండలేదు. దివిజమునిస్వర్గక్రీడారంభులయిన మనపూర్వులు త్రిలోకవిజయంబు గాంచినపుడు కుటిలుండగు విష్ణుదేవుఁడో మతిలేని శంకరుఁడో యేదోరూపములెత్తి వారలఁ గడతేర్చుచుండువారు. ఆకారణంబున నీతని కింతవిభవము జరుగుచున్నది. ఈపర్యాయము మీరున్నట్లు నిరాటంకముగా జరుగఁగలదు.

నర—(నవ్వుచు) మన దానవవీరులు నిజముగా నాదామోదరునిచేత నయినను నిహతులయిరా ? అట్లయిన వారిపరాక్రమ మెట్టిదో చూడవలసినదే ?

వజ్ర—మహాప్రభూ ! వారు వట్టిపిఱికివారు. మీ ముందఁగ వారు దిగదుడుపు నకైనను బనికిరారు.

బృహ—మహేంద్రా ! అదిగో దానవుఁడు. వాని నెదుర్కొనుము రమ్ము.

మహేం—దానవేంద్రా ! నీకు స్వాగతము.

బృహ—దానవేశ్వరా ! విజయ మగుఁ గాక !

పంచ—నీవన్నను అనకున్నను విజయ మీవఱకే యయినది.

నర—(ఆశ్చర్యము నటించుచు నింద్రునితో) ఎవరు వీరు! నముచిగర్వనిర్వాపణధూర్వహులు, పాపప్రతాపగంధసింధురపంచాననులు, బలప్రాణానిలకాలభుజంగులు నగునహల్యాభుజంగులా ? మహేంద్రా !

మ. అపరాధంబులు గల్గె మావలన చండారాతి సైన్యాటవీ
శపనోద్యద్దహనాయమానపటుదోర్గర్వప్రతాపాఢ్య ని
న్నిపు డీరీతినిఁ జూడవచ్చితిని నే నిన్నాళ్లు రాకుంటకు
న్గృపతోడన్ క్షమియింపు తమ్ముఁడఁ గదా యెంతైన దేవేశ్వరా! 24

అయ్యో! మఱచితిని. నేను మీకుఁ దమ్ముఁడ ననుట మిమ్ము రెండవమా ఱవమానించుట గదా!

వజ్ర—అజాగళస్తనములవలె నిరర్థక మయినవజ్రాయుధము ధరించి యీపరాక్రమహీనుని తమ్ముఁ డనిపించుకొన్న మీకవమానము మహాప్రభూ!

పంచ—ఓమహేంద్రా! ఓదేవగురూ! నేను పంచజనుఁడను, నరకమహారాజు బంటును.

బృహ—మేము మిమ్మెఱుంగకపోలేదు.

మహేం—దానవేశ్వరా! ఉల్లసపుబలుకులతో నేమిప్రయోజనము? శత్రురాజులపై దండు వెడలుట క్షత్రియధర్మమగుటచే నీవిటు చేసితివి ఇందు క్షమింపవలసిన దేమున్నది? జయము నొందితివని యెఱుంగుదును.

మాణి—(తనలో) ఈసమయమున నే నిచ్చట నుండరాదు. చాటుననుండి వీరి పలుకులఁ గనిపెట్టెద. (అని పోవును.)

నర—పురందరా! నామాటకు నీవింత యుడికెదవేల? అట్లయిన నుల్లసపుం బలుకులతో నేమి? నావచ్చినపని చెప్పెదవినుము.

తే. గీ. ఎల్లభువనంబులకు నీవ యేలికవఁట
బలము కలవాఁడవఁట మానవంతుఁడ వఁట
కొండ రెక్కల గొన్నింటిఁ గూల్చితివఁట
యేది చూతము రమ్మందు యించుకంత.

బృహ—(తనలో) మాయసహాయత్వము నెఱిఁగి వీఁడు మమ్ము మాటిమాటికి రణమునకుం బిల్చుచున్నవాఁడు.

మహేం—దనుజేశ్వరా! రణమునకేమి? అదియొక భాగ్యముకాదు, చూడుము.

చ. కనుఁగొన దేవదానవులు కస్యపుసంతతి వారెకావున
న్దనుజవరేణ్య! యన్నలకుఁ దమ్ములకుం బగ చెల్లునయ్య? లోఁ

గినియుక మీరు మే మెపుడు క్షీరమునీరములట్టులుండిన
స్నేహలను దేటిపోదేఁ దరమా యొకమాత్రపువాని కాజిలోకా.

నర—ఆహాహా! ఎంతకాలమునకు నేను మీకుఁ జుట్టమునయితిని?

పంచ—సోదరప్రేమ మహేంద్రుని శరీరమునుండి వెల్లివిరిసి పొంగుచున్నది!

వజ్ర—పిల్లుల కెలుకలును, దోడేళ్ళకు మేకలును నెంత దగ్గఱచుట్టములో మాకు మీరును నంతదగ్గఱచుట్టములే.

బృహ—ఓదానవసార్వభౌమా! ఈమహేంద్రుఁడు వచియించినట్లు మనయుభయకులములు పొందుపొసఁగియుంట యుచితము. మీరు రాక రాక వచ్చినయతిథులగుటచే మా కాదరణీయులరు. అందుచేఁ గూరుచుండి ప్రసంగింతము. నీవామహేంద్రపీఠము నధిష్ఠింపుము.

మహేం—దానవేంద్రా! అట్లుచేయుదును. మాకు మీరతిథులుగదా!

నర—ఓ హో హో!

ఉ. ఎన్నఁడులేనికూర్మి యిది యెచ్చటినుండి జనించెనయ్య? నీ
కిన్నరకుండు దేవవిభుఁ డెక్కడుపీఠము నెక్కువాఁడె? మీ
రన్నను నే నోర్వఁగలనా యది, యాయ్యది యెక్కువాఁడు తాఁ
గన్నులు వేయి దాల్పవలె గౌతమునింటను కోడి గావలెన్.

వజ్ర—వినుము, వినుము. అంతేసుహిమకలవాఁడే దాని నధిష్ఠింపవలెను. పాపమీమహేంద్రుఁడు కష్టపడి రేయి యనక పగలనక కోడియో కుక్కయో యయి వేయికన్నులు దెచ్చుకొన్నాఁడు. అంతపాటిశక్తి యెవరికున్నది?

బృహ—(తనలో) రాక్షసుల యెత్తిపొడుపుమాటలు భరింపశక్యముగాకున్నవి.

మహేం—(తనలో) ఇంతకన్న శూలములతోఁ బొడిచిన మేలు. కటకటా! కాల మెంతలో మాఱినది?

బృహ—దానవనాయకా! ఎన్నఁడో పోరుపాటున నొనర్చినలోపముల నెంచి యింతవానిని మీరధిక్షేపించుట మీవంటి వీరపురుషుల కుచితముగాదు.

నర—అట్లయిన మీరు హితమగుపనియే యొనర్చెదను? చిత్తగించుఁడు. ఓయీ! మహేంద్రా! భూధరపక్షచ్ఛేదనశౌండ!

మ. ధరణీరాజ్యము వీరభోజ్య మని పెద్ద ల్చెప్పఁగా విందు ని
ర్జరలోకేశ్వర! రెండపల్కుల కిటు స్వర్గిత్వ తగం బిమ్ము నీ

కరమందుం గులిశాయుధంబుఁగొని సంగ్రామంబు గావింతువా!
సురసామ్రాజ్యపదంబు నాకుఁ గరము ల్మోడించి యర్పింతువా?

పంచ—మహారాజా!

తే. గీ. కాలుదండంబు, ధనదుని కఱకుఁగత్తి,
వరుణపాశంబు, మనమీఁద వమ్ములయ్యె!
వజ్ర మేటికి ధరియింపవలయు వీఁడు?
కొండలనుతాళ్లు మఱచిచెఱ్ఱుటకెగాక.

వజ్ర—దేవా! మిమ్ముఁ జూచినతోడనే యెన్నఁడో చచ్చినట్లు నిశ్చేష్టులగు నీదేవరాజబృహస్పతులు యుద్ధము సేయుదురా? బలహీనులమీఁద నెదురువన్నచో నీయంతటివారు మఱియుండరు.

నర—మహేంద్రా? ఊరక యుండెదవేల? ప్రత్యుత్తర మిమ్ము.

పంచ—హరిమోహాయిఁకో తమకుఁ దోడ్పడువాఁడు నిరుత్తరులయియుందురు కాఁబోలు?

వజ్ర—హరియా వచ్చుట? అతఁడు తనరక్షణముఁ జేసికొన్నఁజాలు, వీరిని రక్షించినంతఫలము.

నర—అన్నట్లుమఱచితిని. ఓదేవరాజా!

మ. హరి మీపాలిటి దైవతం బనుచు దైత్యధ్వంసి యంచు న్నుతిం
తురుగా మీరలు సర్వకాలమును జేతుల్మోడ్చి; వాఁడేఁడి? య
క్కఱకు న్రాఁడదియేమి? వచ్చి మిగులన్గారుణ్య మేపార ని
ర్జరుల న్బ్రోవఁడదేమి? పిమ్మటసమాశ్వాసింపఁ దావచ్చునే?

మహేం—(తనలో) హరినీవిధముగా నిందించు వీని కేమిగతికలదోకదా!

బృహ—(తనలో) ఇట్టివైపరీత్యములు కాలమాసన్నమైనవానియందుఁగన్పట్టును.

వజ్ర—గురుశిష్యులిద్దరు బెల్లము కొట్టినరాళ్ళవలె నూరకుండెదరేల? మహారాజున కేదోయొకప్రత్యుత్తర మిండు.

మహేం—ఆచార్యోత్తమా! ప్రత్యుత్తర మొసంగుఁడు.

బృహ—దానవేంద్రా! వేయుమాట లేల? ప్రతాపానలపరిశోషితదిక్పాలకసేనాపముఖులును దృణీకృతనారాయణులును నగు మీతో సమర మొనర్ప మహేంద్రుఁ డెంతవాఁడు? అతఁడు సంధి యుచితమని యూహించుచున్నాఁడు.

పంచ—దేవదానవులవైరము సంధి జేసికొనుటకుఁ బాకము తప్పినది:

వజ్ర—ఇంద్రున కిప్పుడు భయజ్వరముచే నొకపెద్దసంధిరోగముప్రవేశించినది.

నర — మహేంద్రా! అట్లయిన నానిశ్చయము విస్పష్టముగఁ జెప్పెద వినుము.

చ. పలుకులు వింటివి నప్సరలపాటలు, జేర్చితి నీవు పేను ని
ర్మలమృదుపారిజాతకుసుమంబుల సెజ్జలమీద, నాకభూ
ములు చిరకాల మేలితివి, పూర్తిగఁ జెల్లెను వంతు మీకు దై
త్యుల కికఁ వంతువచ్చెఁ దగు దూరము పొందు తొలంగి వేలుపుల్.

దేవత లెంతకాలము స్వర్గము పరిపాలించి రంతకాలము దానవులును పరిపాలించిగాని తొలఁగరు. మఱియు స్వర్గమునుండి యొక్క పూరిపుల్ల యయినఁ గొనక యెందయిన జని బ్రతుకుఁడు. దీనికి విరుద్ధముగాఁ బ్రవర్తింతురేని యీనరకుండు నేల్పులపై జాలి నొందువాఁడు కాఁడని మీ రెఱుఁగుదురు.

సంప — దేవా! మీరు లెస్సగా సెలవిచ్చితిరి.

స్రజ — ఈపాడువేల్పులు నేఁటికాలమునకు మాయమయి తెగిలి పోవుచున్నారు.

మహేం — (విచారముతోఁ దనలో) రాజ్యలక్ష్మి! నీవు చంచల వనుమాట నేఁడు నిశ్చయ మయినది.

బృహ — (తనలో) అనుకొన్నదాని కేమియుఁ గొరత కలుగలేదు.

మాణి — (తనలో) కటకటా! త్రిలోకాధీశ్వరున కెంత కష్టమువచ్చినది. ఇఁక నే నిచట నిలుపఁజాలను. నాపనిమీఁద బోయెదను.

(అని నిష్క్రమించును.)

నర — ఓయింద్రబృహస్పతులారా! మీరాయునికి నాకోపానలంబునకుఁ బ్రజ్వలన హేతువు. గావున మీ రటనుండి సత్వరముగ బొండు.

స్రగ్ — చుట్టుపట్ల పొలిమేరలోనైన మీరు కనఁబడుదురేని మీగుండెలలో నిద్రపోయెదను. జాగ్రత.

బృహ — మహేంద్రా! ఏల యాలస్యము? పోవుదము రమ్ము.

మహేం — (తనలో)

సీ. చిరకాలమునుండి సుఖకాంక్షాచయా విబుధలోకంబును విడుచు టెట్లు
చింతామణీభద్రసింహాసనంబున్న యమరావతినిఁ బాసి యరుగు టెట్లు?
మధువైరిచరణాబ్జమకరందరసమైన మందాకినీనది మఱచు టెట్లు?
సిరికిఁ దోబుట్టువై క్షీరాబ్ధినుదయించు పారిజాతముఁ బాసి బ్రతుకు టెట్లు?
దినము నైరావతము నెక్కి తిరుగకుండ
కాలినడకను నట్టిట్టు కదలు టెట్లు?

నందనోద్యానవీథుల నడుమనుండ
నిముసమైన నేఁ జెఱచోట నిలుచుటెట్లు ?

(మహేంద్రబృహస్పతులు నిష్క్రమించుచున్నారు.)

వజ్ర—ఇప్పటికి నాకమునకు దరిద్రదశయంతయు దొలఁగి శోభ కలుగు కాలము వచ్చినది. దేవా! మీరు చింతామణీభద్రసింహాసన మధిష్ఠించి దేదీప్యమాన ప్రభలతోఁ గొలువుదీర్చి మాకన్నులకు విందు సేయవలయును.

పంచ—దేవా! ఇప్పు డీపీఠము నెక్కవలయు. భగవంతుండును దానవకుల క్షేమంకరుండును నగు శుక్రాచార్యుని యనుమతంబున బుణ్యదినంబున సుముహూర్తంబున మీరు సురసామ్రాజ్యపట్టాభిషిక్తులగుట యుచితము.

నర—ఇది యవశ్య మాచరణీయము. ఇంతలో నాకలోకవైచిత్ర్యములఁ గనుఁ గొందము. పట్టాభిషేకమునకన్న ముందు మహేంద్రుని యంతఃపురకత్తె యగు నూర్వశిని సందర్శించుటకై నామనంబు తత్తరపడుచున్నది. దానిచక్కదనము వర్ణనాతీతమని మున్ను నారదాదిమునులవలన వినుచుందును. కావున సత్వరము పోవుదము రండు.

పంచ—చిత్తము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ప్రథమాంకము సంపూర్ణము.

ప్రసన్నయాదవము

ద్వితీయాంకము.

[మందపాలుఁడను రాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మందపాలుఁడు—(తనలో) ఛీ! ఛీ! ఈపాడుస్వర్గమున కేలవచ్చితిని? ఈ యమరావతీపట్టణమును జూచినది మొదలు నాకు 'పేరుగొప్ప యూరుదిబ్బ' యనుసామెత జ్ఞప్తికి వచ్చుచున్నది. ఈనగరము సకలవస్తుసంపన్న మనియు, సకలసంపదలకు స్థానమనియు, మహావైభవసమేత మనియు పలుమారులు మహర్షులు వేనోళ్లఁ బొగడుచుండ విని కాఁబోలు ననుకొని నామనోరథము లన్నియు సఫలంబు లగు నని పుట్టెడాశతో వచ్చి తుదకు మోసపోతిని. మునులు ముండకొడుకులు. స్వర్గముపైఁ గలదురభిమానముచే దీని నంతగా వర్ణింతురే కాని దీనియం దేమిగొప్ప యున్నది.? ఈమందాకినీనది యొక సముద్రమంత యున్నది. కాని యిందు నాకుఁ గావలసిన చేపలు, జెల్లలు, నత్తలు, పీతలు, రొయ్యలు లేనేలేవు. నోటికిరుచిగా వండించుకొని తిందమన్న నింతతూఁటికూరైన గాని యిక్కడ లభింపదు గదా! ఈనదికన్న మాయూరచెరువే నయము. ఈనదిలో బంగారపుఁదామరపువ్వు లున్నవంట అవి యెందుకు? దేవతలు తలలు పగులఁగొట్టుకొనుటకుఁ బనికివచ్చును. మూఁడుదినములనుండి నాకు ముంజెకాయలపై ధ్యానము పోయినది. దారిద్ర్యదేవతకు నిలయమైన యీవేల్పువీటియందు తాటిచెట్టే లేదుగదా? అన్నముతిని నీళ్లుత్రాగి యెఱుఁగని యీనిర్భాగ్యులగు దేవతలకు తాటిపండు తినునంతటి భాగ్యముకూడ లభించునా? ఈపట్టణస్థితిఁ జూడ నిందు వసించు వేల్పులు నాగరికత యెట్టిదో యెఱుఁగని, మోటపసరము లని నాకుఁ దోఁచుచున్నది. పోనీ. ఆవస్తువులు దొరకకపోయిన మానె నామనసున నున్న తక్కినగోరిక లైన నెఱవేఱినవా? దేవేంద్రునిపై గత్తికట్టి దండయాత్రకు వెడలు రాక్షసులందరుఁ గావలసినంత యమృతము ద్రావి చిరకాలజీవులు గావచ్చు ననియు స్వర్గలోకమునం దప్సరసలు వేనవేలుందురు గనుక నెవనికిఁ గావలసినదానిని వాఁడు శ్రమమునఁ జేయిబట్టుకొని తీసికొని

పోయి సుఖింపవచ్చుననియు సేనానాయకులగు మురహయగ్రీవులు నొక్కి పలుకుటచే కొండంతయుత్సాహముతో నేను రంభను జేపట్టి దీసికొనిపోవచ్చునని యిందు వచ్చితిని. కాని యమృతభాండ మంతరించినది. నదుసులంజ రంభ యేమైనదో యెవ్వరికిం దెలియదు, దానిజాడ దెలుపువారు నాకెవ్వరయిన గనఁబడిన బాగుండును. (అని యిటునటుజూచి) అదిగో మావజ్రకంఠుఁ డిటువచ్చుచున్నాఁడు. వీనినడిగి తెలిసికొనియెద.

[అప్పుడు వజ్రకంఠుఁడు ప్రవేశించుచున్నాఁడు]

వజ్రకంఠుఁడు—(తనలో) బళీ! బళీ! ఈ నరకమహారాజుగారు చిరకాలజీవులయి యుందురు గాక! ఈతనియాధిక్యాన మాసౌభాగ్యము నిలుచుఁ గాక! ఈమహాత్మునివలననే గదా రావణకుంభకర్ణులనాఁటను, తారకాసుర కాలిక్రమస్తులనాఁటను లేనిగౌరవము మారాక్షసకులమునకు నేఁడు కలిగినది. కాని నరకమహారాజు మహేంద్రుని యింపుడుకత్తె యగునూర్వశినిఁ గూడ పట్టికొని యపహరించుటచే నింద్రోదయము కాఁగానే నన్నుఁ దానవ్వరకు రమ్మనియాజ్ఞాపించె. ఇంతలో రంభానురాగియగు మందపాలునితో నించుక మాటలాడి వినోదించెదను. వీఁ డెవరికొఱకో నిరీక్షించుచున్నాఁడు. (ప్రకాశముగా) ఓరీ! మందపాలా! నీవెవరికొఱకు వెదకులాడుచున్నావు?

మంద—(సమీపముగా వచ్చి) ఓరీ! వజ్రకంఠా! నీ విప్పు డేమి వెదకుచున్నావు? నీకెక్కడైన రంభ యగపడలేదు గదా!

వజ్ర—ఆహా! నాకొకయాఁడది కనఁబడినది. అది రంభయే యైయుండవచ్చును. అయిన నదియెట్లుండునో నీవించుక యానవాలు చెప్పినపక్షమున దానిజాడ నీకు నెఱింగింపఁగలను!

మందపా—(సంతోషముతో) కనఁబడినదా? వెనుక రంభయాఁటసాలఁ దానిని నేను దూరమునుండి చూచితిని. అప్పటినుండి దానియాకృతి నామనసున నాటుకొనియే యున్నది. దాని కానవా లెఱింగించెద వినుము. అది చక్కనిచుక్క. దాని శరీరకాంతి తాటిపేశమువలెఁ బచ్చగ నుండును. దాని లేవ్రేకలు పసిబొగ్గులో జీడిగింజలో యనుకొనవలయును. దానికొప్పు మాలకాకివలె నప్పుడే యావములోనుండి తీసినపిడతవలె నల్లనై పెద్దదిగా నుండును. దానిజడ యినుపరిటుకాడవలాగున నుండును. కన్ను లాలిచిప్పలు. దాని పెదవి క్రొత్తావకాయపేశువలె నెఱ్ఱనై యుండును. మొగమిత్తడిసిబ్బివలె గుండ్రముగ నుండును. అది పువ్వులపావడఁ గట్టి యుల్లిపొరవంటి నీయుత్తరీయము వల్లెవాటు వేసికొని తక్కుచు తారుచు సొక్కుచు సోలుచు నిక్కుచు నీల్గుచు వంగుచు పొంగుచు నాడుచుపాడుచు నడచినప్పుడుచుక్కలలోఁ జంద్రుడులాగు, గజ్జెలగోడిగ లాగు, రామచిలుకలాగు, గోరింకలాగు, పిగిలిపిట్టలాగు, నెమలిపెంటిలాగు,

హంసలాగు తళతళలాడుచు మెలమెలలాడుచు జలజలలాడుచు చకచకలాడుచు పకపకలాడుచు నవ్వుచుఁగ భోగముదానివలె నుండును. వేయేల ? అప్పుడు దానింజూచిన మహామునుల కయిన మనసు కరఁగక మానదు. నీకది యెక్కడఁ గనఁబడినది ?

వజ్ర—నిన్నరాత్రి కలలోఁ గనఁబడినది.

మంద—(కోపముతో) నన్నెగతాళి చేయుదువా ? నీపొట్టపొడిచివెయ్య. నీకెప్పుడు నిటువంటిబుద్ధులే. నీనోరు మాటలాడుచున్న నీనొసలు వెక్కిరించుచుండును. మొదటనుండియు నొక్కమచ్చునసే బ్రతికినావు నీబ్రతుకు బండలుగాను. నేనా నీకు హాస్యమునకు దొరకినవాఁడను ?

వజ్ర—తాతా ! కోపగింపకు. ఊడుతలుపీఁకిన తాటిటెంకవలె తల గలిగి మీసములు గడ్డము నరసి ముసలియైయుండు నీకు రంభ గావలసివచ్చెఁగదాయని యెగతాళిచేసితిని. కాని నీవిప్పుడు రంభవిషయమయి చేసినప్రశ్నము మెచ్చఁదగియున్నది. నీవు నిజముగఁ గోరినపక్షమున రంభను గలిసికొను నుపాయముఁ జెప్పెదవినుము.

మంద—నాతండ్రీ ! నానాయనా ! చెప్పు చెప్పు ! ఈయుపకారమునకు నేనింకొక జన్మమున నీయింటఁ గుక్కనై పుట్టి నీఋణముం దీర్చుకొనియెదను. నాకుఁ గొడుకు పుట్టినపక్షమున నీపేరు పెట్టుకొనియెదను.

వజ్ర—ఇదిగోఁ జెప్పెద వినుము. రంభ మొదలగునప్సరసలు మనము స్వర్గమునకు వచ్చినతోడనే పాఱిపోయిరి. అయినను భయము లేదు. యుద్ధములో గడతేఱినవా రందఱు రంభాసంభోగము గాంతురు. అందుచే నీ వొకకత్తితో బొడిపించుకొని చచ్చిపొమ్ము. అప్పుడు నీకు రంభపొత్తు గలుగును.

మంద—అదిగో ! మరల హాస్యము నారంభించినాఁడవు; నేనదేవద్దన్నది. నాకుఁ గోపము వచ్చినయెడల నేను మంచివాఁడను కాను. కాఁబట్టి యామాటను మాని నేనడిగినదాని కుత్తరము చెప్పుము. రంభ పాఱిపోయినది సరే. ఊర్వశి మన కేమయిన కొంచె ముపకారము సేయునా ?

వజ్ర—ఔరా ! పిడుగా ! నీకడుపులో నెంతయూహ లున్నవిరా ! మహారాజుగారు మోహించిన యూర్వశియే నీకుఁ గావలయునుగా ! సరే ! జాగ్రత్తగా నుండు. ఈమాట మహారాజుగారితోఁ జెప్పి, నీడొక్క చీలించి, ప్రేవులు తోడించి, గ్రుడ్లు పీకించి, వెన్ను చీలించి, చెంపలు పగులగొట్టించి, బుగ్గలు సాగదీయించి, పిఱ్ఱతో శ్లైగరఁగొట్టించి, మోకాళ్ళచిప్పలు తీయించి, నాలుక కోయించి, తల గొఱిగించి, గాడిదమీఁద నెక్కించి యూరేగించి కొఱతను వేయింపకపోయిన నాపేరు, వజ్ర

కంఠుఁడు గాఁడు. మహారాజుగారి యంతరమేమి నీయంతరమేమి? తారతమ్య మెఱుఁగక మాటలాడెదవా ?

మంద—(వజ్రకంఠుని కాళ్లపైఁబడి) నాతండ్రీ! నన్ను రక్షింపుము. బుద్ధి నేరక నోటివట్టుపుకూఁతలు కూసితిని. మఱియొకసారి నేనిట్లు ప్రేలుదు నేని నన్ను నీచిత్తమువచ్చినశిక్ష చేయింపుము. కావలసినవాఁడవు గదా యని నీవద్ద నిట్లంటిని గాని యది తప్పైనచో మరల నందునా ?

వజ్ర—సరే! నిన్ను రక్షించితిని. ఇఁకముందిట్టిమాట లెన్నఁడు ననకుము ఇఁక నేఁ బోవలయును. నన్ను విడువుము.

మంద—(లేచి) నీదయచేత నిప్పటికి గండముగడచి బ్రతికి బయటఁబడితిని. నీవిప్పు డెక్కడికిఁ బోయెదవు ?

వజ్ర—నరకమహారాజుగా రూర్వశీవిరహతాపమున కోర్వక యీరాత్రి వెన్నెలలోఁ బువ్వులపాన్పుపైఁ బవ్వళింతురు. ఊరడించుటకు ప్రియభృత్యుఁడనయిన నేనా యనప్రక్క నుండవలయును. ఎన్నిదగ్గమాసముల నంపిన నూర్వశి మహారాజువద్దకు రాలేదు. అందుచే నామెను గోడితెచ్చుటకు సేనాపతియైన నిశుంభుని మహారాజు గారు పంచినారు. ఎల్లయుఁ జంద్రోదయమగునప్పటికి నేనక్కడ నుండవలయు.

మంద—అదిగో విబూదిపండో ముగ్గుబుట్టయో తెగపుప్పళ్లెమో యన్నట్లు చంద్రమండల ముదయించుచున్నది. నీవింక సత్వరముపో. నామాట నచ్చటి బైట పెట్టకుసుమీ! రంభ నీకెప్పడిప్పుడు నాతోఁ గొంచెము చెప్పు.

వజ్ర—వేయేండ్లు తెఁ క్రిందుగఁ దపస్సుచేసిన రంభకు నీవంటి రసికుఁడు దొరకఁడు. ఆమెను నీవే వెదకికొనుము. నే వెతకఁజాలను.

(అని యిద్దరు నిష్క్రమించుచున్నారు.)

ఇది విష్కంభము.

[అప్పుడు దేవేంద్రమందిరము ముందఱ నొకచంద్రకాంతవేదికమీఁదఁ బువ్వులపాన్పు పైగూర్చుండి నరకాసురుఁడు వజ్రకంఠునితోఁ గూడి ప్రవేశించుచున్నాఁడు.]

నర—ఓరీ! వజ్రకంఠా!

చ. అదిమితి నష్టదిక్పతుల నాహవభూమి నటన్న నంతసం
బొదవ దొకింప; రాజ్యగము నూనితి నంచు మహంబునందు స
మ్మద ముదయింప దించుకయు, మక్కువమై నొకసారి యూర్వశీ
పదయుగము స్పృశింపఁగలభాగ్యము నాకు లభింప కుండుటన్.

వజ్ర—దేవా ! ఆకోరికయు మీ కచిరకాలంబునఁ దీఱఁగలదు, ఊర్వశిం దోడి తెమ్మని మీరు మననిశుంభుని బంపియున్నారుగదా ! అతఁ డామె నీపాటికి వెంట బెట్టుకొని వచ్చుచుండు నని నేనూహించెద.

నర—ఆహాహా ! నా కంతభాగ్యము లభించునే ? ఒకవేళ లభింపఁ దలఁచుకొన్నను దుస్సహ మయిన యీవిరహతాపము నన్నంతవఱకు బ్రతుకనిచ్చునని నాకుఁ దోఁపదు. ఈమదనునకుఁ దోడగుట కదిగో శీతమయూఖుఁ డుదయించినాఁడు.

తే. గీ. కలసి వేల్పులు భుజియించుకంప మనఁగఁ
చంద్రబింబము వెలుఁగొందుఁ జదల నదిగో !
సురలు తినువేళఁ గంపముచుట్టుఁబడిన
మెతుకులట్టులు చుక్కలు మెఱయుచుండు.

వజ్ర—మహాప్రభూ ! మీరు సరిగా వర్ణించినారు. ఆకంపములోఁ బెట్టిన ప్రాంతయుసిరికపచ్చడిముద్దవలెఁ జంద్రునిలో మచ్చ కనఁబడుచున్నది.

నర—ఓచెలికాఁడా !

తే. గీ. విరహతాపాతిశయమున వెచ్చ నూర్చి
పికలచిత్తులై యున్న కాముకులఁ బట్టి
నూటి బొడిచెడు వజ్రంపుటీఁటె లనఁగఁ
జంద్రకిరణము ల్వ్యాపించె జగతియందు.

మఱియు,

శా. నీరేజప్రభవాండమండపమంతయును నిండె న్వెన్నెల, ల్తొవ్వయః
పారావారతరంగమాలల కనుప్రాసంబులై, దివ్యత
న్వీరంగన్నవమందహాసములకున్ సెయ్యంబులై, సాఁక
ర్ప్యారక్షోదపరాగపుంజములకు న్బ్రారానివిన్యాసంబులై.

వజ్ర—ఈవెన్నెలకతమున బ్రహ్మాండ మంతయు సున్నపుగిడసవలెఁ దెల్లనయి యున్నది.

నర—ఈచందమామకాఁకలకు, నాపుష్పబాణకాని ధాకలకు నాశరీర మింక నిలుచుట యరిది. ఈశశాంకునివి శాతశరములుగాని శీతకరములు కావు. సుధాంశుఁ డని పేరొంది నిష్ఫలం జెరగుచున్న యితఁడు పయోముఖవిషకుంభమునుమీ ! అందుచేతనే

తే. గీ. వనజనాభునికైన నవ్వజ్రికైన
నగ్ని దేవునికైన నయ్యమునికైన

వెఱచి యెఱుఁగని నే నిప్డు వెఱవ వలసె
నిండు నెలకును పండు వెన్నెలకు నకట !

వజ్ర—కామలరోగము గలవానికి జగమంతయుఁ బచ్చఁగఁ దోఁచునట్లు మదన తాపమునఁగల మీకు జల్లనివెన్నెల పీడాకరముగఁ దోఁచుచున్నది కాఁబోలు! పన్నీట దిగిన దున్నపోతువలెనే నీ వెన్నెలలో హాయిగ నున్నాఁడను.

నర—ఓరీ! నీకు బలె నాకీజాబిల్లి సుఖప్రదముగ లేదు. నేను త్రిదివముపై దండువిడిసి మహేంద్రాదిదిక్పాలకుల రణరంగమున నోడించివచ్చి నాకమునుండి యమరులఁ బాఱఁద్రోలితినని మనసుఁ గ్రోధము నిలిపి యమరపక్షపాతు లగుమన్మథహాతకుఁడు మొదలగువారు హాళాహళి మెఱయ నన్నేఁచుచున్నవారు. చూడు—

సీ. మంద్రవీజనములు మాటిమాటికి వీచి కసిగసంగఁగఁ జొచ్చె గాలివేల్పు
చలివెలుంగుల పేరి పలుబల్లెములఁ గ్రుమ్మి సంహరింపఁగఁ జొచ్చె చందమామ
కలువరేకుల పేరి కఱకుఁగత్తులఁ జీల్చి పగఁ దీర్చుకొనఁజొచ్చె పంచశరుఁడు
వనలతాంతములతో నందనమ్ము నునింపి యలయింపఁజొచ్చె నాకనివార
అక్కటక్కట! వీరియం దొక్కఁ డొకఁడె
జగము లొక్కొక్కకడకుఁ దేఁజాలు నసఁగ
దుర్మదమున నీదుష్ట చతుష్టయంబు
చేర నొక్కతావున కింకఁ జెప్పనేల ?

వజ్ర—(తనలో) ఈయన యిప్పు డూర్వశిపైఁ గలమోహముచే సమస్తమును మఱచియున్నాఁడు. వీనిమనసును నతియొకవిషయము మీఁదికి మరపెదను [ప్రకాశముగా] దేవా! స్వర్గలోకము జయించియు మీరు విజయఫలము ననుభవింపకున్నారు. ఒక్కసారి యప్సరలయాటలం జూచి, గంధర్వుల పాటలు విని, మందారపుష్పదామముల మెడఁ దాల్చి, నందనోద్యానమున విహరించి, మేరుగిరికూటముల నెక్కి, సురదీర్ఘికల జలక్రీడ గావించి, సుఖించి, యమరావతిని గొల్లలాడి, మాకన్నులకు విందొనరింతురుగాక యని ప్రార్థించుచున్నాఁడను. అమృతకలశము కామధేనువు చింతామణీరత్నము మనపాలఁబడునేమో యను నీసున నింద్రహతకుఁడు వానిని మనము రాకమున్నె తరలించికొనిపోయె. ఉన్నవైనను మనసార ననుభవింపవలదే ?

నర—వజ్రకంఠా!

తే. గీ. నందనోద్యానవన మేల? నాక మేల ?
కామగవియేల? మణి యేల? కల్ప మేల?

యప్సరసలేల? యింక నాకమృతమేల?
చెలియ యూర్వశి నన్నుఁ గృపసేయకున్న.

మఱియు నామనోనిశ్చయ మొక్కసారి వినుము.

సీ. ఈవెన్నెలల వేల్పుటెలనాగతోడి సయ్యాటలే కాని యేయాటలొల్ల
నొప్పులకనియైన యూర్వశీరమణి సంగీతమే కాని సంగీతమొల్ల
వగ లెల్ల మఱపించు సొగసులాడిపిసాళినవ్వులే కాని యేపువ్వులొల్ల
నతనుతాపకుడంచు నాకాంత యేకాంతసేవలే కాని యేసేవలొల్ల
సమరంగణికాతిలకము కూటములె కాని
కనకగిరికూటముల నొల్ల గడియయైనఁ
గోమలాంగి సిగ్గులు కొల్లఁగొను టె కాని
యమరగణగణంబు నేఁ గొల్లలాడ నొల్ల.

మిత్ర—సరే! మీనిశ్చయము తెలిసినది. మీ రీవేల్పుభోగముతో తృప్తుకూఁతు పొత్తు పనగి ప్రపంచమే మఱచియుందురు. ఈపీలు మాంచి దురాత్ములగు నిగ్రహులు మరల విజృంభింతురు. అంతట నెందెనో యుచ్చెలువులోఁ జేఁపలవలె బయలుపడి మేము నశింతుము. ఊర్వశికన్న మిన్నలగు వెలయాండ్రు భూలోకంబున నెందఱు లేరు? దీనికయి యింత దురపిల్ల నేల?

నర—ఓసీ! నాకవేశ్యలకుఁ భూలోకవేశ్యలకుఁ గలతారతమ్య మెఱుంగని యాసీవుండ వగుటచే నీకిత్తెఱంగునఁ బ్రేలఁజొచ్చితివి. ఆభేదము జెప్పెద వినుము.

మిత్ర—వద్దువద్దు చెప్పనక్కఱలేదు. నేనాభేద మిదివఱకే యెఱుఁగుదును. భూలోకవేశ్యకాంతలవలె స్వర్గవారకాంతలకు విటులయెముకలు కటకట కొఱికి వేధించుకొని తినుతల్లియుండ దుండదు. నెత్తురు పీల్చుజలగలట్లు మర్త్యవారాంగనలు విటులధనమెల్ల హరించి యిల్లు గుల్లజేసి తిరిపమెత్తింతురు. సురవేశ్యలకు సొమ్మక్కఱలేదు. కాని మనుజలోకమునందలి పుణ్యాంగనలకుఁ జావుండుటచే నెప్పటికయిన విఱుగడ యయిపోవుదురు. ఈస్వర్గలోకపు బానిసకూఁతులకు జావు లేదు. పాపీ చిరాయువన్నట్లు బ్రతుకుదురు. ఇదియే నే నెఱిఁగిన భేదము.

నర—ఓసీ! నే నడిగిన భేదము సౌందర్యవిషయమున; ఇట్లువిను—

ఆ. వె. ఎంతకాలమైన నెలజవ్వనమె నిల్చు
ముదిమి రాదు సెడదు మోవికావి

నిడుదకన్నులు బెళుకు నెమ్మేనితళుకు
నంతకంత కెచ్చు నచ్చరలకు.

వజ్ర—నాకంటె కాఁడువాండ్రందఱు సొగసుగనే గనఁబడుదురుగావున చక్కదనమున నెక్కువతక్కువలు నిర్ణయింపఁజాలను. కాని మీపలుకులంబట్టి వేల్పువెలయాండ్రకు మరణము లేకపోవుటయేగాక ముదిమియును లేదని తేలినది. పోనీ. అందఱు కొంపలు దీయుచు ఊళ్ళేలాగున బ్రతుకనిమ్ము.

నర—వజ్రకంఠా! మననిశుంభుఁ డేలాగో కడునాలస్యము చేయుచున్నాఁడు. ఊర్వశి వానికిఁ గనఁబడియుండదా? కంటఁబడిన రానొల్లదా? ఆలస్యకారణ మేమో నీవుపోయి తెలిసికొనివచ్చెదవా?

వజ్ర—నాకింతకన్న నుద్యోగ మేమున్నది? అట్లే పోయెదను. ఓదైవమా! అందఱు నాచుట్టునుదిరిగి నాకాళ్ళనెఁబడునట్లు నన్నొకస్వర్గలోకపు బోగముదానిగ జేయక యీదిక్కుమాలినపుట్టుక యేలపుట్టించితివి? (అని కొంచెమునడచి) అమ్మయ్యా! నాయదృష్టము బాగున్నది. ఊర్వశిం దోడ్కొని యదిగో నిశుంభుఁ డిటకు వచ్చుచున్నాఁడు.

నర—(దిగ్గునఁ లేచి) ఏది? నాయూఱటప్రాణము!

వజ్ర—అదిగో! మననిశుంభునివెనుక నడుగులు లెక్కపెట్టుకొనుచుఁ దలవంచుకొని పెళ్ళికూఁతురువలె నడచి వచ్చుచున్నది.

నర—వజ్రకంఠా! మహేంద్రుఁ డూర్వశి నిచ్చట విడిచిపోవుటచే గామగవియు నమృతభాండము మొదలగు దివ్యవస్తువులను దివమునుండి తలిలించుకొనిపోయెనని నాకిపుడు విచారములేదు.

క. నాపాలిసురభి యిదియే
నాపాలిఁటిపారిజాతనగ మియ్యదియే
నాపాలియమృత మిదియే
నా పాలిఁటిరత్న మిదియె నానిధి యిదియే.

వజ్ర—వెఱ్ఱికి వేయివిధములు. యందులో నిది యొకటి.

నర—ఓరిమూర్ఖుఁడ! జగన్మోహన మగు దానియాకారము నొక్కసారి కన్నులకఱవుదీరఁ జూడుము. ఆహాహా! నాకన్ను లింతకాలమునకుఁ జరితార్థత నొందినవి.

సీ. లావణ్యమును గ్రక్కులలనమోమును జూచి చూడనక్కరలేదు సోము నింక
సిరికిఁ దానకమైన చెలువమూడిక్కఁదలంచి తలపనక్కరలేదు తమ్మిఱేకు

మిఱుమిట్లు గొలుపు నెమ్మేనివన్నియ నెంచి యెంచనక్కఱలేదు మించుమాట యుండిలేనటు లుండు నువిద నెన్నడు మెన్ని యెన్నక్కఱలేదుమిన్నుత్రోవ.

తేటతేనియబావియౌ తెఱవమోవిఁ
జెప్పిచెప్పనక్కఱలేదు చిగురుపేరు
పొలఁతి జఘనమండలి పొంతఁబోయి పిదపఁ
బోవఁ బనిలేదు మిన్నేటిపులినములకు.

మఱియును,

ఆ. వె. ఇంతికన్ను లుండ నించువిల్కానికిఁ
మాన మేల? వేఱుబాణ మేల?
కలికిప్రాపుఁ బడసి కాఁబోలు మరు డిట్టు
లూడలు మఱచి తిరుగుచున్నవాఁడు.

[అప్పుడు, నిశుంభుఁడను రాక్షసుఁడు, ఊర్వశితోఁ బ్రవేశించుచున్నాఁడు]

ఊర్వ—(తనలో) రంభాదులగు నచ్చరల యదృష్టములు తిన్ననగుటచే నారీమ రాత్మనిద్రుష్టిపథమునఁ బడకుండ నావలకుం దాఁటిరి. మందభాగ్యురాల నగు నే నంతటిపుణ్యము జేసికొననైతిని. ఇంతకు విధివిలాసము దుస్తరము. అచ్చరనైన నేమి? వేల్పుదొరప్రాపకము గావించిన నేమి? ఇడుములు గుడువవలసినకాలము వచ్చి నప్పుడు తప్పునా? రాక్షసులే తులువలు. అందు నరకుఁ డధమాధముఁడు. వానియనుచరుల చర్యలం జూచి మహాపాతకు లందఱుఁ దలలు వంచుకొనవలయు. వీనియెదుటికి రాకయుండవలెనని యెన్నివిధములఁ బ్రయత్నించినను సాగదయ్యె. అయినను బడఁతుల బలిమిఁబట్టి మానభంగము సేయు నరకహతకునిబారినుండి తప్పించుకొనుటకు దైవ మేదయిన నొక్కయుపాయముఁ దోపింపఁడే? (తలవంచి నిలుచున్నది.)

నిశుం—(తనలో) స్వామి కేది మనఃప్రియ మగు నది సేయువాఁడే విశ్వాసము గలసేవకుఁడు. యజమానుల యాజ్ఞఁ జెల్లింపక వారిమేలుకొఱకే వారిమాటలు మేము నిరాకరించుచున్నవారమని చెప్పు సేవకులు కేవలము కృతఘ్నులు దండ్యులు నని నా యభిప్రాయము. మంచిదేకాని చెడ్డదేకాని రాజాజ్ఞ చెల్లి తీరవలయును. అందుచేత నే యూర్వశీవిరహతాపమున దురపిల్లు మహారాజునకు నేను వాంఛితార్థసిద్ధిఁ జేసితిని. నా రాజభక్తికి నరకుఁడు శాశ్వతకాలముఁ గృతజ్ఞుఁడై యుండును. (రాజునుసమీపించి ప్రకాశముగా) మహారాజా! జయము! జయము!

నర—మిత్రుఁడా! నీవు కావించిన మహోపకారమునకుఁ గృతజ్ఞుఁడ నగుచున్నాఁడను.

నిశుం—దేవరవారికి నేను జేయవలసినపనియే చేసితిని గావున స్తోత్రమునకర్హుఁడ.

వజ్ర—ఈనిశుంభునకు పైన్యాధిపత్యమున నున్న నేర్పుకంటె మహారాజునకు మిండకత్తెలను దార్చుటలో నెక్కువప్రజ్ఞ యున్నట్లు కనబడుచున్నది. వాని నిఁక మీఁద నిట్టియుద్యోగములో నుంచుటయే మంచిది.

నిశుం—ఓరిమూర్ఖుఁడా! వజ్రకంఠా! సింగము నాశ్రయించిన నక్కవలె రాజాశ్రయమున నీవు నిర్భయముగఁ జరించుచున్నాఁడవు. ఇప్పు డీమహారాజు మొగము జూచియేసుమా నీప్రాణములు నీశరీరములో నే నుండనిచ్చినది.

నర—మిత్రమా! ఈయనర్గళ నిమాటలు మొగటినుండియు నీవెత్తిఁగిన వేకదా?

నిశుం—దేవా! వానిమాటలు నేను కనేయ. ఇదిగో యూర్వశి వచ్చి జంత్రపు బొమ్మవలె నిలుచున్నది. దేవర యూసాంగావలోకనముల దీనిపైఁ బఱపి మన్నింపుఁడా.

నర—మిత్రుఁడా!

తే, గీ. వేయికన్నుల నయనంబు వేల్పు ఱేఁడు
తరుణిలావణ్యమును జూచి తనివిఁ నక
యున్నవాఁడన నేప్పపి సొంపగునె?
కనులు రెండింటితో నొక్కఁటడియు చూచి.

గౌతమీశాపము మహేంద్రునకు నిజముగ నీవిషయమున వరమే యయ్యెఁది. ఈసమయమున నేను సహస్రాక్షుఁడను గాకపోవుటయు నొకలోపమే.

వజ్ర—అది యెంతభాగ్యము. ఏమునిమో పట్టుజాలనికోపము వచ్చినప్పుడు నన కంతటిభాగ్యముఁ గలుగఁజేయకపోఁడు.

నిశుం—ఊర్వశీ! కొయ్యబొమ్మవలె నిలచియుండెదవేల? మహారాజునకు మొక్కుము.

ఊర్వ—(తనలో) కటకటా! మహేంద్రునకు వేల్పులనిండోలగంబున జోహారుసేయు చేతులతో నీదానవాధమునకు మ్రొక్కవలసె. (ప్రకాశముగా) దానవేంద్రా! నమస్కారము.

నర—(తనలో) దీనినిప్పు డేమని దీవింతును? నామనసులో భావము తేటబడునట్లాశీర్వదింపవలెను. (ప్రకాశముగ) ఓత్రిభువనరత్నమా!

మ. త్రిజగన్మోహనమై, దివాభరణ మై, దేవేంద్రునిత్క్షేప మై,
యజనిర్మాణముకన్నఁ బ్రౌఢతర మై, యామన్మథోద్యజ్జయ
ధ్వజ మై కన్నులపండు వై, లలిత మై, ద్రష్టవ్యమై, చాలన
క్కజమౌ నీనెఱజవ్వనం బలరుత న్గళ్యాణి! యెల్లప్పుడున్.

వజ్ర—తథాస్తు.

ఊర్వ—(తనలో) ఈమహాత్ముఁ డపూర్వమైన యాశీర్వచనముచేఁ దన నింద్య మగుభావమును వెల్లడిచేయుచున్నాఁడు. అయ్యో! నా కీదినమున నేదియో కీడుమూడనున్నది.

నిశుం—ఈకోపనకామె యలిగి మీపై కోరచూపులఁ బ్రసరింపఁజేయుచున్నది.

నర—అట్లయిన నామెచూపులను నేను బ్రసన్నములుగాఁ జేసికొనెద, ఓలావణ్యరాశీ!

మ. చెలు లై తేంట్లను, సోగ లై, వెడద లై, చెంగల్వచుట్టంబు లై
జలజాతంబుల నేలునట్టి దొర లై, సౌభాగ్యపుంఠీవు లై,
కలుము ల్జిమ్మెడు క్రొవ్వు లై, కఱకు లై, కందర్పవాల్తూపు లై
చెలువొప్పారెడు నీదుకన్నులకు నాశీర్వాద మబ్జాననా!

వజ్ర—తథాస్తు.

నిశుం—ఈపలుకులంబట్టి మీరు శతమన్యునికంటె నూఱుమడుంగు లెక్కుడు రసికులని యూర్వశి యిప్పుడయినఁ దెలిసికొనకపోదు.

వజ్రి—ఆయన నూఱురెట్లు రసికుఁడు. ఆయనబంటువు నీ వేఁబదిరెట్లు రసికుఁడవు.

నిశుం—ఓరీ! తులువా! నీపాడునోటికి బుద్ధి చెప్పుటకిది సమయముకాదు. (రాజుతో) దేవా! మురహాయగ్రీవులు నారాక నిరీక్షించుచుందురు. గావున శిబిరమునకుఁ బోవ నాకానతిండు. ఊర్వశీ! లేనిపోని బోగముటెక్కులు చేయక ప్రసన్నురాలవయి మహారాజు ననుగ్రహము సంపాదించుకొనుము.

నర—నీమేలు నేను మఱచిపోను. నీవింక శిబిరమునకుఁ బొమ్ము.

నిశుం—చిత్తము. మీబంటున కిదియే కావలసినది.

(అని నిష్క్రమించును.)

వజ్ర—(తనలో) ఇప్పుడు మారాజునకు శనిగ్రహము వదలినట్లే యున్నది.

ఊర్వ—దానవేశ్వరా! దేవరవారు నన్నుఁ బిలిపించినకారణ మేమో తెలియఁ గోరుచున్నాను.

వజ్రి—తొందరపడకు. స్వల్పకాలములోనే తెలిసికొనఁగలవు.

నర—ఓసుందరీ!

ఉ. ఇన్నెలరాలతిన్నియల నిన్ననపాన్పుల మేను జేర్చి యీ
వెన్నెలరేల నే నిటుల వేఁగుచు వన్నెదొఱంగి యుండుటల్
కన్నులఁజూచియు న్బిలువఁగాఁ గత మేమని సంగనాచి వై
నన్నడుగం దలంచు టిది న్యాయమె కారణ మీ వెఱుంగవే?

అయినను దత్కారణము నీవు నానోటనే వినఁ దలఁచుచున్నదానవు. కావున నేఁజెప్పక పోవుట పాడికాదు. సహస్రాక్షుని గెలిచి యసుర సామ్రాజ్యాధిపత్యమును నేను గైకొంటిని గాని నీవు లేనిచో నిందద్రత్వము పరిపూర్ణము గాదు. స్వర్గరాజ్యలక్ష్మినీతోఁ జిరకాలముఁ గలసి మెలసి యుండుటంజేసి తా నొంటిగ నాకడనుండ నొల్లకున్న యది. కారణము తెలిసినదా?

వజ్రి—దేవా! దీనికి స్పష్టముగ విప్పిచెప్పినంగాని తెలియదు.

నర—అట్లయిన నిదిగో విస్పష్టముగాఁ జెప్పుచున్నాఁడను.

తే. గీ. ఇంచువిలుకాఁడు నన్నదియేమొ కాని
యేఁచుచున్నాఁడు నెన రొకయింత లేక
మరునితోఁ జెప్పి యాపీడ మాన్పఁ గదవె
మరుఁడు వినకున్న నీ వైన మాన్పఁ గదవె?

వజ్రి—ఈమాత్రపుఁ గార్యమునకు నీమె నింత వేఁడవలయునా? నాకలోక వేశ్యలలో నూర్వశి పెద్దపిన్న తారతమ్యము లెఱిఁగిన యోగ్యురాలు. మఱియు నిదిదాని చేతిలోనున్న పనియే గనుక నీమాట త్రోసివేయదు.

ఊర్వ—(తనలో) ఆహాహా! ఆ యజమాని కీసేవకుఁడు దగినవాఁడే. ఈరాక్షసాధముఁడు కామాయత్తుఁడయి యొడలు దెలియక యున్నవాఁడు. వీనికి నే నిప్పు డేమి యుత్తరముఁ జెప్పుదును? (అని యాలోచించుచున్నది.)

నర—(తనలో) ఇది నామాట కుత్తరమీయకున్న దేమి? (ప్రకాశముగ)

మ. అనుమానించెద వేల సుందరి! యహల్యాజారుఁడ న్నేను గా
ననియో, కన్నులు వేయి లేవనియొ నా, కయ్యింద్రునం దున్న మే

ల్గానము ల్నాకడఁ గానరా వనియొ, నీలోఁ జింత నేసెట్టులు
న్నను మాయింద్రునిపాటి సేయఁగనె? కాంతా! భ్రాంతి నీ కేటికే?

ఊర్వ—దేవా! ఎదుట లేనిమహేంద్రుని దెప్పుట తగవుకాదు. వారిగుణములు మీకురావు; మీగుణములు వారికిరావు. వారంతవారు వారు మీయంతవారుమీరు.

వజ్రి—సరే! నాయంతవాడను నేను నీయంతదానవు నీవు.

నర—ఓకల్యాణీ! నీ కిష్టములేదుగావున నింక మహేంద్రునిమాట నే నెత్తను. కాని నాప్రార్థన మంగీకరించి నాయంతిపురమునకు రమ్ము. నావలన నేభయంబును నీవు పడనక్కఱలేదు.

మ. పొలఁతీ! కన్నులఁ గప్పుకొందుఁ బువులం బూజింతు నిన్ను న్మనం
బలరం బట్టపుదేవిఁ జేయుదును నీయాజ్ఞం దలం దాల్తు నే
ల్పుల కెల్లం దొరసాని వయ్యెదవు ముప్పొద్దున్ను నం. గొల్తు రై
త్య స్త్రీకనుసన్నలన్మెలఁగి చేతు లొగ్గి నీభృత్యులై.

మఱియు నింద్రునికడ నీవనుభవించినదానికంటె వేయిమడుఁగులు మహైశ్వర్యము ననుభవింపఁగలవు. అదియునుంగాక,

తే. గీ. ఇంతకాల మింద్రునిగూడి యెటేఁగితి గద
యతనిసరసత్వ మతనియొ ప్పతని నేర్పు
చిగురుఁబోఁడి కొన్నాళ్ళు చూచెదవు గాక
నాదురసికత నాసొంపు నాతెఱంగు.

ఊర్వ—దానవేంద్రా! దుర్నిరీక్ష్యతేజోరాశివై శ్రేయఃకాముఁడ వైన నీనోట నుండి యిట్టిపలుకులు రానిచ్చుట కేవల మనుచితము.

వజ్ర—అబ్బో! ఇది శ్రీరంగనీతులు చాల నేర్చినది.

నర—ఊర్వశీ! ఇదియేటిసరసమే?

మ. వనితా ప్రాపకు లౌటకు న్నరసు లెవ్వారైన రా, వారిఁగ
న్గొని లాలింపుట యొప్పుఁగాని, విరసోక్తుల్పల్కి తచ్చిత్తరం
జనము, న్జేయకఁ జెందనాడుదురె? వేశ్యల్గారె? మీరింక చా
లును, మీసానెతికంబు లింతటివపేటె లోకుల్ నినున్ నవ్వరే?

వజ్ర—అయ్యా! ఇది సరసురాలు కానట్టు నటించుచున్నది గాని సరసములేక పోలేదు. ఇది యెన్నెన్నో కొంపలు గాల్చిన కొఱవి. సామాన్యురాలు గాదు.

ఊర్వ—దేవా! మహారసికు లయిన దేవరచిత్తము రంజనము జేయఁగలపాటి రసికత నావద్దలేదు.

నర—సుందరీ! ఇది నిశ్చయముగ గర్వోక్తిసుమా!

తే. గీ. ఎంతరసికురాలవొ గదే యింతి నీవు
ఎంతదానవు గాకున్న నింద్రుఁ డట్టి
ముజ్జగంబుల దొర కేలుమోడ్చి నీకు
దేవసంతతితోడ విధేయుఁ డగునె?

మఱియు,

తే. గీ, ఎల్లజగముల గెల్చె దేవేశ్వరుండు
అతని గెల్చితి నేను మహాబలమున
నన్నుఁ గెలిచితి నీవు విన్నాణమునను
నిన్ను సామాన్యురా లన నేర్తు నెట్లు?

వజ్ర—మహాప్రభూ! ఏలినవారు నిజము గ్రహించినారు.

ఊర్వ—రాక్షసేశ్వరా! చక్కఁదనము నెఱజాణతనము నన్నుఁ బూరికిం గొననిప్రోడలు స్వర్గమర్త్యపాతాళములయందు మీకుఁ గావలసినందఱుండఁగ నెన్నఁడో యౌవనమంతయుఁ బోయిన ప్రాఁతదానను నన్నుఁ గోరెద రేల?

వజ్ర—ఈవగలాఁడి మిమ్మును బుట్టలోఁ బెట్టుటకుఁ బ్రయత్నించుచున్నది. జాగ్రత్త.

నర—ఏమి! నీవు యౌవనముచెల్లిపోయిన ప్రాఁతదానవా?

తే. గీ. ప్రాఁతపడియును బంగారు వన్నె చెడునె?
ప్రాఁతచెట్టులు తియ్యనిపండ్ల నిడవె?
ప్రాఁతదయ్యును జాబిల్లి పసచెడియెనె?
ప్రాఁతక్రొత్త లేమిటికి సువస్తువులకు?

వజ్ర—ప్రాఁతనూనెలు చేవదేరునట్లు నీమె ప్రాఁత దౌటచే నెక్కుడుజాణగా నున్నది. మఱియు ప్రాఁతవస్తువులు పథ్యములని చెప్పుదురు. కావున నీమెపొందు మీకుఁ బథ్యమే!

ఊర్వ—నాయందు మీకుఁ గలయనురాగాతిశయముచేత మీకన్నులకట్లు నేఁ గనఁబడుచున్నదానను.

నర—కాంతా! అట్లు కాదు.

తే. గీ. మెఱపుఁదీఁగకు వన్నెలు లఱుఁగు నేవి
గలికి నీ మేనినిగ్గులు కగ్గవచ్చుఁ
బుట్టతేనియలోఁ దీపి పోవునేని
బాలఁతి! నీయందు రసికత పోవవచ్చు.

ఊర్వ—నరకమహారాజా? జన్మమునుబట్టి నేనొకపణ్యాంగన నైనను సకలజగజ్జనకుఁ డగు మహేంద్రునకు వలపుఁగత్తెనై యుండుటంజేసి నేనట్టియోగ్యతకుఁ దగియుండకపోయినను నింద్రునియందలి గౌరవమున నైన లోకమాతగాఁ బరిగణింపఁబడ వలసినదానను.

నర—(ఆశ్చర్యముతో) ఏమీ! నీవు! లోకమాతవా!

తే. గీ. మగువ! నీయందు నింతింతమహిమ లుంట
యింతకాలమునుండి నే నెన్నఁ డెఱుఁగఁ
గ్రొత్తసంగతు లెన్నరిచికొంటి నహహా!
పాత్రఁతలంజ లిప్పుడు లోకమాతలైరి.

వజ్ర—ఓహోహో! ఇదిలోకమాతయఁట! మాకందఱకు దల్లిననిబైలుదేరును గాఁబోలు! అట్లయిన నీమె మాపాలిఁటి పెద్దమ్మయే.

ఊర్వ—అసురనాయకా! నేను లోకమాత ననుట నీకు హాస్యాస్పదముగ నున్నయది. అట్లయిన నిటు విను. పితృసమోజ్యేష్ఠః అను శాస్త్రవచనమునుబట్టి మహేంద్రుఁడు నీ కగ్రసహోదరుఁ డగుటచే నేను మీకు వదినెనైతిని. మోహ మెంతయున్నను వావియైనఁ దలఁపవలదా?

వజ్ర—ఇష్టము లేనప్పుడు కులటలు వావివరుసలు వెదకుదురు.

నర—ఓహో! యిప్పుడు నీకు వావివరుసలుగావలసివచ్చినవా? నీపూర్వచరిత్ర మించుక దలఁచుకొనుము. కాదుకాదు. నేనే జ్ఞప్తికిఁ దెచ్చెద వినుము.

చ. నెలఁతరో! యేమి కావలయు నీ కలపాండవమధ్యముండు
గళమునఁ దాళిగట్టిన మగం డటె నీకుఁ బురూరవుండు, నీ
చెలియగునట్టి మేనకకుఁ జేరువచుట్టమె గాధిపట్టి: వా
వుఱు వెదకందలంచెదవు బోగముబోటికి వావులేటికే?

ఊర్వ—(తనలో) ఇతఁడు నాపాత్రఁతతప్పులన్నియుఁ బయలుబెట్టుచున్నాఁడు. ఇఁక నేమివంకఁ జెప్పుదును.

వజ్ర—నూదికొక్కటు నోదికింబోవఁ బ్రాఁతలంకులు బైటఁబడినవట! ఈకథ యట్లున్నది.

ఊర్వ—రాజా! నేనెవ్వతెనైనను నీకుఁ బరకాంతను గదా!

నర—పరకాంత వెట్లగుదువు? వేశ్యయగుటచే నందఱకు సామాన్యకాంతవు.

తే. గీ. ఎవఁడు ధనమిచ్చునీకు వాఁడెమగఁ డంచు
బ్రహ్మ మూఁడుపంక్తులఁ దీర్చెవ్రాసెనుదుట
గడుసుపోకడ లిఁకఁ జాలుఁ గట్టిపెట్టు
సకియ! నీయాట లిచ్చట సాగిరావు.

ఊర్వ—అనురాగము లేనియబలను బలిమింబట్టుజూచుట యధర్మము కాదా!

నర—ఏమీ! మాకిప్పుడు ధర్మోపన్యాసములు సేయవచ్చితివా?

చ. జిలిబిలితేనెపల్కులును జెన్నగుతళ్కులు వాలు చూపులున్
జెలువపుగోపులున్ రకపుఁజిన్నెలువన్నెలు పెన్వగ ల్నగల్
నిలుకడలేని హాసములు నింద్యపువేసములుం ధరించి లో
కులఁబడఁద్రోయువేశ్యలిటఁ గొత్తగ నేర్చిరె కొన్నిధర్మముల్.

మఱియు,

తే. గీ. దనుజులము మేము మాకేల ధర్మమేల?
వావివరుసల నెన్నెడువారు వేఱు
వేల్పులెవరైన నినుఁగోరి పిలుతురేని
వారికడఁ జెప్పు నీనీతివర్తనములు.

వజ్ర—తొండముదిరి యూసరవిల్లి యయినట్లు ప్రాఁతకులటులు పరమపతివ్రతలగుదురు గాఁబోలు!

ఊర్వ—(కోపముతో) రాక్షసరాజా! మేము వేశ్యలమైనను పతివ్రతలమే సుమా!

నర—పతియున్నప్పుడే కదా పతివ్రతయగుట. పతియే లేనిదానిమాటయేమి?

ఊర్వ—దివస్పతియే నాపతి.

నర—ఈదివస్పతి కట్లు నీవిగివఱకెందఱికో పతివ్రతవైతివి. అట్లే నన్నుఁ బతిగఁ జేసికొని నాకునుం బతివ్రత వగుము.

వజ్ర—ఊర్వశీ! నీవెట్టిపతివ్రతవో యీయనయు నట్టియేకపత్నీవ్రతస్థుఁడు. నీ వాయనను జేపట్టితివేని మీకనుకూలదాంపత్య మగును.

నర—మఱియు భుజబలంబున వేల్పులం గెలిచి నే నిప్పుడు దివస్పతినైతినిఁ నీవు మాటనిలకడ గలదానవై దివస్పతినైన నన్నుం జేపట్టుము. నీవు నాకుఁ బ్రసన్నురాలవగుదువేని సకలలోకకళ్యాణంబగు. కానేని నాకరాజ్యలక్ష్మిం గైకొన్నచందంబున నిన్నుం బలిమిఁ గైకొనవలసివచ్చు.

ఊర్వ—(తనలో) ఈదురాత్ముఁడు నామానభంగంబు చేయఁగృతనిశ్చయుఁడై యున్నవాఁడు. మలినవస్త్రమును మాలిన్యముచేతనే శుద్ధిఁ జేయునట్లు దురాత్ములను కపటోపాయములచేత నిగ్రహించుట యుచితము?

వజ్రి—ఓవెఱ్ఱిదానా! ఉర్వశీ! ఈమహారాజు మిక్కిలి మంచివాఁడు. చెడ గొట్టుకొనక యీయనప్రాపకము సంపాదించుకొని సుఖపడు.

ఊర్వ—దేవా! ఈఁడురు నాపలికిన పరుషోక్తులకు నన్ను క్షమింపవలయును. నే నెప్పటికైన మీదాననే.

నర—(సంతోషముతో) ఓభువనైకసుందరీ!

తే. గీ. నిన్ను క్షమియింప నేటికి నీపలుకులు
చాలఁ గఠినంబు లయ్యును జల్లనగుచుఁ
బరమసుఖ మిచ్చె వడగండ్లపగిది నొప్పి
మదనసంతప్తమైన నామదికి నబల.

వజ్రి—వలపుగలవారు ప్రియురాండ్రు తాళ్ళురువ్విన బువ్వుల రువ్వినట్లు సంతసింతురు.

ఊర్వ—బావగారూ! నిజముగా నామీఁద మీకు మనసున బ్రేమకలదా!

నర—రమణీ! నన్ను నీవిట్లు వేఁడుయడుగవలయునా? నీకన్న నాకుఁ బ్రేమాస్పదమగు పదార్థ మేది?

ఊర్వ—నేను నమ్మజాలను. మగవారి కెదుటనున్నదే పెండ్లికూఁతురు. పురుషులు కామాయత్తచిత్తులై కక్కురితిచేతఁ దమయక్కఱఁ దీర్చుకొనుటకయి లేనిప్రేమముఁ జూపి యిచ్చకపుమాటలాడి బాసలుచేసి యంగనల వంచించి మరల మొగము జూపరు. నిజముగ నాపైననురాగము మీ కున్నయెడల నాకొఱకొకమారయిన నింత కాలమునుండి స్వర్గమునకేల రారయిరి?

నర—సుందరీ! నీవు పగవానియధీనమున నున్నపడఁతుకవు. మిండతీకమునకయి నావంటివాఁడు పగతునిపట్టణంబునకు వచ్చుట యనుచితముగదా!

తే. గీ. ఎంతకాలంబునుండియో యేను నిన్నుఁ
గాంచఁ దలచిన సమయంబు గలుగదయ్యె
విబుధలోకంబుపై దండువిడియు కతన
వాలుగంటి! నిన్నన నేఁడు వీలుగంటి.

వజ్రి—ఇప్పటికి వీరి కిద్దఱకు నొడంబడికలు జరిగినవి. ఇంక మేము ధన్యుల మయితిమి.

ఊర్వ—బావగారూ! ఇది యొకవంకగాని నిజముగా మీరు నాపై ననుగ్రహ మున్నయెడలఁ గాకిచే వర్తమానమంపిన నేను రెక్కలు గట్టుకొని మీ పాదములపై వ్రాలనా ?

నర—సుందరీ! నాకంతయూహము తోఁచినదికాదు. నన్ను మన్నింపుము.

వజ్రి—ఆయూహము తోఁచినయెడల మీయిరువురసందునఁ దిరుగలేక నేఁ జచ్చిపోదును. ఇంతకు నాపుణ్యము బాగున్నది.

ఊర్వ—ఓరసికశిఖామణీ! నీమనసున నిజముగ నాపై వలపు గలదో లేదోయని పరీక్షించుటకయి నే నెన్నియోవిధముల నిన్నుఁ మూలనాడితిని. ముజ్జగంబుల గెలిచి మహావైభవముతోఁ గన్నులపఱిడువుగ రాజ్యమేలుచున్న మీవంటిరసికశేఖరుని విడిచి రాజ్యభ్రష్టుఁడై, నిలువ నీడలేక కొండల జరియించు మునిశాపోపహతుని మహేంద్రుని గొల్చి యుండుటకు నే నంత తెలివిమాలినదాననా ? ఎవ్వరుం దగినవారు లేక పోవుటచే నున్నంతలో సరిపెట్టుకొనుట మంచిదని యింద్రునియండనుండి గౌరవముగ గాలము గడపుచుంటిని. ఇంక నేను నీధనము. నీవే నాప్రాణమవు.

నర—ధన్యోస్మి! ధన్యోస్మి! నే నిప్పుడు నిజముగా నింద్రుఁడనైతిని.

చ. నిజమఁటె నీదుపల్కు నను నీబిగికౌఁగిటఁ జేర్చెదొక్కొ యం
గజపరితాపము ద్రోలఁగుకాలము వచ్చెనె నాదు ది
గ్విజయము సార్థకం బగునె కీర్తి చెలంగునె యింక నీముఖాం
బుజమును ముద్దులాడుటకుఁ బున్నెముఁ జేసితి నే? తలోదరీ!

వజ్ర—మీరే కాదు నేనును నాపితృదేవతలును పదునాల్గుతరములవఱకుఁ దరించితిమి.

నర—దేవీ! నందనోద్యానమునకుం బోయి విహరింతము రమ్ము.

ఊర్వ—దేవా! నా కొక్క ప్రతిన యున్నది. ఆప్రతిన సెల్లించి నన్నుం జేపట్టవలయు.

నర—నీప్రతినఁ బాలించుటకయి నీసేవకుఁడు సిద్ధముగనున్నవాఁడు. ఆనతిమ్ము.

ఊర్వ—మీరు పాకశాసనుని గెల్చి మహేంద్రపదవి నాక్రమించుకొంటిరి. కాని బ్రాహ్మణులు మహర్షులు సేయుయజ్ఞంబులలో హవిర్భాగములు గైకొన్నప్పుడు కాని దేవేంద్రత్వము సార్థకముగాదు. అప్పుడు నే నిన్ను వరింతు. ఇప్పుడు బదరికావనమున సత్రయాగము జరుగుచున్నయది. అక్కడకు మీరరిగి ఋషుల నొప్పించి హవిర్భాగముల భుజించి రండు.

నర—(నవ్వుచు) ఇదియా నీప్రతిన! సరిసరి. ఇది చెల్లించు టెంతసేపు. ఇంత కన్న మఱియేదియు లేదుగదా! అట్లు చేసినపిదప మఱియొకవంకఁ జెప్పవుగద!

ఊర్వ—ఏ కొఱవంకయుఁ జెప్పను. మాటఁ దప్పితినేని మిమ్మును జంపుకొన్న ట్లే. ఇంక నాకు సెలవిండు. నేను బోయి మీరాక నిరీక్షించుచుందును.

నర—దేవీ! అట్లేపొమ్ము. నేను నీదాసుఁడ ననుమాట మనసులో నుంచుకొనుము.

ఊర్వ—(తనలో) ఇప్పటికిఁ బులినోటికండవలె బైటఁబడితిని. ఈబుద్ధిహీనుఁ డీగండము గడచి బ్రతికినప్పటిమాటుగద! మీఁద దైవమున్నాఁడు.

(అని నిష్క్రమించును.)

వజ్ర—(తనలో) ఈగడుసుబానిసకూఁతు రేదో వంక చెప్పి యీమందభాగ్యుని కన్నులలో దుమ్ముకొట్టిపోయినది. ఇఁక వీనికి నీమె దక్కినప్పటిమాటకదా!

నర—వజ్రకంఠా! మురనిశుంభాదిసైన్యాధిపతులయొద్దకుఁబోయి దానవసైన్యంబులు బదరికాశ్రమమునకుఁ బోవలయుఁ గాన ప్రయాణసన్నాహము సేయుమని చెప్పుము.

వజ్ర—చిత్తము. (అని కొంచెమునడచి) దేవా! ఎందుకో మురుఁ డిటనే వచ్చుచున్నాఁడు. వీనిమొగము సంతోషమును సూచించుచున్నది.

[అప్పుడు మురుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

ముర—దేవా! విజయమగుఁగాక!

నర—మురుఁడా! మీస్వామిభక్తియు బాహుబలమును మాకు విజయకారణము లయ్యెను.

ముర—దేవా! నే నిప్పుడు కావించిన మహాసాహసమును మీకు విన్నవింప వచ్చితిని.

వజ్ర—ఈమహాసాహస మేదో వినఁదగినదే.

నర—నీసాహాసమును వినిపించి మావీనులకు విందు సేయుము.

మురు—దేవా! చిత్తగింపుము.

ఆ. వె. అమరమాత యైనయదితిదేవిని జేరి
యా మెకుండలముల నపహరించి
తెచ్చినాఁడ నిపుడు దేవరవారికి
నర్పణంబు సేయ నధికభక్తి.

ఇవిగో రత్నకుండలములు (అని యిచ్చుచున్నాఁడు.)

నర—నీసాహసము సంస్తవనీయ మయినది. నీ పేరు విన్న నిర్జరాంగనలకు గర్భనిర్భేదక మగుగాక! ఈ కుండలము లూర్వశికి సమర్పించెదను.

వజ్ర—ఆఱునెలలు సాముచేసి మూలనున్న ముసలిముండను గొట్టినట్లు ముదిమిచేఁ గదలలేక భయముచే సగము చచ్చి యొకమూల నొదిగియున్న వేల్పుటవ్వను గెలిచివచ్చితివా? నీవంటి ధైర్యవంతుఁడు దేవరాక్షసులలో నెచ్చటను లేఁడు.

మురు—ఓరివాచాటా! నీవు రాజుగారి విదూషకుఁడ వగుటచే నిప్పుడు బ్రతికి పోతివి.

నర—మురుఁడా! మనవజ్రకంఠునిమాటలు పాటింపనక్కరలేదు. యాగహవిర్భాగములు గ్రహింపకున్న నాకింద్రత్వము సిద్ధింపదు కావున సేనాసమేతులరై మీరిప్పుడు బదరికాశ్రమమునకుం బోయి యచ్చటి తాపసుల నడిగి నయమున భయమున వారి నొప్పించి హవ్యంబులఁ గొనవలయు, సేనలకుఁ బ్రయాణముఁ జాటఁబంపుము.

మురు—(సందేహముతో) మహర్షులు మనకు హవిర్భాగముల నిచ్చుటకు సమ్మతింతురో లేదో.

వజ్ర—నే నపశకునపక్షివంటివాఁడ నని మీరనుకొన్నను సరేగాని సమ్మతింపని మాట నిజము.

నర—(కోపముతో) ఏమేమీ? చతుర్దశభువనైకవీరుఁడును తృణీకృతపురందరాదిదిక్పాలకుఁడును విజయలక్ష్మీకరుణాపాంగవిలోకనప్రవర్ధితమహావిభవుండును నగు నరకదానవేంద్రునిమాట వారు నిరాకరింతురా?

ఉ. దక్కెనె యింక ప్రాణములు తాపసవర్యుల కెల్ల, మానము
ద్దక్కెనె నేలవేల్పులకు దైవతకోటికి, యాగభాగముల్

గ్రక్కున నిచ్చినస్సరియె కావర మొంది యొసంగ కుండినన్
వ్రక్కలు చేసెదన్ దలలు భస్మముఁ జేసెద నాశ్రమంబులన్. 35

మఱియు నచ్చటి మునులు మనపలుకుఁ ద్రోసిపుచ్చిన వారితో నిట్లనుము.

మహాస్రగ్ధర. సవనంబు ల్సాగ వింక జ్జపములు తపముల్ స్నానముల్ సెల్ల వింకన్
భువనంబు ల్నిల్వ వింక న్వాదలు టరిది గో భూసురవ్రాత మింకన్
దివిజుల్ మర్త్యుల్ భుజంగుల్ స్థిరమతులయి వర్థిల్లఁగాఁ జాల రింకన్
రవియు జ్జంద్రుండుఁజుక్కల్గ్రహములు గన వక్రత్వమున్ గాంతురింకన్.

వజ్ర—మాకింక చేతినిండ పనిగలిగినది.

ముర—చిత్తము. అప్పటికిని మహర్షులు మీయాన తిరస్కరించిన మాయిచ్చ వచ్చిన తెఱంగున మేము సేయవచ్చునా ?

నర—ఆహా త్రికరణశుద్ధిగా.

తే. గీ. చెలఁగి యిచ్చ వచ్చినరీతిఁ జేయవచ్చు
నవటి కెవఁడు వచ్చునో చూతు నడ్డగింపఁ
బవరమున నుగంటిమిఁ జూపి పస యడంతు
నబ్జభవు నైన నాతని యబ్బనైన. 37

సైన్యంబులఁదోడ్కొని మీరందఱు బదరికాశ్రమమునకుఁ బొండు. నేను ప్రాగ్జ్యోతిషంబున కరిగి యచట నుండి కావలయునన్న బదరికావనంబునకు వచ్చువాఁడ. హయగ్రీవుం డింద్రలోకమును నాకుఁ బ్రతినిధియయి యేలుగాక! మన మింకఁ బోవుదము. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

ప్రసన్నయాదవము

తృతీయాంకము.

ప్రదేశము—ద్వారకానగరము.

[అప్పుడు మాణిభద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మాణి—[తనలో] అహాహా ! ఏమి యీనగరవైభవము ! మహేంద్రుని యమ రావతీపురమును, ధనదుని యలకానగరమును నిరంతరమును గనుచున్న నాకన్నులకే యీనగర మింతసొగసుగనుండఁ దక్కినవారిమాట చెప్పనేల ? మహేంద్రుఁడు వాసు దేవునకు వానికి జ్యేష్ఠుఁడయినను వైభవమున నిశ్చయముగఁ గనిష్ఠుఁడే యని చెప్ప వచ్చును.

మ. ఇది వైకుంఠము గాక కేవలపురంబే యెంచ నీనాగరుల్
త్రిదశుల్గాక మనుష్యమాత్రులె, ధరిత్రీభారము న్బాపఁగా
నుదయం బందినశక్తి గాక నరుఁడే యూహింప నీకృష్ణుఁడీ
యదువంశంబు పవిత్రమయ్యెఁ గద యీయబ్జాక్షుజన్మంబునన్.

మఱియు నీపౌరులు చేసికొన్న పుణ్య మెట్టిదోగదా !

మ. అరవిందాసనుఁడు న్మహేశ్వరుఁడు దివ్యాబ్దంబు లెన్నేని సు
స్థిరభక్తి న్దప మాచరించియును నీక్షింపంగ లేరేని నా
సరసీజాక్షునిఁ గన్నులారఁ గని తత్సాన్నిధ్యము న్జెంది పి
ల్తురు సేవింతురు మాటలాడుదురు బంధుత్వంబు గావించ్రహా !

ఇదిగో జగత్కల్యాణకరుఁ డగువాసుదేవుని ప్రాసాదరాజము. హరి యెందున్నా వాఁడో యావృద్ధకంచుకి నడిగి తెలిసికొనియెద. (ప్రకాశముగా) ఓయీ భద్రము

ఖుఁడా! యదుకుంజరుని సందర్శించుట కిది సమయమా! ఏమనుచున్నాఁడవు "నీనామధేయ మెఱిఁగింతువేని నేఁబోయి నీరాక దేవకీనందనున కెఱిఁగించి ముదల యయ్యేనేని నిన్ను లోనికిఁ దోడ్కొని పోయెద' ననియా? సరిసరి. ఇదిగో నన్నెఱిఁగించుకొనియెద వినుము. నేను హరిదర్శనలాలసుఁడనై వచ్చినమహేంద్రదూతను; కుబేర సేవకుఁడను; మాణిభద్రుఁడను. స్వామికి నారాక నెఱిఁగించి వేగమ రమ్ము. [తనలో] ఔరా ప్రభువులగృహద్వారములు సేవకులయనుగ్రహము లేనిచో దుర్గమములుకదా! మహేంద్రదూత నగునాప్రవేశమే యింతకష్టసాధ్య మయినప్పుడు సామాన్యులయవస్థఁ జెప్పవలయునా?

ఆ. వె. పండ్లచెట్లమొదట ముండ్లకంపలు వోలె
గొప్పవారియిండ్ల గుమ్మముకడ
ములుచబంట్లు నిలిచి మొఱవెట్టుకొనువారి
దరికిఁ జేరనీక తఱుముచుంద్రు.

అదిగో వృద్ధకంచుకి యిటే వచ్చుచున్నాఁడు. వాసుదేవుఁడు నారాక విని నాప్రవేశంబు నడపుమనియోఁ గావలయు.

[అప్పుడు దేవలుఁ డనువృద్ధకంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

దేవ—[తనలో] చిన్ననాఁటనుండినలక్షణములు పెక్కు వార్ధకమున నాయందుఁ గానఁబడుచున్నవి. ఎట్లనిన—

తే. గీ. పాటవము గనంబడదు మైఁ; బండ్లులేవు
నోట, చొంగలు గారెడు, నుడి తడబడు
మదికి నిల్కడ లే దెచ్చు మంకుతనము
ముదిమి రెండవబాల్య మన్నదము నిజము.

ఇట్లు వయోభారముచేత మేను గ్రుంగుటం జేసి నందనందనుఁడు నాయందుఁ బరమదయాళుఁడై యవ్యవస్థితము లగునాపలుకులకు నానందంబు నందుచు శ్రమకరములుగాని పనుల నియోగించుచుఁ బ్రద్యుమ్నాదికుమారులవలె న న్నాదరించుచున్నవాఁడు.

మాణి—అయ్యా! వాసుదేవునకు నాయాగమనం బెఱిఁగించితివా?

దేవ—(ఆమాట వినకయే తనలో) కాని యీవాసుదేవునిచేష్టలలోఁ గొన్ని నాకు బొత్తిగఁ గిట్టవు. లోకమునందలి సమస్తవ్యాపారములయందుఁ దాను బ్రవేశించి యందఱిభారముఁ దనపై వేసికొని నిద్రాహారములులేక నిరంతరముఁ గష్టపడుచుండును:

ఇది నాకసమ్మతము. ఇదిగాక దేవతలమని, దయ్యములమని, బోగులమని, జోగులమని కష్టసుఖము లెఱుఁగని మోటువాండ్రు కొందఱు తమసొమ్మంతయు నిచ్చటదాఁచఁబెట్టి నట్లు వచ్చి యర్ధరాత్రమనక యుపవేళయనక బంధువులతోఁ గూర్చున్ననుసరే పండుకొన్ననుసరే యాప్తబంధువులవలె వచ్చి పిలుచుకొని పోవుచుందురు. దానికేమి; వాండ్రెంత మొండివాండ్రో వాండ్రకెంత సిగ్గులేదో భార్యలతో ముచ్చటించుచున్నవాఁడని చెప్పి నను వదలి పెట్టరు. ఆకఱ్ఱజెతిపుండకొడుకులు వచ్చినట్లుగానే యితఁడును వారిని బిలుచుకొని రా పిలుచుకొనిరాయని నన్నుఁ దఱుముచుండును. కానికాలములు వచ్చి యున్నవి. గనుక తా నెంత బలవంతుఁ డయినను నేవేళకు నెటువచ్చునో. యన్నప్పుడు చెప్పినట్లు రాదుగదా యని, యేజోలికిం బోవలదని చిలుకకుఁ జెప్పినట్లు పలుమాఱులు చెప్పితిని. అయినను నామాట వినువా రెవ్వరు ? వారు పిలుచుటకు నీయన పోవుటకు సరిపోయినది. ఇదిగో నప్పుడే శనిలాగున వీఁ డెవఁడో వచ్చి కూర్చున్నవాఁడు. వీనిం బిలుచుకొని రమ్మని యాయన సెలవయినది.

మాణి—(బిగ్గరగా) అయ్యా ! నీపే రెవ్వరో నే నెఱుంగ. నామాట కుత్తర మొసఁగ వేమి? భగవంతుఁడు నాయెడఁ బ్రసన్నుఁడయ్యెనా ?

దేవ—(కోపముతో) నాపేరు దేవలుఁడు. నాకుఁ జెవుడు లేదు. నీవింత గొంతుఁ జించుకొన నక్కఱలేదు.

మాణి—అయ్యా ! కోపించెద వేల? నీయెడ నేనపరాధినైన క్షమింపుఁడు.

దేవ—అపరాధ మేమియులేదు. అధికప్రసంగ మేల ? వాసుదేవుఁడు సత్యభామాసమేతుఁడయి నీరాక కెదురుచూచుచున్నవాఁడు. నావెంట రమ్ము.

మాణి—అహాహా ! ఇది మంచిసమయమే; పోదము.

తే. గీ. సతులఁ గలసియున్నప్పుడె సత్పురుషులు
మదిఁ బ్రసన్నులై వరదు లయ్యెదరు సూవె
మెఱపుతోఁ గూడుకొనియున్న మేఘమాల
కురియకుండునె చల్లఁగఁ గుంభవృష్టి.

దేవ—మీకు సమయము కానిదెప్పుడు? పోవుదము పద.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశకము.

[అంతట శ్రీకృష్ణుఁడు సత్యభామయుఁ బీఠములపైఁ గూర్చున్నవారై ప్రవేశించుచున్నారు.]

కృష్ణ—దేవీ! మహేంద్రుఁడు మాణిభద్రుని నాకడ కనుపుటకుఁ గారణమేమై యుండును?

తే. గీ. అమరలోకంబుమీఁద నేయసురులైన
నేఁడు దండెత్తి యుందురా నీతి విడిచి
పరుఁ డెవండైన దేవేంద్రపదముఁ బడయఁ
దపము సేయుచు నుండునా తగవుఁగాలి.

సత్య—దేవా! అమరరక్షణముఁ జేయుటకుఁ గంకణముఁ గట్టుకొని మీరుండ నేదైనను మహేంద్రునకు భయము లేదు. అదిగో! దేవలుఁడు మాణిభద్రుని వెంటఁ బెట్టుకొని వచ్చుచున్నాఁడు. కారణ మిప్పుడే తెలిసికొనఁగలము.

[అప్పుడు దేవలుఁడు మాణిభద్రుఁడు ప్రవేశించుచున్నారు.]

దేవ—అయ్యా! మాణిభద్రా! అదిగో భగవంతుఁడు. ఇంక నీగోడవలు చెప్ప మొదలుపెట్టుము.

మాణి—మంచిది. (తనలో) ఇంద్రనీలమణిరోచులు వెదచల్లు నీతనిమూర్తి యింద్రసౌందర్యమును వెల్లడించుచున్నది గదా!

మ. పగచే దైత్యులు, గాటమౌ వలపుచేఁ బాథోజపత్రేక్షణల్
వగచే నాగ్రులు, జ్ఞానవైభవముచే బ్రహ్మర్షులే తేజముల్
దగ సేవించి ముముక్షు లయ్యెదరొ బంధంబు ల్వీడంబాయ నా
భగవంతుం డగుదేవకీసుతుని నాభాగ్యంబునం గాంచితిన్.

దేవ—దేవా! ఇతఁడే దేవమాత. నే నిఁక పోయి ద్వారముకడ నుండెద.
(అని పోవును.)

మాణి—త్రివిక్రమున కభివాదనము సేయుచున్నాఁడను.

కృష్ణ—మహేంద్రదూతకు స్వాగతము.

సత్య—దివ్యపురుషదర్శనముచేఁ గృతార్థుల మైతిమి.

కృష్ణ—మాణిభద్రా! నిర్జరకోటికి భద్రమా?

మాణి—ఉపేంద్రా!

తే. గీ. తెలిసి యడిగెద వనఁజాలఁ దెలిసియున్న
మరల నానోట వినఁగోర వెలుఁగనట్లు

తెలియ కడిగెద వనజాలఁ దెలియకున్నె
సర్వ మెఱిఁగిన నీ కిట్టిస్వల్పవార్త.

కృష్ణు—(ఆశ్చర్యముతో) ఏమిది యిట్లనుచున్నాఁడవు. సపరివారముగ బిడౌజునకుఁ గుశలమా ?

సత్య—నిర్జరాంగనలతోఁ గలిసి యింద్రాణి కుశలముగ నున్నదా ?

మాణి—విన్నవించుచున్నాఁడను.

చ. కుశలముజెప్పెదన్ వినుము గోపకుమారక ! కాననంబులన్
గుశలము పాకశాసనునకున్, గనకాచలగహ్వరంబులం
గుశలము వానినందనులకున్ శచికిం, జెఱసాలయూలలన్
గుశలము తత్సమూపకులకుం బెరవారలమాట లేటికిన్.

కృష్ణు—ఏమీ ! దుష్టదానవుఁ డెవ్వఁడైన వేల్పువీటిపై దండువిడిసి యమరరాజకుటుంబమును నగరమునుండి వెడలనడఁచెనా ?

సత్య—అట్లే జరిగెనని తోఁచుచున్నది.

మాణి—దేవా ! అవధరింపుము. ప్రాగ్జ్యోతిషాధీశ్వరుఁ డగు నరకాసురుఁడు నిష్ఠాగరిష్ఠుఁ డయి చిరకాలము తపముఁ జేసి పరమేష్ఠిం బ్రసన్నుం జేసికొని తదనుగ్రహంబున వరంబు లనేకంబులం బడసి జగత్కంటకుఁ డయి యథేచ్ఛంబుగ విహరించుచుఁ బ్రజలకుఁ గీడు నాపాదించుచున్నవాఁడు.

కృష్ణు—ఆదానవునిదౌష్ట్యమును గూర్చి యిదివఱకే కొంత వినియున్నాఁడను.

సత్య—అనేకరాజకన్యలం బలిమిం బట్టితెచ్చి చెఱఁబెట్టిన నీచదానవుఁ డతఁడే కదా ?

మాణి—అమ్మా ! ఆయధముఁడే. ఆకథఁ గొనముట్ట వినుఁడు. ఆదనుజకంఠీరవుఁడు మిడుతలదండుంబోలె మితిమీఱిన దనుజబలంబుం గూర్చుకొని యానడుమ నమరావతి ముట్టడించి వేల్పుదళంబుల నోడిచి పాఱఁదోలె. అప్పుడు వేల్పుదొరల యవస్థ నేమని వర్ణింతు ? వాయుదేవుండు కన్నుల కగపడక యేమూలనో యొదిగి యుండె. వరుణదేవుఁ డాపత్సముద్రనిమగ్నుఁడై యున్నవాఁడు. వైశ్వానరుఁడు దుఃఖానలసంతప్తుఁ డయ్యె. ఈశానుండు సర్వస్వము గోలుపోయి నిర్భాగ్యుఁ డయి యిల్లు వల్లకాడుగఁ జరించుచున్నాఁడు.

కృష్ణు—సరే ! ఇంక బృందారకేంద్రుఁడు రాజ్యభ్రష్టుఁడై విదేశంబులనున్నవాఁడని నీవు చెప్పనక్కఱలేకయే తెలిసికొనవచ్చును.

సత్య—అయ్యో ! మహేంద్రుఁడుఁ బౌలోమియు నిప్పు డెందున్నవారు ?

మాణి—(దుఃఖముతో) దేవా ! దేవీ ! మహేంద్రునియవస్థఁ జిత్తగింతురుగాక.

సీ. అడుగువారలకోర్కె లప్పుడ సమకూర్చుపసర మెవ్వనియింటిపాఁడిమొదవు
అరకాల ముజ్జగం బాక్రమించిన యట్టిధవళాశ్వ మెవ్వానితమ్ముఁగుఱ్ఱ
కల్పభూరుహపంచకము మొల్చునందనం బెవ్వాఁడు విహరించు పువ్వుఁదోఁట
యఖిలయాగఫలంబు లవలీల నొడఁగూర్చు పడఁతు లెవ్వనివీటి పణ్యసతులు

మొనసి జేజేలు ముప్పదిమూఁడుకోట్లు
మకుటమాణిక్యరుచుల నేమఘువుపాద
పద్మముల నివాళింతు రా బలహరుండు
నేఁడు చరియించు నిలువంగ నీడలేక.

మఱియు నోయుపేంద్రా !

చ. అల సిరితోడికోడలు, జయంతకుమారునికన్నతల్లి, వే
ల్పులదొర రాణివాసము, పులోముని గాదిలిపట్టి, వేల్పుక
న్నెలు భజియింప కల్పధరణీరుహసంతతి మేలినీడలన్
మెలఁగెడుచాన, మీవదినె, నేఁడు జరించు నరణ్యభూములన్.

కృ—కటకటా ! ఎంతకష్ట మెంతకష్టము. విధిపరిపాక మవిలంఘనీయము గదా ! అనంతర మారాక్షసహతకు లేమి చేసిరి ?

మాణి—తే. గీ. అదియొనర్చిరి దానవు లిదియొనర్చి
రనుచు వర్ణింప నేటికి కో యంబుజాక్ష !
చెప్పఁదగుకార్య మొకటి చేసినది లేదు;
నింద్యమగు కర్మ మొకటి మానినదిలేదు.

సత్య—పురుషుల యవస్థలే యట్లుండ స్త్రీలగతు లెట్లుండెనని నే నడుగ నేల ?

మాణి—అమ్మా! సాత్రాజితీ! నాపలుకులు వినదువేని వేల్పుటువిదలయునికి నీవె యుఁగఁగలవు.

తే. గీ. అసురకాంతలసౌభాగ్య మపహరించు
కమలనాభునిఁ గడుపారఁ గన్నతల్లి
యదితిదేవికైనను దప్పవయ్యె పాట్లు
చెప్ప నేటికిఁ దక్కిన స్త్రీలమాట !

కృ—భువనైకపూజ్య యగునమరమాత కేమిచేసిరి ?

సత్య—దానవక్రౌర్యము వెల్పుటవ్వలనైన విడువలేదా ?

మాణి—నరకునివాహినీపతులలో నొకఁ డగుమురుఁడు నిర్జరమాతకుండలముల హరించి తనయేలిక కర్పించెను.

కృ—(కోపముతో) దురాత్మా! నరకహతకా! పరాక్రమలవదుర్విదగ్ధ! అతిక్రాంతసమస్తరణధర్ముఁడ వగు నీనాశనము సమీపించినది సుమా! ఓమాణిభద్రా!

తే. గీ. మితి యెఱుంగక యీరీతి మిట్టిపడెడు
చెనటిదానవుఁ డికమీఁదఁ జెడకపోఁడు
పొడ వెసంగుతరంగంబు లడఁగకున్నె ?
పోటుగన్న సముద్రంబు పాటుఁ గనదె ?

మాణి—దేవా! ఇది మాకు వరప్రసాదమే. అనంతర మాదనుజహతకులు నందనోద్యానము నాశనము గావించి, మందాకినీనది మలినంబుచేసి, అమరావతి నమరశూన్యంబొనరించి చేఁజిక్కిన యచ్చరలతో నిచ్చవచ్చినచచ్చునఁ దచ్చనల నెఱపి చేయవలసిన వన్నియుఁ జేసిరి. వేయేల ?

తే. గీ. గడ్డిపోఁచయుఁ జేయని కడయసురయు
దిక్పతులవంటివారినిఁ దిట్టుఁ జొచ్చె
దండు విడియరె తొల్లింటి దైత్యనాథు
లింతపాప మేనాఁటనే నెఱుఁగఁగాక!

మరియు,

ఉ. ఆతనిదండనాథుఁ డఁట యాతనికన్నను జండశాసనుం
డేతఱియైన నోఁడె నయ మించుక; నిల్వఁగనీయఁ డొండొరుల్
ప్రాఁతిగఁ జూడనీయఁ డొకపట్టునకుం జననీయఁ డయ్యో యా
చేఁతలు చూచితీరవలెఁ జెప్పఁగ శక్యముగాదు మాధవా!

సత్య—యజమానుఁ డెంత నీచుఁడో యనుజీవులు నంత నీచులే యగుదురు.

కృ—ధనుజసేనాపతి యగు నాశూరంమన్యుఁ డెవఁడు ?

మాణి—ఆతనిపేరు హయగ్రీవుఁడు.

సత్య—ప్రాణేశ్వరా! ఈతఁడు మీ నామమును ధరించియున్నవాఁడే.

మాణి—ఖద్యోతశబ్దము మిణుఁగురుపురుగునందును హరిశబ్దము కప్పయందును శివాశబ్దము నక్కయందును వర్తించునట్లు హయగ్రీవశబ్ద మాదురాత్మునియందు వర్తించుచున్నది.

కృ—మాణిభద్రా! కాల మాసన్నమయినవారియందుఁ గనఁబడులక్షణము లన్నియు నరకాసురునియందుఁ బొడకట్టుచున్నవి.

మాణి—దేవా! మహేంద్రుఁ డిప్పుడు నరకునివంటి యధమునిచేత నిట్లయితి నని లజ్జావనతవదనుఁ డయి యున్నవాఁడు.

కృ—ఇందు సిగ్గుపడవలసిన దేమున్నది? చూడుము.

తే. గీ. కాలగతిఁ దప్పి వచ్చినఘనుఁ డయినను
నిగ్రహింపఁ బడుఁ జుమీ నీచుచేత
జగము లన్నియు వెలిఁగించు చండకరుఁడు
చిన్నమబ్బులచేత సంఛన్నుఁ డగును.

మాణి—అంత మహాతేజశ్శాలి కింత పరాజయము కలుగఁ దగినదికాదు.

కృ—ఓయీ! తేజశ్శాలులకేగదా జయాపజయములు కలుగుట. చూడుము.

తే. గీ. న్యూనతయు గౌరవంబు మహోన్నతులకె
గాక నీచుల కెబ్భంగిఁ గలుగవచ్చు?
నలఘుతేజు లౌ సూర్యచంద్రులకె గాక
గ్రహణ ముండునె మింటిచుక్కలకు నెల్ల?

మాణి—దేవా! మీసమాశ్వాసంబున నాహృదయతాపము దీఱినది. మహేంద్రుఁడు మీకు విన్నవింపు మన్నసందేశము వినుఁడు.

కృ—సావధానుఁడ నయి యున్నాఁడను.

సత్య—ఆపత్సమయమునఁ బంపిన యీసందేశము జాలిగ నుండకపోదు.

మాణి—దేవా! నా చెప్పఁబోవునవి మహేంద్రవాక్యములు.

సీ. కాళీయఫణిఫణాగ్రములఁ దాండవమాడు నడుగుఁదమ్ములకు జోహారులనుము
అదితికశ్యపులకు నవతరించిననాఁడు మాకొనర్చినమేలు మఱవమనుము
అమరసంతతి యిట్టులగచాట్లుపడుచుండ నోరనికై వడిఁజూచు టొప్పదనుము
ఈతెఱంగునఁజేయ లాఁతివారమె మేము చాలకాలమునాఁటి సఖులమనుము

ఆలుబిడ్డలదెసఁ జూచి యమరవిభుఁడు
వేయిఁగన్నులబొమ్మము ల్విడిచె ననుము
అసురఁగడతేర్చుపని తన కలఁతి యనుము
దైవహిత మాట నీయది దప్ప దనుము.

సత్య—ఈసందేశము విన్నపిదప తాతిగుండెలయిన కరఁగి జాలినొందును.

కృ—అన్నన్నా! ఎంతమాట నిరుపమానమహిమాఢ్యుఁడును నిర్జరలోకసార్వభౌముఁడును శూరశిఖామణియు నగుశతక్రతుఁ డిట్లు దీనోక్తులం బలుకవలసెనే? తన సేవకునకు నాకింత వినయపూర్వకముగ మనవి సంపవలయునే? మాణిభద్రా! నీవరిగి మహేంద్రునితో నిట్లని విన్నవింపుము.

సీ. ఋజుమార్గవశులౌట బృందారకుల కెందు దేవకీసుతుఁడు విధేయుఁ డనుము
పదునాల్గుజగముల పాదపద్మములైన సుధీంద్రులకిది మాకు నిడుదు ననుము
తనయనుగ్రహమున్న దనుజవీరుల నాజి నిగ్రహించుట యొక్క నిముసమనుము
నిర్నిమిత్తంబుగ నిరపరాధుల నేఁచు పాపకర్ములకు లింక బ్రతుక రనుము

దివిజవైరి నిశ్చయముగఁ దెగియె ననుము
ధర్మమే జయించెడుమాట తథ్య మనుము
మదిని వగదక్కు మనుము నామాట వినుము
వేల్పువీటికి నీవు వేవేగఁ జనుము.

మాణి—దేవా! ధన్యోస్మి! ధన్యోస్మి! వేల్పులయిడుములు కడముట్టినవి. ఇంక నే నరిగెద (అని నిష్క్రమించును.)

సత్య—ప్రాణేశ్వరా! మీరాపద్బాంధవులన్నమాట నేఁడు స్పష్టమైనది. గజేంద్రరక్షణము పరోక్షమునం జరిగినది. మహేంద్రరక్షణము నేఁడు ప్రత్యక్షముగ జరుగుచున్నది. మునులపాలింటికి దేవతల పాలింటికి మీమూర్తి భూలోకమందారము గదా!

(తెరలో)

దేవకీనందనా! రక్షింపుము. రక్షింపుము.

కృష్ణ—ఏమది? ఆర్తనాదము వినఁబడుచున్నది. ఓరీ! ఎవఁడురా యక్కడ?

దేవలుఁడు—[ప్రవేశించి] ఇదిగో వచ్చినాఁడ నాజ్ఞాపింపుము.

కృష్ణ—దేవలా! ఎవరో రక్షింపుమని కుయ్యిడుచున్నారు కనుఁగొని రమ్ము.

సత్య—దేవలా! అతిత్వరితమున రమ్ము. నామనసు తత్తరపడుచున్నది.

దేవ—చిత్తముదేవా! (అని నిష్క్రమించి మరలఁ బ్రవేశించి తనలో) అబ్బబ్బా! నడకీనుఁగులవంటి యీమునిముచ్చులకు సిగ్గు లేదుగదా! జనుపనారపీచులవంటి గడ్డములు, నీఁతతుప్పలవంటి తలలు, బిరుసుమేనులుగల యీపాడుమునులు పనిపాటులు

లేక దుంపలు కాయలు కూరలు తిని తఱపిదూడలవలెఁ దెగబలిసి. యెవరితోనో క య్యమునకుఁ గాలుద్రువ్వి వైరముఁ దెచ్చుకొని యందఱకు లోకువగ మాయమర్మము లెఱుఁగని వెఱ్ఱిగొల్లఁ డిక్కడ నున్నాఁడుగదా యని వచ్చి యిచ్చకాలు మచ్చికలు చెప్పి కల్లబొల్లి యేడ్పు లేడ్చి మనసు విఱిచి యీయయ్యను దీసికొనిపోవుదురు. పోవద్ద ని నేనెంత మొత్తుకొన్న నామాట వినఁడు. పోనీ. నాకేమి ? (అని ప్రకాశముగా) మహాప్రభూ ! ఎవరున్నారు ! మనచుట్టాలు బదరికాశ్రమతాపసులు. మీదర్శనము కా వలయునట.

కృష్ణు—అట్లయిన సత్వరము వారిం బ్రవేశపెట్టుము.

దేవ—చిత్తము (అని పోవుచున్నాఁడు.)

సత్య—మహర్షు లూరకరారు. మహత్కారణ మేదో యుండవలయును.

కృష్ణు—లోకసంబంధములేని యీ తపోధను లిటకు రాఁ గారణ మేమిచెపుమా ! వీరి కేదుర్గ్రహములవలన నేని భయము కలిగియుండదుగద !

మ. మనుచుం గానలఁ జెట్లనీడలను, జర్మంబుల్ మెయిం దాల్చుచుం,
దినుచుం దుంపలు కాయఁగూరలు, నదీనీరంబులం ద్రావుచుక్
మనమం దెప్పుడు నీశ్వరుం దలఁచుచు, నొక్కరుంబుతో శాంతతక్
దినము ల్వుచ్చెడు నీయలౌకికుల, నేనీచుంకు బాధించెనో ?

సత్య—ఈమహాత్ములును రాక్షసబాధితులే యని నేఁ దలంచెద.

[అప్పుడు పులహబృహదశ్వు లనుమహర్షులతో దేవుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దేవ—మునులారా ! అదిగో వాసుదేవుఁడు. పనులన్ని మానుకొని మీనిమిత్త మెదురు చూచుచున్నాఁడు. దర్శనము చేసికొనుఁడు.

పుల—(కృష్ణునిఁజూచి) బృహదశ్వా ! ప్రావృట్ప్రమోదముఁ దలపించు నీమూ ర్తిం గనుఁగొంటివా ?

బృహ—పులహా ! మాఁగినరేగుఁబండ్లు తినఁదరగి బదరికావనమును బాసిపోవలేక తొల్లి మనలం గలసిమెలసి చరించిన నాఁటి నారాయణుని దివ్యమూర్తియే యిది.

పుల—ఔనౌను.

సీ. పడఁతిఁ బాయఁగలేక పాలసంద్రమునందు నిల్లటికముంగొన్న యల్లుఁ డితఁడు
బృహ— మొసలికోఱలఁ జిక్కి పసదూలి పలవించు సింధురేంద్రుని ప్రాణబంధు వితఁడు
పుల— ఏకువాఘ్రలనీళు లేకంబ యగునాఁడు పట్టియాకున నున్న కుఱ్ఱఁ డితఁడు
బృహ— భువనకంటకు లైనపాలసుదిండులఁ బట్టి మట్టుపెట్టిన జగజెట్టి యితఁడు

పుల— మీన మీతఁడు తా మేఁటిమేటి యితఁడు
పోత్రి యీతఁడు నరసింహమూర్తి యితఁడు

బృహ— పుట్టుబుద్ధులు గలపొట్టిప్రోడ యితఁడు
చూడఁజూడ దీనులపాలి చుట్ట మితఁడు.

దేవ—(కృష్ణునితో) దేవా! వీరె పులహబృహదశ్వు లనుమహర్షి మునులు. నే నింక ద్వారముకడ నుండెద. (అనిపోవును.)

ఋషులు—విజయతాం విజయతాం దానవకురంగకంఠీరవ!

కృ—మహర్షుల కభివాదనము సేయుచున్నాఁడను.

ఋషు—అనయో ర్దంపత్యో రభ్యుదయోస్తు.

కృ—మీ రాపీఠములమీఁద నాసీనులుగండు. (ఋషులు కూర్చుండుదురు.)

సత్య—(మెల్లగా) ప్రాణేశ్వరా! మహర్షులు ఖిన్నులై కనఁబడుచున్నారు సేమ మడుగఁదగును.

కృష్ణ—దేవీ! నాకు నట్లే కనఁబడుచున్నారు. (ఋషులతో) మహాత్ములారా! ఫలాపేక్ష పరిత్యజించి పరమేశ్వర ప్రీత్యర్థము జగదభ్యుదయము నిమిత్తము మీరు గావించుతపసులు నిర్విఘ్నములుగ సాగుచున్నవా?

పుల—ఈవఱకు సాగుచున్నవి.

ఉ. ఎన్నఁటిమాటలో యడిగె దీవిటు, మాంబదరీవనంబులో
నిన్నడుమం బ్రవర్తిలిన వెల్ల నెఱుంగవు గాక, ధర్మముల్
జన్నములుం దపస్సులును జన్నవి మొన్నటితోనె, యింతగా
నున్నది నీజగద్భరణ మోనలినేక్షణ! యిన్ని నాళ్ళకున్.

బృహ—ఇంక జగదభ్యుదయమునకు లోప ముండదు. ఏమనిన,

తే. గీ. ఇంద్రుఁ డైనవాఁ డిపుడు దైత్యేంద్రుఁ డొకఁడు
వాని వాహినీపతులు దిక్పతులు గాఁగఁ
బ్రబలదుష్టకర్మములు కర్మములు గాఁగఁ
బిశితభోజనుల్ మునులుగా వృష్ణితిలక.

కృష్ణ—అయ్యో! మీరును నరకబాధితులై తిరా యేమి?

పుర—దేవా! నీవు లెస్సగ గ్రహించితివి మేము బ్రతికియుండియు భూలోకమున నరకబాధ ననుభవించుచున్నాము.

బృహ—ఇది పుణ్యాత్ములే యనుభవించు యపూర్వనరకబాధసుమా!

సత్య—ప్రాణేశ్వరా ! ఏజోలికినిరాని పరమవైదికులపైనయిన నాదుర్జనులకు జాలి గలుగదయ్యెఁ గాఁబోలు !

కృష్ణు—కళ్యాణీ! క్రూరు లుచితానుచితముల నెఱుఁగరు కదా !

తే. గీ. కాననంబున రేఁగినకారుచిచ్చు
వేములను గాల్చి మామిళ్ళ విడిచి చనునె ?
వ్యాఘ్రయునకుఁ బెద్దపులి యెంతొ మేకమునంతే
దుష్టులకు సాధువులు నసాధువులు నొకటె.

ఓమహాత్ములారా ! నరకుఁడు మీపైఁ కేల రావలసివచ్చె ?

పుల—దేవా ! తత్కారణమును మే మానుపూర్విగ నెఱుఁగముగాని కర్ణాకర్ణిని వినియున్నాగము. మాదురదృష్టము మూర్తిగైకొన్నదో యన్నట్లు త్రిదివమున నూర్వశి యను నొకభోగముది కలదట !

కృ—అవును. పూర్వ మచ్చరలపైఁ గోపముచే నారాయణఋషి యామెను సృజించెను.

సత్య—ఏమి ! ఋషియే సృజించెనా ? పద్మగర్భుఁడు కాఁడా ?

పుల—అమ్మా ! ఇట్టియవివేకకార్యములు మహర్షులుగాక యెవరుచేయుదురు ?

బృహ—ఒక్కమహర్షులే కాదు. బ్రహ్మయు నట్టివాఁడే.

తే. గీ. ఊరకయె పెక్కుకల్పంబు లుండియుండి
వెఱ్ఱిబ్రహ్మ తానొకదైత్యవిభు సృజించు
వానిఁ దెగటార్ప భువనముల్ పల్లటిల్లు
మొదటినుండియు నిదె నచ్చు మొదటివేల్పు.

పుల—దేవా ! అవధరింపుము. ఆమరాత్ముఁడు స్వర్గము జయించి, యింద్రుం బాఱఁదోలి, యూర్వశిని దన కుంపుడుకత్తెగ నుండుమని ప్రార్థించెనఁట ! అదియు ము నుల యాగముల హవిర్భాగములు గ్రహించి యింద్రత్వసిద్ధిఁ జేకొన్న పిదప వానిని వరింతునని పలికెనఁట ! అది విని దుష్టదానవులు మా యాశ్రమములకువచ్చి దానవేంద్రునకు హవిర్భాగములు తెమ్మని నిరోధించి యడిగిరి.

బృహ—సాంగ్రామిక శాస్త్రవేత్తలై యాయుధపాణు లయినవీరులే వానియెదుట నిలువలేకపోవ నాయుధములులేక దండకమండలు కృష్ణాజినదర్భాసనాదులగునిరర్థకసాధనము గల మావంటి పరమవైదికు లేమి చేయుదురు ?

కృష్ణ—అప్పు డేమైనది ? మీరు హవిర్భాగముల నిచ్చుటకు సమ్మతించిరా !

పుల—పాపము శమించుఁగాక ! పాపము శమించుఁగాక ! మాధవా ! మే మెంత పరమఛాందసులమయినను మహాపాతకు లగుదానవాధములకు హవిర్భాగము లిత్తుమా ? అది స్వప్నవార్త. వానితో నప్పు డేనిట్లంటి.

క. నెత్తురు ద్రావిన ద్రావుఁడు
కుత్తుక గోసినను బట్టి కోయుఁడు మీ కే
మిత్తుమొకో హవిర్భాగము
తొత్తుకొడుకులార ! వేల్పుదొర కిడ కుండన్.

సత్య—మునులధైర్యము మెచ్చఁదగినది.

కృ—అప్పుడు వారలు మిమ్మేమి చేసిరో మే మూహించుకొనవచ్చును.

బృహ—మాదీనచరిత్రము మానోటనే వినుఁడు.

సీ. మొగము నెత్తురు గ్రమ్మ నెగఁగుంజిఁ దిగఁగుంజి బిరుసుగడ్డము లూడఁబెఱికినారు
వ్రేలు పెన్నెఱిజడల్ కేలుదోయినిఁ బూని హుమ్మని యుయ్యాల లూఁగినారు
ఆజ్యమంతయుఁ ద్రావి యగ్నిహోత్రములార్చి హోమకుండంబుల నుమిసినారు
పాఱిపోవఁగ నీక నోరు బ్రద్దలు చేసి కుక్కమాంసము నోటఁగ్రుక్కినారు
చెట్లులకు రెక్కలు విఱిచికట్టినారు
చింతబరికెలతో వెన్నుఁ జెండినారు
నారగోచులు దిగలాగి నవ్వినారు
కాళులగుచు రక్కసిముండకొడుకు లనఘ !

కృ—కటకటా ! అప్పుడు దేవబ్రహ్మర్షులకు మహత్తరమైన చిత్తక్షోభము గలిగి యుండును.

సత్య—ఆహాహా ! ఋషు లెంతదయాళువులో చూడుఁడు. అప్పటికయినను దుష్టదానవులను శపింపరైరి.

పుల—అమ్మా ! శపింపకపోవుటకు మాదయ కారణము గాదు.

క. శాపం బిచ్చుట కైనను
శాపోదకములు గ్రహించి చల్లుట కైనన్
గోపించుట కైనను మా
కోపిక లేదయ్యె చేష్ట లుడిగినకతనన్.

కృ—అనంతర మేమి జరిగినది ?

బృహ—అప్పు డప్పాలసుదిండులు కొండముచ్చులమచ్చునం బెచ్చు పెఱిఁగి. యాశ్రమమహీరుహంబుల నిర్మూలించియుఁ బెంపుడుమృగములఁ జంపియు ఋషికన్యలఁ జెఱబెట్టియు కమండలంబులఁ దుత్తునియలు గావించియు నాషాఢదండంబులు విఱిచియు మొలత్రాడుల జన్నిదంబులఁ ద్రెంచియుఁ బర్ణశాలల భస్మీపటలంబు గావించియు వర్ణింపరాని క్రౌర్యంబుల నెఱపిరి.

పుల—తే. గీ. నా కమండలు వట్లు భిన్నంబు లగునె
యాదురాత్ములతల లెన్నఁడైన కృష్ణ !
బృహ— యాశ్రమమహీరుహము లట్లు లా పాతకులు
దుంపతెగి యెన్నఁడైన పోదురె ? ముకుంద !

కృ—బ్రాహ్మణులవంటి మీపలుకు లసత్యములు గావు. వారల్లే నశింతురు.

సత్య—వీరుపడిన యలజడి వీరిమాటలం దెలియవచ్చు.

పుల—ఓయమరపక్షపాతి ! వాని నాశనము నీవే చేయవలెను ఏలయన,

తే. గీ. శూలివలనఁ గాదిది తమ్మిచూలివలనఁ
గాదు మఱి యెవ్వరివలనఁ గాదు సుమ్మ
నరకు మూర్ధంబు ధరఁ ద్రెళ్ళ నఱుకఁబడును
నరగ నీచేత నీసుదర్శనముచేత.

బృహ—దేవా ! ఈవిషయమున నిన్నుం బురికొల్పుటకు మేము కడుశంకించుచున్నాము. ఏమన,

క. నీకొడుకఁట యాదనుజుఁడు
నీకొడుకే యిట్లు సేయ నిలుచునె జగముల్

పుల—నీ కెందు కూరకుండుము.
యాకీర్త్యపకీర్తు లింక నతనివె కావా ?

కృ—లోకాపకారులు సుతులయినను వధ్యులే.

సత్య—భగవంతుఁడుదక్కఁ దదన్యు లట్లు సలుపలేరు.

పుల—ఓయదుకుంజరా ! ఇంక వేయిమాట లేల ?

తే. గీ. వైదికము లైనకర్మముల్ వల దటంచుఁ
జెప్పి మాచేత మానిపించినను సరియె

బృహ—పుత్రవాత్సల్యమును ద్రోసిపుచ్చి వేగ
చెనఁటి యసురను సంహరించినను సరియె.

కృ—అట్లయిన నోతాపసులారా! ఇటు వినుండు. ఆదురాత్ముఁడు—

మ. ధరణీగర్భము దూఱనీ, పఱచి పాతాళంబునన్ దాఁగనీ,
శరధిన్ మున్గి యడంగనీ భువనముల్ సంక్షోభమున్ బాయఁగా
నరకున్ దుర్మద సంగరస్థలవిఘూర్ణచ్చక్రధారాహతిన్
మరలన్ వైదికమార్గముల్ నిలిపి ధర్మంబున్ బ్రతిష్ఠించెదన్.

ఋషులు—తథాస్తు. తథాస్తు. తథాస్తు 'అని చేతులెత్తి'

శ్లోకము. జయతుజయతుదేవో దేవకీగర్భజాతో
జయతుజయతుచక్రం నిగ్రహీదైత్యచక్రం
జయతుజయతువేద శ్శాశ్వతానంద నాదో
జయతుజయతుధర్మో వైదికోత్కృష్టకర్మా.

కృ—మహర్షుల యాశీర్వచనము లమోఘములయి జయప్రదము లగుగాక.

సత్య—మహర్షులు సంకల్పసిద్ధు లగుట మీరెఱుంగరా ?

పుల—మధుసూదనా ! కుమారుఁడు తారకుని, ధూర్జటి పురదైత్యులను, పిల్కుమార్చి జయంబు వడసినతెఱంగున నీవును నరకుం గెల్చెదవు. కాని నీవు కడుజాగరూకుఁడవై మెలంగవలయునుసుమా; వాఁ డసాధారణ తేజోదుర్నిరీక్ష్యుఁడు దుర్జయదోర్బలనిర్జరేశ్వరుఁడు, వీనిమరణవార్త నెప్పుడు విందుమా యని మేము మాచెవులు టెక్కఁబెట్టుకొని యుందుము.

బృహ—దేవా ! నేను నించుక చెప్పఁదలఁచుచున్నాఁడను. అవధరింపుము.

చ. కుటిలుని సోమకాసురునిఁ గూల్చుట కూల్చుటగాదు సూ, మహా
కిటి వయి హేమలోచనుని గెల్చుట గెల్చుట గాదు, సాహసో
ద్భటు బలి భూతలంబునకుఁ బంచుట పంచుట గాదు, క్రౌర్యలం
పటునరకాసురుంబిలుకు మార్చుట మార్చుట గాక యచ్యుతా !

కృ—మహర్షులారా ! నాకోపంబునకు మీశాపఫలంబు సాయమై వానికి మరణ మాపాదించు.

పుల—అట్లయిన మే మింక నాశ్రమంబునకుఁ బోయి భయవిహ్వలులగు దక్షిణ మునుల కీశుభవార్త నెఱిఁగించెదను.

కృ—ఓయీ ! ఎవఁ డక్కడ ?

దేవ—(ప్రవేశించి) దేవా! ఇదిగో వచ్చితి నాజ్ఞాపింపుము.

కృ—దేవలా! ఈమహర్షులను సాగనంపుము.

దేవ—చిత్తము (అని తనలో) మఱ్ఱియూడలవలె జడలు, పిచ్చికగూండ్లవలె జుట్టుగల యీటక్కరిమునులఁ జూచినతోడనే నా కరికాలిమంట నెత్తికి వచ్చును. వీం డ్రేవో కల్లమాటలు చెప్పి కృష్ణుని తమవలలో వేసికొనిపోవుచున్నారు. ఆరక్కసి ముండకొడుకులు కొట్టినప్పుడు వీండ్రు మరల నిక్కడకు రాకుండునటులు కొట్టలేరైరి. పోనీ పోవలదని కృష్ణునితోఁ జెప్పుదునా? అయిన నా కేందుకు? (ప్రకాశముగా) ఋషులారా! పోవుదమురండు. (అని ఋషులతో నిష్క్రమించును.)

కృ—దేవీ! మునుల మనోవైకల్యముచే నాచిత్తమెంతయు జాలినొందియున్నది కావున లోకకంటకుఁ డగునాదుండగీని నిప్పుడ పోయి శిక్షించెదను.

సత్య—నాచిన్న విజ్ఞాపన మొకటి యున్నది. మీరు పగతు నెదుర నిలిచియతి లాఘవంబున ససహాయశూరులయి పోరునపుడు కన్నులపండువుగ మిమ్మొకసారి చూడ వలయునని నాకుఁ జిరకాలమునుండి యభిలాషకలదు; రసికశిఖామణు లగుదేవరవారీముద్దు సెల్లింపవలయునని వేఁడుచున్నాను.

కృ—దేవీ! ఇది యేటికోర్కె?

మ. నగలా నాణెములా యమూల్యమణులా నవ్యాంబరశ్రేణులా
సొగసుం జేడియలా జగానగరులా చొక్కంపుఁ బూఁదోటలా
మగువ లోర్కెరఁగ రానికోరికల నిమ్మాడ్కిన్నను న్వేఁడఁగాఁ
దగునే జూడఁగలారె యంగనలు భీతిల్ గాక కయ్యంబులన్.

సత్య—ప్రాణేశ్వరా!

మ. నగలు న్నాణెములుం బ్రశస్తమణులు న్నవ్యాంబరశ్రేణులున్
సొగసుంజేడియలున్ జగానగరులున్ జొక్కంపుఁబూఁదోటలున్
మిగులం జేకుఱె మీయనుగ్రహమునన్ మీవెంటఁ గొంపోవుటే
నగలు న్నాణెములౌను నాకుఁ గరుణ న్నాముద్దు సెల్లింపరే.

కృ—దేవీ! నీ వలుగకుందువేని నేనొకమాట చెప్పెద. యుద్ధ మన నేమిగాఁ దలఁచుచుంటివి?

సీ. కదలుకొండలఁ బోలు గజతండములెకాని గండుతుమ్మెదపిండు లుండ వచట
క్రూరదానవసమూకోలాహలమెకాని యొఱపుఁగోయిలకూఁతలుండ వచట

కుటిలదైత్యులమేని క్రొన్నెత్తురులె కాని యొసపరిపూఁదేనె లుండ వచట
పరసేన విడిసెడుబయటిసేలలెగాని యొప్పారుసౌధంబు లుండ వచట
ఘూక కాకగృధ్రములు మూఁగుటయె కాని
చిలుక గోరువంక నెమ్మిరాయుఁ జేర వచట
పొలసుదిండిపీనుఁగుల పొలయె కాని
యలరు నెత్తావి గమగమ లమర వచట.

సత్య—రణరంగ మట్లుండునని నే నెఱుంగకపోలేదు. కావున నాయాగమనమున కనుమతింపుఁడు. మఱియు,

తే. గీ. సగము దేహంబు నింటిలోఁ జక్క విడిచి,
యనికి మీరు పోవుట యేటిన్యాయ మనఘ!

కృ—యెనిమిదిసగంబు లున్నవో యిందువదన
యేసగఁబును గొనిపోదు నిప్పుడేను?

సత్య—ఏసగంబు మీవెంట రాదలఁచుకొన్నదో యాసగమును గొనిపొండు.

కృ—దేవీ! రణమునకుఁబోవుచు రమణుల వెంటఁబెట్టుకొని పోరాదు. జయాపజయములు మునుమున్న నిర్ణయింపఁజాలము. ఒకవేళ నాకుఁ బరాజయంబే సంభవించునేని నేను నిన్ను శాత్రవులబారినుండి సంరక్షించుట దుర్లభముకదా!

సత్య—ఏమి! పరాజయమా? మీరొక్కరే సమరమునకుఁ బోయినను బరాజయ ముండదు. అందు నేను మీసన్నిధినుండ నట్టిది తలంపరాదు.

కృ—నీవు నాకుఁ బరాజయము కలుగకుండ నేమిచేయుదువు?

సత్య—సీ. ఆహవంబున మీర లలసినప్పుడు మేనిచెమ్మటల్ దుడిచెద చెఱఁగుతోడ
పరుమేనశరపరంపర లేయ, దమకింప నలుఁగు లందిచ్చెద నండనుండి
నూతుండు క్రాంతుఁడై సొమ్మవోయినవేళ నరదంబు గడపెద ననువెలింగి
పగతుండు చెలరేగి పయిపయింగవిసిన బురికొల్పి పంచెదఁ బోరొనర్ప
మఱచుపనులను జ్ఞప్తికి మరలదెత్తుఁ
గలసి చేదోడు వాదోడుగాఁ జరింతు
వేయు నేటికి హృదయేశ! విను తెలిపెద
వాలుఁ గైకొనిపోరెద వలయు నేని.

కృ—దేవీ! ఇంతకాలమునుండి నీ కట్టిప్రజ్ఞ లుండుట నే నెఱుంగనయితి, ఎన్నఁడు నేర్చితివి?

సత్య—దేవా !

తే. గీ. విల్లువంచుట కూర్చుట వింటినారి
పలుఁగుఁ దొడుగుట యేయుట యద నెఱుఁగుట
రథముఁ దోలుట మొదలైనరణపుఁబనులు
చిన్ననాఁటను మాతండ్రి చెప్పెఁగొంత.

కృ—దేవీ ! నిన్నుఁ దోడ్కొనిపోవుట కెంత సమర్థించుకొన్న నామనసొప్ప కున్నయది. వలదన్న నీ వాగ్రహింతువు. పట్టపుదేవియయ్యు రుక్మిణి యెన్నఁ డిట్టి కోరికలు కోరియెఱుఁగదు.

సత్య—ఔను. నిశ్చయమే.

చ. అనయము భోజరాజసుతయట్టులు జాణను కానుగాని, నా
పనుపును మీరొనర్చుటకుఁ బట్టపుదేవిని కాను గాని, నే
నును నొకరాచకన్నియనె, న్యూనత కోరువ, నింతమాత్రపుం
జనువుల కేనియుం దగదు సత్యయటంచును నేఁ డెఱింగితిన్.

(అని పోఁబోవుచున్నది.)

కృ—(చేయిపట్టుకొని) సుందరీ ! పోకు. పోకు. స్మరచాపంబులఁ బోలు నీకన్బొమలు ముడువకుము. ఇదిగో నా వెంటవత్తువు పయినము గమ్మి.

సత్య—నే నిప్పు డనుగ్రహింపఁబడితిని. రండు పోదము.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ప్రసన్నయాదవము

చతుర్థాంకము.

ప్రదేశము—ప్రాగ్జ్యోతిషపట్టణమునందలి బయలు.

[అప్పుడు వజ్రకంఠుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వజ్ర—(తనలో) కటకటా ! ఈదానవులసంపదలు గనుబొమ్మలమీఁది వెండ్రుకలవలె నెప్పటికిని నెదుగుఁబొదుగులేక యొకమచ్చుననే యున్నవిగద. ఎవఁడో యొక దైత్యుఁడు బాహుబలముచే వేల్పుల గెలిచి విజృంభించినపుడు వానిసాయంబుఁ జూచుకొని మేమందఱము గాలికి లేచి యాడు నెంగిలివిస్తరాకులవలె మిడిసిపడి యావీరుని యధికార మడఁగినతోడనే మరల నొదిఁగి యుందుము. బలిసినదున్నపోతు నాశ్రయించిన గోమారులవలె బలగర్వితుఁ డగునరకమహారాజు నాశ్రయించి సుఖపడు నీరాక్షసుల గతి యేమగునోకద ! ఈనరకమహారాజునకు మఱియెవరితో యుద్ధమువచ్చిన నేను జంకను; కాని బలుటక్కరియు దుస్స్వభావుఁడు నగు వాసుదేవునితో నిప్పుడు యుద్ధము వచ్చెను గాన నేను విజయమునుగూర్చి సందేహించుచున్నాను. ఈవాసుదేవహతకునిచేత దేవాసుర యుద్ధములయం దయిన వెనుకంజ పెట్టియెఱుంగని యసహాయశూరు లగు రాక్షసప్రవరు లనేకులు నిష్కారణముగ వధింపఁబడిరి. ఇంతకు మాదినములు మంచివి కావు. అయిన నప్రతిహతప్రతాపుఁ డగునరకుఁడు శ్రీకృష్ణుని మూర్ఛిల్లజేయుటచే మాకే విజయమగునని యించుకధైర్యము కలిగినది. ఇదిగో మందపాలుఁ డిటే వచ్చుచున్నాఁడు. వీఁ డెందుండి వచ్చుచున్నాఁడో తెలిసికొనియెద.

[అంతట మందపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మంద (తనలో) ఏమి చెప్పుమా ? మావజ్రకంఠుఁ డొక్కఁడు నిచ్చట నిలుచుండి యేదో యోజించుచున్నాఁడు. నే నీనడుమ గ్రామములో లేనప్పుడు విశేషము

లేవైన జరిగినవేమో వీనినడిగి తెలిసికొనియెద. (సమీపించి) వజ్రకంఠా! విశేషము లెవ్వియు లేవుగదా?

వజ్ర—విశేషములు న న్నడుగుచున్నా వేమి? నీవెఱుఁగవా!

మంద—నే నీనడుమ గ్రామమునందు లేను.

వజ్ర—ఏగ్రామ మెందునిమిత్తము పోయితివి?

మంద—చెప్పెద వినుము. నాభార్య మూఁడు నెలల క్రిందట పుట్టినింటికిఁబోయినది. ఆమె యక్కడనుండఁగనే కిట్టనిముండకొడుకు లెవరో పదిదినములక్రిందట రాత్రివేళ వచ్చి నన్నుఁ బిలచి, యోరీ! నీభార్యకు వైధవ్యము సంభవించినది; కాన నీవుపోయి చూచిరమ్మని నాతోఁ జెప్పిపోయిరి. పెండ్లి చేసికొన్న భార్య యంతదుఃఖములో నున్నపుడు పరామర్శ చేయకపోవుట బాగుండదని నేను మఱునాఁ డుదయముననే బయలుదేఱిపోయి చూచితిని.

వజ్ర—పాప మాబిడ వైధవ్యదుఃఖముచేత బాధపడుచున్నది కాఁబోలు.

మంద—అబ్బే! వైధవ్యము లేదు యేమిలేదు. పసుపుకుంకుమ బెట్టుకొని కలకలలాడుచు మహాలక్ష్మిలాగున నాకెదురు వచ్చినది. మాదంపతులపొందిక చూచి యోర్వలేక కిట్టనివాం డ్రట్టినాడుక వేసిరి.

వజ్ర—ఓరీ! నీవుండఁగ నీభార్య ముండమోయునా?

మంద—అదియేమిమాట. నేనుండఁగ లోకమునం దింతమంది యూఁడువాండ్రు ముండమోయఁగ నాభార్యమాత్రమేల ముండమోయఁగూడదు? కానికాలములు వచ్చినవి. ఏవేళ కేమో యెవ్వఁ డెఱుఁగు.

వజ్ర—సరే. నీచరిత్ర బాగున్నది. ఇక్కడి విశేషములు చెప్పెదవినుము. మన నరకమహారాజుగారిమీఁద మూఁడుదినములక్రిందట శ్రీకృష్ణుఁడు దండెత్తివచ్చె. అప్పటినుండియు నతనికి రాక్షసవీరులకును ఘోరయుద్ధములు జరుగుచున్నవి.

మంద—(ఆశ్చర్యముతో) శ్రీకృష్ణుఁడు దండెత్తి వచ్చెనా? (కొంచె మాలోచించి) అయినను భయములేదు మహాశూరుఁడు మురుఁడు లేఁడా?

వజ్ర—లేకేమి! యున్నాఁడు.

మంద—ఎక్కడ?

వజ్ర—పరలోకమున.

మంద—ఏమి! అతఁడు మృతినొందెనా? ఎంతకష్టము! నిశుంభుఁడేమయ్యెను?

వజ్ర—పాపము. మురుఁ డొక్కరుడుం బోవలేక చిరమిత్రుఁ డగునిశుంభుని వెంటఁ గొనిపోయెను.

మంద—కటకటా ! నిశుంభుఁడు విహతుఁ డయ్యెనా ? ఇంక దిక్కెవ్వరు ? పంచజనుఁ డున్నాఁడు కదా ?

వజ్ర—ఈనడుమ నతఁడు తండ్రిని జూడఁబోయినాఁడు.

మంద—అయ్యయ్యో! హయగ్రీవుఁడయిన వాసుదేవు నెదుర్కొనలేదా ?

వజ్ర—అయ్యో ! ఎదుర్కొనకేమి. అతఁడు కొంతసేపు పోరిపోరి నిన్నసాయం కాలమే రంభాసంభోగార్థమై చనెను.

మంద—అయ్యయ్యో! సమయమునకు పంచజనహయగ్రీవు లిద్దఱు లేకపోయిరే? వారాపనులమీఁద నిప్పుడే పోవలయునా ? మఱియొకప్పుడు పోరాదా, వారి నిప్పు డేల పిలిపింపఁగూడదు ?

వజ్ర—పిలుచుటకుఁ దగినవా రెవ్వరులేరు. నిన్నే పంపఁదలఁచుకొన్నారము. పోవుదువా ?

మంద—అయ్యో! పోకేమి, స్వామికార్యము చేయనా ?

వజ్ర—అట్లయిన శ్రీకృష్ణునియెదుటకుఁ బోయి నిలువుము. అతఁడే నిన్నుఁ బంపఁగలఁడు.

మంద—ఓరి ! దుర్మార్గుఁడా ! నన్నుఁ జావు మనుచున్నావా ?

వజ్ర—చావకుండఁ జచ్చినవారియొద్ద కెట్లు పోఁగలవు.

మంద—అట్లయిన పంచజనహయగ్రీవులు చచ్చినారా ?

వజ్ర—చావక బ్రతికియున్నారా ?

మంద—నీకడుపుకాల ! నీమాట లెప్పుడు నిట్లే యుండును. ఏసంగతియు సరిగాఁ జెప్పక నడ్డదిడ్డముగఁ జెప్పెదవు. ఇప్పుడు మహారాజుగా రేమి చేయుచున్నారు?

వజ్ర—ఆయన యుదయమునుండియు శ్రీకృష్ణునితోఁ బోరుచున్నారు. ఇప్పటివఱకు మనపక్షము బలముగానే యున్నది. మహారాజుగారు శక్తి నొకదానినిఁ బ్రయోగించి వాసుదేవుని మూర్ఛపుచ్చినారు. అందుచే మాకించుక ధైర్యము కలిగినది.

మంద—ఆదెబ్బతో వాఁడు చచ్చెనా లేదా ?

వజ్ర—లేదులేదు. వానిభార్య మూర్ఛితుఁడైనభర్తను సేదదేర్చి విల్లుగైకొని దనుజలోకభయంకరముగ యుద్ధము చేయుచున్నది.

మంద—ఏమిచిత్రము. ఆఁడుదియా యుద్ధము చేయుట! ఔరా! కాలమహిమ!

వజ్ర—అది యాఁడుదిగాదురా బాబు ! నూఱుమంది మగవాండ్రను జంపి పుట్టినది. మతిమాలినముండకొడుకు బ్రహ్మదేవుఁడు పిడుగువంటి మగవానిని జేయఁదలఁచి మఱచి యాఁడుదానినిగాఁ జేసెను. ముల్లోకములు జయించిన మనమహారాజుగారి

నామె యిప్పుడు ముప్పతిప్పలు పెట్టి మూఁడుచెఱువులనీళ్లు ద్రాగించుచున్నది. ఇన్నాళ్లు బ్రతికి యింటివెనుకఁ జచ్చె నన్నట్లు మహేంద్రాదుల గెల్చిన దానవసార్వభౌముఁడు తుద కాఁడుదానిచేతఁ బడునేమో యని భయము కలుగుచున్నది.

మంద—సరే. ఇంక మనదారి మనము చూచుకొనవలసినదే. నీప్రాణరక్షణ మెట్లు చేసికొనియెదువు?

వజ్ర—మనము కామరూపులము గద. అందుచేత నేను నందినో పందినో కుక్కనో నక్కనో పిల్లినో నల్లినో బట్టినో గొట్టినో కేకినో కాకినో చీమనో దోమనో తాయినో అప్పనో చెట్టునో చేమనో యై ప్రాణములు రక్షించుకొనియెద. నీ వెట్లు రక్షించుకొనియెదవు ?

మంద—నేను నీవలె తుచ్ఛజంతువునై ప్రాణములు గాపాడుకొనను. నే నేనుఁగు నయ్యెదను.

వజ్ర—ఏనుఁగు వగుట యబద్ధము. పీనుఁగు వగుట నిజము.

(తెరలో)

క. అని దివిజేంద్రుని గెల్చిన
దనుజేంద్రుఁడు మూర్ఛవోయెఁ దనయరదముపై
మనుజాంగనచే హతుఁడై
వినిరే యెవ్వరైన నిట్టివింతలు జగతిన్.

వజ్ర—హా ! చచ్చితి; చచ్చితి.

మంద—అయ్యో! అయ్యో! ఇంక దిక్కెవ్వరు?

వజ్ర—(పరికించి చూచి) ఇదిగో గరుడధ్వజముగల శ్రీకృష్ణునిరథమును సారథి యూపై పునకే తోలుకొనివచ్చుచున్నాఁడు. నరకమహారాజును మూర్ఛిల్లఁ జేసిన యీ బానిసకూఁతురు నిన్నును నన్నును చెటియొకబాణమునఁ గెరఁజేయఁగలదు. కావున నిప్పుడే కాళ్ళసత్తువకొలఁది పరుగెత్తుదము రమ్ము.

మంద—ప్రస్తుత మింతకన్న వేఱుపాయము లేదు. పదపద.

(అని యిద్దరు నిష్క్రమించుచున్నారు.)

ఇది నిష్కంభము.

[అంతట రథారూఢులై శ్రీకృష్ణసత్యభామలును రథముఁ దోలుచు సారథి యగుదారకుఁడును బ్రవేశించుచున్నారు.]

దార—దేవా! దేవీ! నరకుఁడు మూర్ఛనుండి తేఱువఱకు నరదము నీమఱ్ఱిచెట్టు నీడ నిలిపెదను. రణరంగమున వీరవిహారము సలిపిన దంపతుల కిందలి మందమలయానిలంబు లుపచారము చేసి శ్రమ మపనయింపఁ గలవు.

సత్య—దారకుఁడా! నీవు చక్కనిపనిఁ జేసితివి. ఇప్పుడు ప్రాణేశ్వరుని యాయాసము సంపూర్ణముగ నపనయింపఁబడు.

కృష్ణ—సుందరీ! నాశ్రమ మేమున్నది? శ్రమయంతయు నీదే. ఏలయన.

చ. చురుచురుక్కుమంచు మెయి సోఁకఁగ దానవుఁ డమ్ము లేయుడున్
మెరమెర దోప నేను మిసిమింతుఁడనై పడియుండఁ జూచి నీ
చెఱఁగునఁ జెమ్మటల్ దుడిచి చేతిధనుస్సు గ్రహించి దానవుల్
వెఱచఱవన్ బొనర్చితివి వీరవిహారము మెచ్చ నెల్లరున్.

సత్య—శరీరమం దలఁతఁ జెందినయవయవములు విశ్రాంతిఁ జేకొనుచుండ నలఁత పడనియవయవములు పని చేయుట ప్రకృతిసిద్ధము గదా. అందుచే నర్ధశరీర మలసి నప్పుడు తక్కినసగముమేను సమరము నడపినది.

కృ—కళ్యాణి!

తే. గీ. సాటి యెఱుఁగని నీమేని చక్కఁదనము
ముందు సతులెంత సిగ్గును బొందఁగలరొ
ప్రతి యెఱుంగని నీపరాక్రమము ముందు
పురుషు లంతియసిగ్గును బొందఁ గలరు.

సత్య—దేవా! ఇందు నాప్రజ్ఞ యేమున్నది.

తే. గీ. కారణంబులు దీనికిఁ గలవు రెండు
కమలనాభ! మీసాన్నిధ్యగరిమ యొండె
బగతుదౌర్బల్య మొండెఁ గావలయు సుమ్ము
కాక నే నేమి దైత్యులఁ గలఁచు టేమి.

కృ—ఈరెండును గారణములు కావు. ఇది కేవలము వినయవృత్తి. పగతునిచేత నలయింపఁబడిన నేను నీవిజయమునకుఁ గారణ మెట్లగుదును?

క. ఎగిరిపడితి నిన్నాళులు
మగవాండ్రభుజాబలంబు మాట గనక నీ

గ్గగు నిప్పుడు మీముందర
మగువా ! యిఁక సాగిరావు మా మగతనముల్.

మఱియు,

తే. గీ. ద్వాపరమ్మున రెండుచిత్రములఁ గంటి
జలజలోచన నీ సాహసంబుకతన

సత్య—ఆ చిత్రములు వినఁగోరెద.

కృ—ఆఁడువారికి పౌరుషం బమరు టొకటి
యబలభావంబు మగవారి కబ్బు టొకటి.

దార—ఇం దతిశయోక్తి యేమియు లేదు.

సత్య—అఘటనఘటనాసమర్థు లగుపరమేశ్వరులు స్వయముగ సమరవ్యాపారము నడపుచుండ నట్టిచిత్రములు పొడకట్టుట యొకవింతగాదు.

కృ—కళ్యాణి! నీసుశీలముచేత నీవిజయము నా కారోపించుచున్నదానవు; కావున నేను దానిని బరిగ్రహించుచున్నాఁడను.

దార—వీరపుత్రికయు వీరపత్నియు నగు నీదేవిచరిత్రము మహిషాసురుని మర్దించి దివిజలోకమును నిష్కంటకముగా నొనర్చి వాసుదేవునకు మహానందము గలిగించిన కాత్యాయనివృత్తాంతమును దలఁపించుచున్నది.

కృ—దారకా! నిజము నిజము. ఈమెచరిత్ర మట్టిదే. ఓసుందరీ! ఆసమరసమయమున నీరూపము మిక్కిలి దర్శనీయమయి యుండెను. ఎట్లంటేని,

సీ. శ్రమమునఁ బొడమిన చెమటచిత్తడిచేతఁ గస్తూరితిలకంబు కరఁగిపోవ
నృత్యముం బొనరించు నెమలిపింఛమయట్లు వెడఁదవేనలి జాఱి వెన్ను నిండఁ
దియ్యవిల్తుం డూఁగుతీఁగెయుయ్యాలలట్టు లాణిముత్తెపుసరు లల్లలాడ
గుణనినాదమునకు గొనబైనలయవోలె ముంజేతికడియముల్ మొరయుచుండ

నవనవాంగకములశోభ నవయకుండ
నవక మించుకయేనియు నలఁగకుండ
వెడఁదతూపులు చూపులు వింటఁగంటఁ
బరనిమీఁదను నామీఁద బరపి తబల.

సత్య—ఈవిజయము ఘుణాక్షరన్యాయముగ లభించినదైన నీస్వల్పకార్యముచేత మీమెప్పునకుం బాత్రురాల నయితినని సంతసించుచున్నదానను.

దార—దేవా! ఇంతవఱకు పురుషులేగాని స్త్రీలు సాంగ్రామికవ్యాపారము లకుఁ దగువారు కారని నేఁ దలఁచితి. ఈపూజ్యురాలి యతిలోకచాతుర్యముచేత నే నాయభిప్రాయమును మార్చుకొనవలసె.

సత్య—దారకా!

క. మగవారి పెల్లపనులకుఁ
దగువారినిగా నొనర్చి, దైవము స్త్రీలన్
దగనటుచేసెసె, మగువలు
తగిరెయెదరో తగరొ దైత్యదమనుఁడె యెఱుఁగున్.

కృ—దారకా! అంగనలు—

మ. చదువన్నేర్తురు పూరుషు ల్వలెనె శాస్త్రంబు ల్వఠింపించుచో
నదమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారము ల్మెచ్చుచో
నుదితోత్సాహముతోడ నేలఁగల రీయుర్విన్ బ్రతిష్ఠించుచో
ముదిత ల్నేర్వఁగరానివిద్య గలదే ముద్దార నేర్పించినన్.

దార—దేవా! స్త్రీలు ప్రకృతిసుకుమార లగుటచేఁ బురుషప్రాపణీయములగు మోటుపనులకుం దగ రనుకొంటి.

కృ—పువుబోండ్లమేనులు సహజముగ [మృదువు లయినను గాలానుగుణముగ శ్రమము సహింపఁగలవు.

తే. గీ. కరము స్పృశియించుమాత్రానఁ గందిపోవు
మల్లె సంపఁగిలోనగు మంచిపువులు
పృథివి శోషిల్ల గాడ్పులు విసరునట్టి
మండువేసఁగిఁ బొదలుచు నుండుఁ గాదె.

[తెరలో]

ఓరోరి యాదవపాంసనా! భార్యాభుజబలార్జితయశోగర్వితా! నిలునిలు. పాఱిపోకుు.

మ. అని నేమూర్ఛిలినంతమాత్రమున దైత్యస్వామి నాచేత నీ
ల్గినవాఁడంచును సంతసించి నను గేలింగొట్టుచున్నాఁడవా?
విను నామూర్ఛకుఁ గారణంబు వనితావిక్రాంతియే గాని నీ
ఘనదోస్సారము కాదు సిగ్గుపడ కీగర్వంబు నీ కేలరా?

సత్య—పిడుగువంటి యీధ్వని యెవ్వనిది?

దార—ఇది నరకునికంఠధ్వనియే.

కృ—హృదయేశ్వరీ!

తే. గీ. మొదట నీవాఁడితూపుల మూర్ఛవోయి
యసుర క్రమమ్మిటుఁ దెలివొంది యని యొనర్ప
నలుక రెట్టింప మనపైకి నరుగుదెంచె
వేటువడిన బెబ్బులివోలె నెగిరిపడుచు.

[అప్పుడు రథమెక్కి సూతసమేతుఁడై నరకాసురుడు ప్రవేశించుచున్నాఁడు.]

సూతు—రాక్షసేశ్వరా! ఇదిగో శ్రీకృష్ణుఁడు రథారూఢుఁ డయి యుందున్నాఁడు.

నర—ఓరోరి యాదవపాంసనా! భార్యాభుజబలార్జితయశోగర్వితా! నిలునిలుఁ పాఱిపోకు.

ఉ. అని నే మూర్ఛిలినంతమాత్రమున దైత్యస్వామి నాచేత నీ
ల్గినవాఁ డంచును సంతసించి నను గేలిం గొట్టుచున్నాఁడవా?
విను నామూర్ఛకుఁ గారణంబు వనితావిక్రాంతియే గాని నీ
ఘనదోస్సారము కాదు సిగ్గుపడ కీగర్వంబు నీ కేలరా?

కృ—ఓరోరి నిశాటకులపాంసనా! ఇందు మాకు లజ్జాకారణము లేదు.

క. మాయింటియాఁడువాండ్రు న
జేయుల మని విఱ్ఱవీఁగు చెనఁటియసురులన్
మీయట్టివారి గెలువఁగ
నాయత గర్వంబె గాక యట సిగ్గేలా?

మరియు నోపిశితాశన!

తే. గీ. అష్టదిక్పాలయుతుఁడై నయమరవిభుని
వ్రేల్మిడిన జయించిన మహావీరుఁడ వయి
యాఁడుదానిచేఁ దుద కిట్టు లయితి వనుచు
సిగ్గుపడి చావ కిట్లు వచ్చితివి మరల?

నర—ఓరివాచాట! మీయింటి యాఁడువాండ్రు సాహసము కలవారె. ఇందు నీవు నిజమే పలికితివి.

ఉ. కొంకక నీదుచెల్లెలు తగుల్కొనిపోయెను బాండుపుత్రునిన్
జంకక రుక్మిణీరమణి నాఁడు తగుల్కొని వచ్చె నిన్ను నీ
వంకగ నున్నయంగనల ప్రజ్ఞలకా గరువించుటెల్ల ఛీ!
యింకను నీది యొక్కబ్రతుకే యని మాటల నాడఁ జొచ్చితే?

మఱియు నియ్యది నీకు గౌరవమే యయినపక్షమున,

చ. అలయక సత్యభామమగఁడై నిను నేలుచునుండు, నింట గా
జులు తొడిగించుకొంచు నొకచోటను గూరుచునుండి భార్యవై
మెలఁగుము దానికిన్, మగఁటిమిన్ బెడబాసినభర్త భర్తయే
పొలియక యప్పుడే బ్రతికిపోతివి దగ్గఱ భార్య యుంటచేన్.

దార—ఆయుష్మంతుఁడా! మరియాద నతిక్రమించి నడచువారితోఁ బ్రసంగించు టొప్పదు.

కృ—దారకా! అగును. ఏదీ విల్లిటుదెమ్ము?

సత్య—ప్రాణేశ్వరా! ఒక్కసారి మీరూరకుండుఁడు. వీనితో నే నించుక ప్రసంగించెదను.

కృ—సుందరీ! అనఁదగినమాటయు ననఁదగనిమాటయు నెఱుఁగనిరాక్షసుఁడు సుమీ యితఁడు. ఇంతియగాక నీబాణప్రహారములచే నీవఱకు మనసు నొచ్చియున్నవాఁడు గావున మహాభిజాత్యముగల నిన్ను వీఁడు గౌరవింపఁ డని తోఁచెదును. మఱియు,

తే. గీ. చెనఁటికి హితోపదేశంబు చేయు టరయఁ
బెద్దపులికి ధర్మములు చెప్పెడు తెఱంగు
కఠినులకుఁ గృపఁ గలిగింపఁ గడఁగు టెల్ల
రాతినేలల నూతులఁ ద్రవ్వు టబల.

సత్య—అది నే నెఱుఁగుదును. అయినను నన్నొకసారి పలుకనిండు. ఓ ప్రాగ్జ్యోతిషాధీశ్వరా! ఇంచుక శాంతింతువేని యొక్కమాట చెప్పెద.

చ. పొడమితి వాదిదేవునకు భూసతికిన్ బ్రియనందనుండవై
యడఁచితి వష్టదిక్పతుల ఖ్యాతి వహించితి విట్టు లుండియున్
గడపితి వింత కాలమును క్రౌర్యమె సేయుచు నింక నేనియున్
జెడక ముకుందపాదసరసీరుహముల్ భజయింపు భక్తితోన్.

వెండియు నితఁడు,

తే. గీ. మునులకేని జిక్కనివాఁడు మొదటివాఁడు
పతితులను బావనులఁ జేయు వ్రతమువాఁడు
తొంటిపుణ్యంబునను నీకు దొరకినాఁడు
భక్తిభజియింపఁ గదవయ్య పరమపురుషు.

నర—ఓసత్రాజిత్పుత్రీ! ఏమీ ! నీమగండు పరమపురుషుఁడా? ఈజగద్వంచకుఁడు భగవంతుఁ డెట్లయ్యెనో చెప్పెద వినుము.

మ. తెలి వొక్కింతయు లేనితాపసులు నీతిభ్రష్టుఁడౌకృష్ణు అం
కులుబొంకు ల్వేయినోళులం బొగడుచుం గోరంతలా తద్గుణం
బులు కొండంతలు చేసి విష్ణుఁ డని సంపూజింప నానాబళా
బళీ నే నే హరినంచు సిద్ధుయి తా వచ్చెం ద్రపాహీనుఁడై.

క. భగవంతునిగావతారం
బగు నని వర్ణించుచుంటి వబలా వీఁడా
భగవంతుఁడు ఛీ! వీఁడే
భగవంతుఁడైన జనులపా ట్లేమందుణ్.

మఱియు !

ఆ. వె. ఉల్లి మల్లెయౌనె పిల్లి బెబ్బులి యౌనె
కాకి కేకి యౌనె కలువకంటి
కుక్క గుఱ్ఱమౌనె గోవౌనె గోమాయు
వాదిదేవుఁ డౌనె యాదవుండు.

సత్యభామా ! ఇతఁడు నీపతి యగుటచే నభిమానవశంబున నిట్లుపలుకుచుంటివి; కాని మావంటి యుత్తమపురుషులు వీని నాశ్రయించుటకు వీనియం దేగుణములున్నవి?

సీ. కులగౌరవముఁ జూచి కొనియాడుదుమందువా యదువంశజునికన్న నధముఁడెవఁడు
విక్రమంబునుజూచి వినుతింపు మందువా వాసుదేవునికన్న పందయెవఁడు
అభిమానధనుఁ డంచు నగ్గింపు మందువా నీ ప్రాణపతికన్న నీచుఁడెవఁడు
సుగుణసంపద మెచ్చిస్తుతియింపు మందువా గోపాలకునికన్న కూళయెవఁడు.
యేలుటకు నంగుళం బేని నేలలేక
పాండుసుతులపంచను జేరి బ్రతుకువాని
కులము బలమును మానంబు గుణము గలిగి
నాఁడు నే నేమి చేరి మన్నించు టేమి ?

ఓవీరపుత్రీ ! పగతుఁడనైనను నేను నీవిషయమై జాలినొందుచున్నాఁడను. ఏలయున;

క. చక్కనిచుక్కవుగదె నీ
కెక్కరణిని దాపురించె నీతుంటరి ని
న్నిక్కుమతి కిచ్చుట రుచుల్
గ్రక్కెడు మణిని మసిపాతఁ గట్టుటఁ గాదే !

నీసాహసంబునకుఁ జక్కఁదనంబునకుఁ గులగౌరవంబునకుఁ దగనిమగనిం గట్టుకొని నీవు హాస్యాస్పదురాలవైతివి.

దార—ఓయీ! రాక్షసా! మహామహిమలచేతనే యితఁడు పరమపురుషుఁడని జ్ఞాను లందఱుఁ దెలియుచుండ నీవెఱుంగఁజాలవా?

నర—ఓహో! మహిమలవలన జ్ఞాను లెఱింగిరా!

తే. గీ. తోడిదొంగలౌ మునులను గూడఁగట్టి
గడుసుఁదన మెఱుంగనివారి కన్నుఁ బ్రామి
మాయ లింద్రజాలములు వేమాఱు చేసి
నంతమాత్రాన భగవంతుఁ డగునె వీఁడు.

సత్య—దేవా! ఇంతగా రేఁగిన యీదనుజుని పొగరుదుమారము శరాసారము చేతఁగాని యడఁగదు.

కృష్ణ—దేవీ! నేను మొదటఁ జెప్పలేదా?

తే. గీ. సన్నిపాతసంగతమైన జ్వరముచేత
నొడ లెఱుంగక ప్రేలుచు నున్నరోగి
చేవ గలవేఁడిమందులచేతఁ గాక
చక్కఁబడునొక్కొ శైత్యోపచారతతుల.

అందుచేత నేనే వీనిదుర్మద మడంచెద. నీ వుండుము.

సత్య—హృదయేశ్వరా! అవును. నేనొకసారి వీనిని మూర్ఛపుచ్చఁ గలిగితిఁగాని సంహరింపఁజాల; ఖండితానేకదైత్యేంద్రమస్త మగుమీహస్తమే వీనిని విధ్వస్తము గావించుఁగాక!

నర—ఆహాహా! ఆయిల్లాలు మెచ్చుకొనుట కీమగఁ డామెప్పు నంగీకరించుటకు సరిపోయినది. ఓరోరి చంద్రవంశకళంక! నీవా నాదుర్మద మడంచువాఁడవు.

చ. అణఁచితి గాదె మాగధు బృహద్రథనందనుదోర్బలంబుచే
నణఁచితి గాదె కాలయవనాదిబలాఢ్యుల విక్రమించి నీ
వణఁచినవారె ముజ్జగములందు గతించినశూరు లెల్ల హా!
వణఁకుపుట్టించె దిక్కెవ రపాయము వాటిలె నేమి సేయుదుక్.

కృష్ణ—కాల మాసన్న మయినది, తొందరపడకుము.

మ. తులువా! నీతలఁ దన్నినట్టిఘనదైత్యుల్ చండదుర్వారదో
ర్బలసంక్షోభితశత్రుభూధరచమూరత్నాకరుల్ ప్రేల్మిడిక్

శలభంబుల్బలె మ్రగ్గినారు సుమి మచ్చక్రాగ్ని నీవెంత వ్ర
క్క—లు గావించెద మస్తకం బిపుడె నీగర్వంబుఁ గ్రక్కి—ంచెదన్.

ఉ. ఏటికి నీచుతోడ నిపు డీగతి నున్నను బుద్ధిరాదె యే
నాటికినైన నంచును మనంబున నగ్గణియింపకున్న నా
నాఁటికిఁ బిచ్చలించె భువనంబులు నీపెనుదుండగంబులన్
నేఁటికిఁ బండబారినది నీదురితంబు నిమేష ముండరా!

నర—నీవు నన్నశక్తదుర్జనత్వముచే సైరించుచున్నాఁడవు గాని చెల్లుబడి కలిగి కాదు. మే మన్ననో ని న్నొక్క—త్రుటిలో నిగ్రహింపఁగలము.

చ. మగఁటిమిలేని యీపనికిమాలినభీరువుతోడ నేటికిం
బగ యని యెంచి నీపలుకుఁ బాడిగ నెంచక నిన్ను ద్వారకా
నగరమునుండి యెన్నియొ దినంబులఁ గ్రిందట సాగఁదోల కీ
పగిదిని వీడఁగా బొగరువట్టితి క్రొవ్వడఁగింతు నుండురా!

నీచక్రాగ్ని ననేకదనుజులు మ్రగ్గిరా ?

శా. ఏఁడీ వ్రేలుమడంచి చెప్పు మని నీ వేపీరు న్యాయంబుగా
నోడం బుచ్చితొ హంసునా, డిభికునా యోగ్యుం జరాసంధునా
పాడిం దప్పియె పిల్కు—మార్చితివి యాభవ్యాత్మ్మలం జాలు నీ
యేడాగోడపుఁబల్కు—లేల నిలు నిన్నే దాటి లాడించెదన్.

నీకొకదానిలోమాత్రము విశేషప్రజ్ఞ యున్నది.

శా. పోరాటంబులు బెట్టి యొండొరులకుం భూపాలకశ్రేణిలోఁ
జేరంబీయుము నందు నొక్క—ని బయుంజెండాడి యెట్టెట్లొ భూ
భారం బంతయు బాపినాఁడ నిపె నాప్రజ్ఞాబలం బంచు నూ
రూరం బల్కెదరుఁ జాటఁ బంచెదవుగా యోహో యనన్ భూజనుల్.

అన్నిఁటి కేమిగాని నన్ను మాఁటిమాటికిఁ బాపాత్ముఁడనని పలుకుచుంటివి. దానశీలుఁడనయి బహుక్రతుఁడనై వేదవేదాంగవిదుఁడనయి మహేశ్వర చరణారవిందధ్యానైకచిత్తుఁడనయిన నేను నీకన్న నెక్కు—డుపాపంబు లే వొనర్చితినో యొక్క—సారి సెలవిమ్ము.

కృష్ణ—ఓమూర్ఖుఁడా!

శా. వేదంబుల్ తలక్రిందుగాఁ జదువనీ; విప్రాళి కర్చింపనీ
భూదానాదులు; చేయనీ శతమఖంబుల్; భక్తిపల్లింప నీ

వేదాంతార్థము; ముక్తినొందఁడు సుమీ పృథ్విన్ దయాసత్యశౌ
చాదుల్ దవ్వుగ ద్రోలుచుం దిరుగు మోహాంధుండు దైత్యాధమా.

నీపాపంబు నీ వెఱుఁగవా? నీయంతరాత్మ నిన్నుఁ బీడించుట లేదా?

మ. మునులం జంపితి జన్నపుంబశువులన్ ముచ్చిల్లి తంతఃపురాం
గనలన్ బల్మినిబట్టి తెచ్చితివి స్వర్గంబెల్లఁ జూఱాడి తె
స్నని వర్ణింతును జెప్పవచ్చును మితంబైనన్ మహీన్నివృచే
యని దోసంబులు చెందరానిగతు లెందైనం గనన్ వచ్చునే.

నర—(నవ్వుచు) ఓరోరియదువంశజలధిబడబానల ! ఈదోసంబులు కొన్ని నా యందుకాదు నీయందుఁ బొడగట్టుచున్నవి సుమా!

మత్తకోకిల. చేసినాఁడవు స్త్రీవధంబును జిన్ననాఁటను గూళవై
చేసినాఁడవు గోవధంబును జేడెనీల నిమిత్తమై
తీసినాఁడవు మాతప్రాణము దిక్కులేని యవస్థ నీ
చేసియుండని దోస మున్నదె సిగ్గుమాలిన ప్రేలరీ!

అదియటుండనిచ్చి నేనొక్కటి యడిగెదను. దానికుత్తరమిమ్ము.

క. శిశుపాలుఁడు మఱఁది గదా
శిశుపాలుఁడు వలచినట్టి చేడియనీవున్
విశదముగఁ జెల్లెలేగద
పశువా! యేమనుచు దానిఁబట్టితి చెపుమా.

దోసంబులన్నియు నీయంద యుంచుకొని మీఁదు మిక్కిలి మమ్ముఁ గలుపాత్ములనియెదవా? శాత్రవదుర్నిరీక్షవిక్రమ క్రీడారంభులనయి తేజోవిహీనుఁ డగుబిడౌజుని దిక్పాకసమేతముగా నోడిసిపుచ్చి జగత్త్రియం బాక్రమించుట నేరమగునా? ఇది క్షాత్రఃగాదా? పాలుఁబోతు వగు నీకు క్షాత్రమేమి తెలియును?

కృ—రాక్షసాధమా! క్షాత్రమనుసరింపఁ దలచినచో నీవు త్రివిష్టపముపై దండెత్తవచ్చును. సహజవైరి యగుమహేంద్రు నెదిరించి గెలువవచ్చును—కాని—.

మ. నిను నిందించిరె, నీపయిం గనలిరే, నీజోలికిన్ వచ్చిరే,
మనుచుం గానల ముక్కు మూసికొని బ్రహ్మధ్యానముం జేయు స
న్మునులఁ గొట్టితి వేమి చేసిరి మహాత్ముల్వారి లాలోకపా
వనులం జంపుటయా పరాక్రమము నాపైఁజూపు నీతేజమున్.

సీ. క్షుద్రాత్మునకు నీకు జోహారులొనరింప బలహీనుఁ డగువజ్రిపాణి గాఁడు
నీదళంబులఁజూచి నిర్విణ్ణులైపాఱి ముక్కు మూసికొను వెఱ్ఱిమునులుగారు
నీవిగ్రహముఁ జూచి నిశ్చేష్టలగుటకు ననదలౌ రాజకన్యకలుగారు
నీవిభీషికలచే నిర్వైరపడుటకుఁ బరమసాధువులు భూసురులుగారు
ఎవ్వఁడుగఁ దలంచితివో నెదనునన్ను
సకలభూతభయంకరజన్యరంగ
ఖండితానేకదైతేయ కంఠనికర
దేవతాచక్రవర్తిగాఁ దెలిసికొనుము.

నర—ఓగోరియీశ్వరమ్మన్య! నీవు భగవంతుఁడ వని యీవఱకు నీభార్యసత్యభామ వచించినది. ఇప్పుడు నీనోటనే వినుచున్నాఁడను. ఇట్లు దలంచుట నీనేరము గాదు. చదువులు నేర్చిన దుష్పండితులు కొందరు జగద్వంచనము చేయఁదలఁచి—

సీ. కటిమొద్దువోలు నీ కాయపుంజాయలు కారుమబ్బులకు సంగడము లనిరి
నీ(మ్రుచ్చుఁదనములు నీఱంకుకతలు నీలేకిపనులు విష్ణులీల లనిరి
నీవంచకత్వంబు నీగుట్టు వెలిఁబుచ్చు ధర్మాత్ములను దుష్టదైత్యులనిరి
నీకు గులాములై నిరతంబు గొనియాడు తెలివిమాలినవాండ్ర దివ్యులనిరి
అన్నిగొనములయందు నీ కన్నయైన
(త్రాగుఁబోతును శేషావతారుఁ డనిరి
ఒక్కపూఁటకు గతిలేనిబక్కవాని
విశ్వమయుఁడగు నమ్మహావిష్ణు వనిరి.

నేను నారాయణుఁడ నని నీలోనీవెంత మురిసినను మువ్రిముచ్చులు నిన్నెంతగొనియాడినను నీ వచ్యుతుఁడవుగావు. నక్క పార్వతియగునేని, కప్ప నారాయణుఁడగునేని నీవు హరివగుదువు. నాయొతింగినంతవఱకు,

శా. నీకన్నం గడు దుష్టకష్టచరితియు న్నీకన్నఁ బాపాత్ముఁడుఁ
నీకన్నంగఠినాత్ముఁడుం గుజనుఁడు న్నీకన్న దుర్మార్గుఁడుఁ
నీకన్నం బలుకాకియుం జెనఁటియు న్నీకన్న దుశ్శీలుఁడున్
నీకన్నం జడుఁడుం గనంబడఁ డిలన్నిర్భాగ్యదామోదరా!

నలువురనో ముప్పురనో బక్కరక్కసుల దొంగపోటునఁ జంపి దనుజాంతకుఁ డనునలీకపౌరుష నామము ధరించి బెదరింపఁజొచ్చెదవా? ఒకవేళ నీవనుకొన్నట్టుభగవంతుఁడవే యగుదువు కాక!

క. భగవంతుఁడవేయైనను
భగవంతునితాతవైన భయపడఁజుమీ
తెగటార్చెద పగఁ దీర్చెద
మగవాఁడవయేని నిలిచి మార్కొను నన్నున్.

సత్య—(మెల్లఁగా) ప్రాణేశ్వరా! ఎంతసేపితఁ డొదలుమఱచి ప్రేలుట.

కృష్ణు—సుందరీ! ఈతనిప్రల్లదంబు లిప్పుడే తుదముట్ట గలవు. ఓరోరిదైత్యాధమా! అవ్యవస్థితము లగునీదుర్భాషలకుఁ బ్రత్యుత్తరంబు లొసంగనక్కర లేదు. ఏమంటివేని,

మ. చకితబ్రాహ్మణగోవధూనికరముల్ సమ్మోదముంబొందవై
దికకర్మంబులు సాగ వెప్పటి యటుల్; దివ్యుల్, ప్రహర్షింపఁగా
సకిరీటంబు సకుండలంబుసశిరస్త్రాణంబుగా నీదు మ
స్తకముం ధారుణిఁ గూల్చువాఁడ నిదె మచ్చక్రాహతిన్ దుర్మతీ!

దేవీ! చక్రమిటు దెమ్ము.

నర—ఓరిక్షత్రియకులాపశదా! ఏమి! సకిరీటంబు సకుండలంబు సశిరస్త్రాణంబుగా నాదుమస్తకమును గూల్చెదవా!

సీ. జవరాండ్రతోఁ గూడి సరసమాడుట గాదు మరలించుటకు నాలమందగాదు
జున్ను మీఁగడ వెన్న జుర్రుకొనుట గాదు పడదన్నుటకుఁ జిన్న బండిగాదు
పాలీయవచ్చినపడఁతి జంపుట గాదు చితుకఁద్రొక్కఁగ నీటిచిలువగాదు
మతిలేకయుండిన మామఁగూల్చుటగాదు పెల్లగుఱుటకు వ్రేపల్లెగాదు
మా జరాసంధునకు నోడి మధుర విడిచి, నట్టనడిసముద్రంబున నగరుగట్టి
కాపురం బున్న జెట్టివి కావె నీవు, నన్నుఁ గూల్చువాఁడవు నీవె నందతనయ.

నీవు చక్రంబును ధరింపుచున్నాఁడవు గావున నే నిదె వింట బ్రహ్మాస్త్రముఁ దొడగుచున్నాఁడను.

క. మొక్కలము లేల పలికెదు
వెక్కలు; నరకాసురుండు విడువఁడు నిను నీ
వొక్కమ్మకు నొక్కయ్యకు
నిక్కముగా పుట్టితేని నిలుమీ యెదుటన్.

సూతుఁడా! రథము గోపాలున కభిముఖముగాఁ ద్రిప్పుము.

సూతు—దేవా! అట్లేచేయుచున్నాఁడను.

కృ—దారకా! రథము దానవున కభిముఖముగాఁ ద్రిప్పుము.

దార—అయుష్మంతుఁడా! అరదము వాని కభిముఖముగానే యున్నది.

[తెరలో]

నరకమహారాజా! శరణు! శరణు! ఈగరుత్మంతుఁడు మమ్ముం బ్రతుకనిచ్చుట లేదు. కుటిలనఖరాగ్రమ్ముల నెత్తురుకండలఁ బెకలించియు, జంచుపుటంబున మేమలఁ జీల్చియు బక్షాఘాతంబులం దూల్చియు నితఁడు దానవ సైన్యంబుల దైన్యంబు నొందించుచున్న వాఁడు. రక్షింపుము. రక్షింపుము.

నర—ఓదనుజులారా! వెఱవకుఁడు. వెఱవకుఁడు. ఇదిగో వచ్చుచున్నాఁడ. సూతుఁడా! రథము తోలుము.

సూతు—ఇదిగోఁ దోలుచున్నాఁడను. (ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

దార—దేవా! ఈమురాత్ముఁ డీనెపము పెట్టి తప్పించుకొనిపోయినాఁడు.

కృ—వాఁడు పలాయితుఁ డయినను మనము వానిని విడుతుమా.

దార—వీఁడు కర్ణకఠోరముగా నొనరించిన భగవద్దూషణమునకు తత్క్షణమే వధ్యుఁడు.

సత్య—దారకా! భగవంతుని దెలిసికొనుట కెంతవారు గావలయును.

శా. శ్రీరంజిల్లగ ముక్తినామక మహాసీమంతినిం గూడి యోం
కారస్యందన మెక్కి స్వచ్ఛమయి విజ్ఞానాత్మకం బైనగం
భీరాకారముతోడ నయ్యుపనిషద్వీధి న్నిరాఘాటసం
చారంబుం బొనరింపగానియెలుఁగక శక్యంబె దైత్యాళికిన్.

దార—అమ్మా! నీమాట నిజము. ఈశ్వరు నెఱుఁగుటకు వీఁ డెంతవాఁడు.

కృ—దారకా! నరకునిమీఁది కరదమును సత్వరము తోలుము. ఇప్పుడే వానిని చక్రంబునఁ గెరఁజేసెదను.

దార—చిత్తము. [అని తోలుచున్నాఁడు.]

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ప్రసన్నయాదవము

పంచమాంకము

[అప్పు డేడ్చుచు వజ్రకంఠుఁ డను రాక్షసుఁడు బ్రవేశించును.]

వజ్ర—(తనలో) హా నరకమహారాజా ! హా శ్రితజనకల్పద్రుమా ! హా దనుజకుల పారిజాతమా ! హా సుగుణరత్నాకర ! దురాత్ముఁ డయినకృష్ణునిచే నిష్కారణముగా వధియింపఁబడితివా ? అయ్యయ్యో ! ఇంక మాకు దిక్కెవ్వరు ? నీయండ నుండబట్టియే గదా దిక్పాలకులను స్వర్గమునుండి దొంగలనుదోలినట్లు తోలి కంటికి కనపడిన దేవతల నందఱను జేతికిదొరకిన బడితెలతోఁ గుక్కలను గొట్టినట్లు గొట్టఁగలిగితిమి. నీసంరక్షణమున నుండఁబట్టియే గదా మేము గాదిక్రింది పందికొక్కులవలె నేవెలితియు లేక హాయిగా సుఖించితిమి. నీపేరు దివ్యులకు సింహస్వప్నముగదా ? ఆమేలుదినములు పోయినవి. మందభాగ్యుల మగుమాకు నీవంటి యుత్తమోత్తముఁడు దొరకునా ! ఇవి న్యాయమునకు దినములుగావు. అందుచేతనే స్వకులాభిమానులును ధర్మస్వరూపులును తేజోరాసులును నగుమీవంటివారు కడునీచులచేత మడియుటయు దుర్జనులును దురాత్ములును దుశ్శీలురు నగువేల్పులు జయించుటయు సంభవించుచున్నది. లోకములో నెందఱికైనను చావున్నది కాని యీపాడుముండకొడుకు కృష్ణునకుఁ జావులేదుగదా ! మారక్కసుల నందఱిఁ జంపినాఁడు. వారి యాయువుఁ బోసికొని చిరంజీవియై బ్రతుకుచున్నాఁడు. 'పాపీ చిరాయు' వన్నమాట వీనియందే సార్థకమగుచున్నది. ఈపాపాత్మునకుఁ బురిటిలో సందైనంగొట్టదయ్యె. బాలపాపచిన్నెయైన రాదయ్యె. ఏరక్కసునిచేతంబడియైనఁ జావడయ్యె. ఏరోగములేక నాచిన్నప్పటినుండియు నీకృష్ణుఁడు రాయివలె నిక్కియున్నాఁడు. ఎంతోధైర్యవంతుఁడను నేనే యింత బెంగఁ గొనఁగా జేలలగు మందపాలుఁడు లోనగువా రెంత కడుపగిలి యున్నవారోకదా !

[అంతట పెద్దపెట్టున నేడ్చుచు మందపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మంద—(తనలో) హా రాక్షసరాజా ! నీ కెంతలోఁ గాలమాసన్నమైనది. నీవు లేకపోవుటచేఁ బాపాత్ములగు మునులు దేవతలుఁ జెలఁరేగి మాకొంపలు త్రవ్వుదురు గదా ! ఇఁక మాకెవ్వరు దిక్కు. నే నేమి జేయుదును ? చిన్నతనమునుండియు నన్నదమ్ముల లాగునఁ బెరిగితిమి? గనుక నేనును మావజ్రకంఠుఁడునుగలసి యేదో బ్రతుకుతెరువాలోచించికొనియెదము. ఇదిగో వాఁడిచ్చటనే యున్నాఁడు. (అని సమీపించును.)

వజ్ర—[ఏడ్చుచు మందపాలుని కౌఁగిలించుకొని మనమహారాజుగారిని కృష్ణుఁడు తనపట్టను పెట్టుకున్నాఁడురా ! అన్నయ్యా !

మం—మన మిప్పుడు దిక్కుమాలినవారమైనాము రా! తమ్ముఁడా !

వజ్ర—ఎల్లప్పుడు నా పొడువేల్పులపంతమే నెగ్గుచున్నదిరా ! అన్నయ్యా !

మం—మనకోట శనియుండఁగా మనపంత మెట్లు నెగ్గును! తమ్ముఁడా !

వజ్ర—మనుష్యులనెత్తురు గావలసినంత పానకము ద్రావినట్లు గుటగుటత్రాగెడు వారముగదా ! అన్నయ్యా !

మంద—మొక్కజొన్న పొత్తులవలె నిర్భయముగాఁ గావలసినప్పుడు మనుష్యులను గాల్చుక తినెడివారముగదా? తమ్ముఁడా!

వజ్ర—ఆవైభవమే పోయిందిరా ! అన్నయ్యా !

మంద—అప్పుడే పట్టణమంత పాడువారిందిరా. తమ్ముఁడా!

వజ్ర—ఇంతపని చేసినకృష్ణునిఁ గడతేర్చుటకు నుపాయమాలోచింపవలయును.

మంద—బుద్ధిమంతులము మనమిద్దఱముఁ దలచుకొన్న పక్షమున వాఁ డింక బ్రతుకఁగలఁడా ?

వజ్ర—అట్లయిన కృష్ణు నేవిధమున మృతినొందింతము ?

మంద్ర—నీవు త్రాఁచుపామువై వానిని గఱువుము.

వజ్ర—వెంటనే గరుత్మంతుఁడు నన్నుఁ జీల్చి చంపఁగలడు.

మంద—అవునవును. అది వీలులేదు; పోనీ, పులివై వానిఁ గడతేర్పుము.

వజ్ర—అతఁడు నరసింహామూర్తి. అందుచేత నతఁడు పులిమీఁద పుట్ర.

మంద—నిజము నిజము. అది పలనుపడదు. పోనీ కొండనై నేను వానిమీఁదఁ బడుదునా ?

వజ్ర—వాఁడు కొండ గుండఁజేయఁగలబండ. గోవర్ధనమెత్తలేదా ?

మంద—నిశ్చయమే. ఈయుపాయములు బాగులేవు. ఈవొంగపోటులేల ! కత్తి చేతఁబూని శూరులమై వాని కెదురుగఁబోయి వధియింతము. మృతినొందుదుమను భయములేదు. గుక్కెడుప్రాణము. ఎప్పుడుపోయినను పోవును.

వజ్ర—అవునవును. మహారాజుగారే మృతినొందగా మన మెంతవారము. ఈతుచ్ఛప్రాణములపై నాశ విడిచి స్వామిభక్తిని జూపుదము. రమ్ము. కత్తులఁ దెచ్చుకొందము.

మంద—ఉండు. ఉండు. ఎవరో వచ్చుచున్నారు.

వజ్ర—(చూచి) హా! చచ్చితిని. వాఁడు కృష్ణుని సారధి యగుదారకుఁడు.

[అంతట దారకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దార—(తనలో) భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు నన్నుం బిల్చి, దారకా! పితృవిహీనుఁ డగుభగదత్తుకుమారుని నే నిప్పుడు చూడవలయు. వానికి నారాక నెఱిఁగింపుమని యానతిచ్చె. అతఁ డెందున్నాఁడో తెలిసికొని యిప్పుడే సందేశ మెఱిఁగించెద.

మంద—ఓరీ! వజ్రకంఠా! నన మిప్పుడు పాఱిపోయినను వీఁడు చంపును. పాఱిపోక నిలిచినను వీఁడు చంపును. గతి యేమి?

వజ్ర—వానిమాట కెదు రాడకపోయినచో వాఁడు మనలఁ జంపఁడు.

దార—ఓయి! మీరెవరు? కుమారభగదత్తుఁ డెందున్నవాఁడు.

మంద—(గజగజవణఁకుచు) మేము నర-నర-నర-నర.

వజ్ర—(గద్గదస్వరముతో) మేము నరకుని బంట్లము కాము.

దార—మీరింత భయపడ నక్కఱలేదు. నేను మీజోలికి రాను. భగదత్తుని జాడఁ దెల్పుఁడు.

వజ్ర—అయ్యా! నరకాసురుఁడు పరమదురాత్ముఁడు, కడునీచుఁడు, నీతిహీనుఁడు నగుటచే మేమతని సేవించుటలేదు.

మంద—అయ్యా! భగవంతుఁడగు శ్రీకృష్ణునకు నరకుఁడు విరోధి యగుటచే వాని సేవించుట మానితిమి.

దార—(తనలో) ఈపిరికిముండకొడుకులు నాకు వెఱచి యిట్లనుచున్నారు. (ప్రకాశముగా) రాక్షసులకు సయితము నంతటి యసహ్యము గలిగించు దుర్గుణము లతని యొద్ద నేమియున్నవి.

వజ్ర—ఒకటా, రెండా చెప్పనలవిగాదు. స్త్రీలఁ జెఱపట్టుట. మహర్షులబాధించుట, యాగములకు విఘ్నములు సేయుట, విష్ణుభక్తులను వధించుట మొదలగు పాతకముల ననేకములు చేసెను.

మంద—ఆపాతకుని పేరు నన మిక్కడ తలపెట్టరాదు. కృష్ణుఁడు వానింజంపి లోకమునకు మేలుచేసెను. వాఁడు తప్పక చావవలసిన వాఁడే.

దార—మీప్రసంగములు చాలించి భగదత్తునిజాడ నెఱుఁగుదు రేని చెప్పుఁడు. లేనిచో మీదారిని మీరు పొండు.

వజ్ర—స్వామీ! మాకాజాడ తెలియదు. మాకు సెలవొసంగుఁడు. పోవుదుము. రారా! మందపాలా! [అని యిద్దఱు కొంచెము నడచి రహస్యముగా] గండము గడచి యివతల పడితిమి. త్వరగా పరుగెత్తుకపోవుదము రమ్ము. (అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

దార—(తనలో) నాకిప్పుడు భగదత్తునిజాడఁ దెలుపువా రెవ్వరు ? అదిగో నక్కడ యొకకంచుకి యగపడుచున్నాఁడు; వానినడిగెద. (ప్రకాశముగా) ఓయీ !

[తెరలో]

అయ్యా! అతఁడు దుఃఖపరవశుఁడై తండ్రికళేబరము జూడఁగోరి పోలికలనికిం బోవ నుద్యుక్తుడై యున్నాఁడు.

దార—(ఆలకించి) సరే! నేనిప్పు డతనియొద్దకుఁ బోయి సందేశ మెఱిఁగింప నక్కఱలేదు. వాసుదేవుఁడే వానిని యుద్ధభూమిలోఁ గలసికొనఁగలఁడు.

(అని నిష్క్రమించును.)

ఇది విష్కంభము.

[అప్పుడు యుద్ధభూమిలో మూర్ఛితుఁడైన భగదత్తుఁడును శంబర మంత్రియుఁ బ్రవేశించుచున్నారు.]

శంబ—(తనలో) పితృవియోగదుఃఖము దుస్సహమైనదే. ఈభగదత్తుడు తండ్రికళేబరము నొక్కసారి చూచి మూర్ఛితుఁడై యింకను స్మృతినొందకున్నాఁడు. దైవానుగ్రహమున వీనికిఁ దెలివి వచ్చునేని వీనిని దండ్రికళేబరమువద్దకు మరలఁ బోనీయఁగూడదు.

తే. గీ. భూరిసంతాప మెదఁ బొంగి పొరలునపుడు
చల్లఁదనమును వెదచల్లుసంగడీల
యూఱడింపుబల్కులు పాచు నుమ్మలంబు
పాలపొంగును చన్నీరు బాపునట్లు.

భగ—(మూర్ఛనుండి లేచి) హా! తండ్రీ! జగత్రయైకవీరా! తృణీకృతపురందరాది క్ష్మాపాలకా!

ఉ. తోలితి వాలమందలను దోలినపోలిక వేల్పుమూకఁ, ది
క్పాలురద్వారపాలకులుగా నొనరించితి కోటకొమ్మలన్
వ్రేలఁగఁ గట్టినాఁడ వరివీరశిరంబుల, నట్టినీవు గో
పాలునిపాలు గావలసి వచ్చెనె యీశ్వరమాయ యక్కటా !

క. తలిదండ్రులకుం దమతన
యులపైగల యంగకూర్మి యుండదు తలిదం
డ్రులపై బిడ్డల కనియెడి
పలు కిప్పుడు నాకు నిక్కవంబై తోఁచున్

అందుచేత నేగదా నేను నిన్ననుసరింపలేకపోయితిని.

శంబర—(సమీపించి) కుమారా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

భగద—అయ్యా! శంబరమంత్రీ! ఇది నేను స్వయముగాఁ దెచ్చుకొనినదికాదు. అందుచేత నేనడఁపఁజాల. అయిన నిటు వినుము.

సీ. ఎవని మెప్పును బొంద నేవేళ పవనుండు వెచ్చనిగాడ్పులు వీవ వెఱచు
నెవనియల్కకు నోడి యెన్నఁడు భానుండు గట్టిగా నెండలు గాయ వెఱచు
నెవనియానతిలేక యెప్పుడు పర్జన్యుండు గొప్పగావానలు గురియ వెఱచు
నెవనిదాడికి నోడి యేప్రొద్దు మధువైరి కుదురుగా కనుమూసి కునుక వెఱచు
నెవని పేర్విన్నమాత్రాన ధృతిఁ దొలంగి
దిగ్గజంబులు స్వేచ్ఛమై తిరుగ వెఱచు
నట్టిజగదేకవీరుఁ బోగొట్టుకొంటి
నింక నూఱట గల్గుట యెట్లు నాకు.

శంబర—నీతండ్రి నిజముగా నీవన్నట్లు నిరుపమానతేజోరాశి. విచారించిన కార్యము లేదని నేనిట్లు నీకుపదేశించితినిగాని నీకుఁగల దుఃఖము నే నెఱుంగనా? సేవకుల మయినమేమే యెంతో మఱుఁగుచుండఁగా గారాబుకొడుకు వయిన నీ వెంతదురపిల్లుచుందువో చెప్పవలయునా? కావున నిప్పుడు కార్యగతులఁ బరిశీలించి వర్తింపుము.

భగద—అయ్యా! ఈసమయమునందు.

తే. గీ. ధైర్యశాలి కున్నవి రెండు కార్యగతులు
జనకుఁ దెగటార్చుపగతునిఁ జంపుటొండె
సమరముఖమునఁ దానైనఁ జచ్చుటొండె
కానఁబడ దింక నా కన్యకార్యసరణి.

శంబర—కుమారా! అది గాదు. తండ్రి కగ్నిసంస్కారంబు చేసి యుక్రియలఁ జేయుటయే కార్యపద్ధతి.

భగద—హా తండ్రీ! భువనైకమల్లా! నీవిషయము నిట్టి నాపుణవచనంబు వినవలసె.

మ. అపచారం బొనరింప నెన్నఁడును నే నాబాల్యము న్నీకు నే
యుపచారంబును నీవు నావలన మున్నొక్కప్పుడుం గోరవై
తప్పు డీకీతిని గోరఁగా దగునె తండ్రీ! యగ్నిసంస్కారమే
యుపచారంబగువేళ వచ్చినదె యయ్యో నాదునిర్భాగ్యతన్. (మూర్ఛిల్లును.)

శంబర—కుమారా! ఏమి యీబేలతనము. (తనలో) ఈతఁడు మాటిమాటికి మూర్ఛిల్లుచున్నాఁడు. ఇతనికి దుఃఖోపశమన మెట్లగును చెపుమా? శుక్రశిష్యుల కెంతదురవస్థ సంభవించినది.

[అప్పుడు రాక్షసగురు వగుశుక్రుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

శుక్రు—(తనలో) అసురులు వేల్పులకన్న నెక్కుడు తేజోదర్పితు లయినను వారి యైశ్వర్యము వినశ్వర మగుటకుఁ గారణ మేమి? (కొంచె మాలోచించి) కారణ మునకయి వెదుకనక్కరలేదు.

మ. సిరి యెల్లప్పుడు ధర్మమూల మనుమం జెప్పంగ విధుల్ ధర్మత
త్పరుఁడో నాతనిభూరివై భవము నిత్యంబై ప్రవర్తిల్లు, దు
ష్కరుఁడై ధర్మము వీడు మానవు మహైశ్వర్యంబు లీభూమికిం
బరువై గట్టిపునాది లేనియిలులేవం గూలు నొక్కుమ్మడిన్.

దానవులు ధర్మేతరమార్గవర్తను లగుటచే వారికడ సిరి యుండదు. ఎట్లయినను వారు మాకుఁ బ్రియశిష్యులగుటచే వాత్సల్యంబు పెంపున మేము వారిని సమాదరింపకతప్పదు. ఇప్పుడు పితృశోకదుఃఖితుఁ డగుభగదత్తకుమారుని సమాశ్వాసింపవలయు.

భగద—(స్మృతిఁ దెచ్చుకొని) తండ్రీ! నీవు లేమి జగమంతయు నంధకారమయ మయి యున్నయది. ఏలయన,

తే. గీ. పృథివి యంతయు నేఁడు నిర్వీర్యమయ్యె
రాజకుల మెల్ల నేఁడు నిస్తేజమయ్యె
దితిజవంశంబు నేఁడు నిర్గతిక మయ్యె
నీవు లేనివెలితి ధాత్రి కెట్లు దీరు?

శంబర—కుమారా! ఇదే నీ నిమిత్తము భగవాను లగుభార్గవులు వచ్చియున్నారు. అభివాదనముచేసి సదాచారము నడుపుము.

శుక్రు—కుమారా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

భగద—(కన్నీళ్ళతో) భార్గవా!

మ. కదనోద్ధూతబిడౌజుఁ డాసురవధూకళ్యాణసంపాది, యు
న్మదరాజన్యశిరోవతంసవిలసత్పాదారవిందుండు, కో
విదుఁ డస్మజ్జనకుండు మీహితుఁడు మీబిడ్డండు మీశిష్యుఁ డ
ల్లదె నేలంబడియున్నవాఁడు హతుఁడై యాచార్య! కన్గొంటివే?

శుక్రు—వత్సా! మృతు లయినవారిని మనము దుఃఖించి క్రమ్మఱ బ్రతికింపఁ జాలము. చిరసంబంధముచే నెంత యాఁచుకొన్నను దుఃఖాతిశయముచేత నేనును కన్నీరు విడువక తప్పినదికాదు. తలఁచుకొనినకొలది దుఃఖము పొరలిపొరలి వచ్చుచునే యుండును; కావున నీవింక నీతండ్రిని మఱవవలయు.

భగద—అయ్యా! వేదాంతవిద్యారహస్యజ్ఞాతు లగుమీరే దుఃఖమున కప్పు డెప్పుడు వశులగుచుండ నింక మాదృశులా దుఃఖసాగరము నీఁదువారు!

చ. మఱవఁదలంతు నాయెడల మజ్జనకుం డొనరించు కార్యముల్
మఱవఁదలంతు వానియసమానగుణంబుల నెల్లఁ గాని యా
నెఱతన మాజగద్వినుత నిష్ఠురవిక్రమ మా సుమూర్తియుల్
మఱవఁదలంచినన్ మఱవ నాతరమా నిమిషార్ధమేనియున్.

శుక్రు—ధైర్యసాగరుఁ డగునరకునకుఁ దనయుఁడ వయిన నీవిట్లనఁ దగదు.

భగద—అయ్యా! ఇప్పు డేమి చూచుకొని నేను బ్రదుకుదును?

శుక్రు—కుమారా! ఏమియు లేనేలేదా?

తే. గీ. తల్లి గలదు రాజ్యరమాతల్లి గలదు
ప్రజలు గలరు నీకుఁ గన్నప్రజలు గలరు
పడుచువాఁడవు నీ కేమి బ్రతుక కేమి
చన్నవారితోఁ బోదురే యున్నవారు.

భగద—అవి యుండుట నే నెఱుంగుదును.

ఉ. ఉన్నవి వాజివారణము లున్నవి సంపద లెన్నియేని నా
కున్నవి నందనోపమమహోపవనంబులు పెక్కు లేలగా
నున్నవి యూళులె న్నయిన నున్నవి సైన్యము లెన్ని యున్న నే
మన్నరకుండు లేమి నవి యన్నియు లేనటు తోఁచు భార్గవా!

శుక్రు—వత్సా! అట్లయిన నీయుద్యమ మేమి?

భగద—వీరపురుషుల యుద్యమమే నాయుద్యమము.

కంబ—ఈయుద్యమ మనుచిత మయినది.

శుక్రు—ఏమి? నీవు హరితోఁ గయ్యమునకు సన్నద్ధుఁడవయ్యెదవా?

భగద—ఆచార్య! మ జేమి!

ఉ. అంతటివానికిం గొడుకునై, ప్రియశిష్యుఁడనై ధరిత్రి మీ
యంతటివానికిన్, బ్రభువునై దితిసంతతి కెల్ల, నిన్ని నా
కింతయశంబుతో నడరి యీసమయంబున బందనాచు నే
నంతము సేయకుంట తగవా నరకాంతకు నమ్మురాంతకున్.

శుక్రు—ఓయీ! వెఱ్ఱివాఁడా! నీతండ్రికిని నీతండ్రిం దలఁ దన్నిన మొక్క-లంపురక్కసులకును నలవిగాని యీపని నీకు సాధ్యమగునా?

క. ఏమనుకొంటివొ నీమది
సామాన్యుఁడు గాఁడు చక్రి సమరంబున నీ

చే మర్దింపంబడుటకు
నామాటలు వినుము సంధి నడుపుము వత్సా.

శంబర—(శుక్రునితో మెల్లఁగా) దేవా! ఈయుద్యమ మెట్లయినమాన్పి దనుజకుల మనుగ్రహింపుము.

శుక్రు—కుమారా! కృష్ణుని ప్రభావము వినఁగోరుదు వేని నే నించుక ప్రశంసించెద వినుము. అతఁడు మహీభారావతరణార్థమై యదుకులంబున నవతరించిన హరిగాని మనుజుఁడు గాఁడు. అందుచే నితఁడు,

సీ. పసితనంబున నేలఁ బ్రాక నేర్చిననాఁడె పగరకోటుల కెగఁబ్రాక నేర్చెఁ
దిన్నఁగా నొక్క విద్దెయును నేరనినాఁడె దితిజులఁ జంపువిద్దెమును నేర్చె
నిల తప్పటడుగులు నిడుట నేరకమున్నె వెసతప్పటడుగులు వెట్ట నేర్చె
నుయ్యాలలం దుండి యుగ్గుత్రాగెడునాఁడె కిగ్గాడియసురుల నుగ్గుచేసెఁ
బాలు గుడుచునప్పుడె నేలపాలు చేసెఁ, బ్రబలదైత్యులఁ బలువురబలము మెఱయ
నతఁడు మాపినకులము లెన్నైనఁ గలవు, వలదువల దన్న హరితోడఁ బగలు మనకు.

వెండియు నితఁడు మాయలఁ బ్రయోగించుటయందు నెఱకాఁడు.

శంబర—అవును. వైష్ణవం బైనమాయ దుస్తరమని వినుచుందుము.

భగద—పగతుల సాధించుట కితఁడు మాయలనే ప్రయోగించునా?

శుక్రు—వత్సా! మఱేమి? చూడు.

మ. కెడపెన్ గంసుని, జంపె హంసుని, దృటిం గెల్చెన్ జరాసంధునిన్;
బొడిచెన్ బౌండ్రకుఁ, గూల్చె గాలయవనున్, బోకార్చెఁ జేదీశుఁ, జ
క్కడఁచెన్ బూతన వీరి నందఱను మాయల్ పన్నియే చక్రి రూ
పడఁచెన్ గాని, పరాక్రమస్ఫురణచే నంతంబు నొందించెనే.

అవి యన్నియు నేల? నాస్వవిషయమున నే నించుక చెప్పెద వినుము. తొల్లి యతఁడు మహేంద్రరక్షణము చేయ నదితికశ్యపులకు వామనుఁడయి జనియించి దీనచింతామణి యగు బలిచక్రవర్తియొద్దకు నిఱుపేదయట్లు వచ్చి మూఁడడుగుల నేల యాచించె. అప్పుడు నేను,

ఉ. కైటభదైత్యమర్దనుఁడు గాని యితం డొక యర్థిగాఁడు మో
మోటముచేత నీవలదు మూఁడడుగుల్ ధరయంచుఁ జెప్పుడున్
గాటపుటల్కదర్భఁగొని నన్బొడిచెన్ గను లొట్టవోవఁగా
నాఁటికి నేటికిం దనయ! నాకుడికన్నటులుండెఁ జూడుమా!

భగద—ఆచార్యా! మీరు చెప్పినదంతయు సహేతుకముగా నున్నయది. అట్లయిన నాకిప్పుడు కర్తవ్యమేమి?

శుక్ర—ఇదిగో యుపదేశించుచున్నాఁడ వినుము.

మ. అభిమానమ్మును జంపుకొమ్ము, సమరవ్యాపారము న్మానుకొ
మ్మభయం బిమ్మని నందనందనుని పాదాంభోజము ల్వేఁడికొ
మ్మభిషేకమ్మను జేసికొ మ్మవనికి న్యాయంబుగా నేలుకొ
మ్మభువిం బిమ్మటఁ జూచుకొమ్ము సిరియెప్డు న్నీకు నెట్లబ్బునో.

శంబ—ఇదియే కర్తవ్యము.

క. అమరుల కాంగిరసుం డెటు
లమరారాతులకు శుక్రుఁ డట్టులె కాన
సమయోచితంబులగు నీ
విమలోక్తుల నవధరించి వినుము కుమారా.

భగద—భగవానుఁడా! ఓభార్గవా! నీయుపదేశము మా కాదేశముగదా! నే నట్లేచేయుదును. కాని పితృమరణమునకుఁ బ్రతిక్రియఁ జేయుట యెప్పుడు?

శుక్ర—సమయ మగునప్పుడు.

తే. గీ. మానసంబున రవులు క్రోధానలంబుఁ
గానఁబడకుండ దిగ్రమింగి కార్యవాది
సమయ మగునప్పు చెలరేఁగి జగము లదలఁ
బైటఁ బడఁదగు నగ్నిపర్వతమువోలె.

భగద—ఆచార్యా! మేలు. మీమాట శిరసావహించితి. శంబరా! నీవుపోయి యీ జనకునియుత్తరక్రియలవిషయమునఁ బ్రయత్నము సేయుము. నే నిప్పుడె కృష్ణునిఁజూచి వచ్చెదను. బ

శంబ—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాడు.)

[అప్పుడు శ్రీకృష్ణుఁడు సత్యభామయుఁ బ్రవేశించుచున్నారు.]

కృ—దేవీ! చిన్ననాఁడు నేను సాందీపునియొద్ద విద్యఁ గఱచు నెడ నొక చిన్న పద్దెముఁ జదివితి. దానియాథార్థ్య మిప్పు డెఱింగితిని.

సత్య—అది యేదో యెఱింగించి నాకు వీనులవిందు సేయుదురా?

కృ—సందేహ మేమి, ఇదిగో విను.

క. ఘనుఁడైన నల్పుఁడైనను
జననింద్యుం డైన లోకసమ్మతుఁ డైనన్

ధనియైనఁ బేద యైనను
దనతండ్రియె మంచివాఁడు తనయున కెపుడున్.

సత్య—దానియాథార్థ్య మెట్లెటింగితిరి ?

కృ—జగత్కంటకుఁ డగుతండ్రికొఱకు భగదత్తుఁడు మిక్కిలి విలపించుటచే దానిసత్య మెటింగితి. ఇప్పుడు పితృశోకవిహ్వలుఁ డగుభగదత్తుని సమాశ్వాసింపవలయు.

సత్య—దేవా ! తండ్రిని జంపి కొడుకు నెట్లూఱడింపఁ గలరు. మీకు మోమోటము లేదా ?

కృ—సుందరీ! రాజనీతి మోమోటము నెఱుంగదు, తొల్లి రాఘవుఁడు వాలిం గడతేర్చి యంగదుని యౌవరాజ్యమున కభిషిక్తునిఁ జేసి వానికి సేవ్యుండు గాలేదే. అది యటుండనిచ్చి యిటువినుము.

మ. ఖలునిన్ మాగధుఁ ద్రుంచి తత్తనయునిం గద్దెం బ్రతిష్ఠించితిన్
దులువం గంసునిఁ జంపి నిల్పితిని బంధుల్ మెచ్చ మాతామహున్
బలుగాకి న్నరకు న్వధించితిని గానం బ్రోతుఁ దత్పుత్రునిన్
దలిరుంబోఁడిరో ! రాచపాడి యిది క్రొత్తల్గావు మాకీపనుల్.

అదిగో శుక్రాచార్యసమేతుఁడై భగదత్తుఁ డచ్చట నున్నాఁడు.

సత్య—పేరు వినుటయే గాని భార్గవుల నెన్నఁడును దర్శింపలేదు.

కృ—దేవీ ! ఇతఁ డసురగురుఁడైనను మహామహిమగలవాఁడు. వందనీయుఁడు.

(ఇద్దఱు నడచుచున్నారు.)

శుక్ర—కుమారా ! దేవీసమేతుఁడై వాసుదేవుఁ డిటు వచ్చుచున్నాఁడు. అభివాదనము చేసి శరణ మడుగుము.

భగద—చిత్తము. రండు. వారి నెదుర్కొందము.

శుక్ర—జయతు జయతు దేవకీనందన !

కృ—భార్గవుల కభివాదనము సేయుచున్నవాఁడ.

శుక్ర—అనంతకళ్యాణమస్తు. యదుకుంజరా ! నీకతమున పితృవిహీనుఁ డగు నీ బాలకుఁడు నీకు రక్షణీయుఁడు. వత్సా ! భగదత్తా ! ఇదె నిన్ననుగ్రహించుటకు భగవంతుఁడు వచ్చియున్నవాఁడు. శరణము వేఁడుము.

కృ—అపరాధి వధింపఁబడియె. ఇతఁడు మా కవశ్యము రక్షణీయుఁడు.

భగద—(చేతులు జోడించి) దేవా ! నందనందనా !

సీ. తమ్మిచూలినిఁగన్న తండ్రిపయ్యు యశోదయొడిలోన బిడ్డఁడై యున్నవాఁడ
తెలిపీవిపై బాళి దొఱఁడి వ్రేపల్లెలో మందగాపరి వౌచు మన్నవాఁడ

వ్రేపెలందులయిండ్లు వేమారు కొల్లాడి వెన్న మీఁగడఁ జాల తిన్నవాఁడ
తలఁపుల నెక్కొంచి వలపుల సుక్కించి గొల్లకన్నెలసిగ్గుఁ గొన్నవాఁడ
కమ్మవిలుకాని గడుపారఁ గన్నవాఁడ, వేఁడువారి నేలుదు వంచు విన్నవాఁడ
నన్నుఁ బ్రోవుము నీవాఁడ నన్నవాఁడ, చిన్నవాఁడనో నందుని చిన్నవాఁడ.

(అని కాళ్ళపైఁ బడుచున్నాఁడు.)

కృ—కుమారా! లేలెమ్మ. (అని లేవనెత్తి.)

మ. అలుకం బూనకుమయ్య నాపయిని నీయాత్మకౌ రవంతేనియున్
దలకుం డాల్పకు మయ్య నేఁ బగతుఁడం గానయ్య నీకియ్యెడన్
ఖలుఁడై నీజనకుండు ముజ్జగములం గారించుటం జంపఁగా
వలసె న్వానిని సేయఁగావలసె దుష్ప్రారంభముల్ నీయెడన్.

భగద—దేవా! ఇందు నీ తప్పేమున్నది? నీకుం బగతుఁడై మాతండ్రి స్వయముగా నింత తెచ్చుకొనియె.

కృ—ఓయీ! వెఱ్ఱివాఁడా! నాకుఁగాదు. లోకమునకుఁ బగతుఁడై యనుము.

శా. నాకుం జుట్టమనంగ దాయయన నున్నాఁడే ప్రపంచంబునన్
లోకద్రోహులు మాకుద్రోహులు జుమీ లోకప్రియుల్ మాప్రియుల్
శ్రీకృష్ణుం డవతారమెత్తెను జగత్ క్షేమంకరోత్సాహియై
మీకు న్మికును గీడు సేయుటకు జన్మింపంగ లే దిద్ధరన్.

శుక్ర—దేవా! నీకు జుట్టమును బగతురు లేనిమాట నిజమే; కాని నరకుఁడు మీకుఁ జుట్టమును బగతుఁడుఁ గూడ నయ్యె.

సత్య—భార్గవులు లెస్సగా సెలవిచ్చినారు. ఈమహాత్మునకు నరకుఁడు భూమిదేవివలనఁ గొడు కగుటచేఁ జుట్టము. ధర్మద్వేషి యగుటచే వైరి.

కృ—అది నిజమే. కుమారుఁ డయినను దుష్టుఁ డగుటచే వాత్సల్యము ద్రోసి వాని వధించితిమి.

శుక్ర—ఎట్లయినను నరకుఁడు మీచే హతుఁడై ముక్తుఁడయ్యె.

భగద—నాతండ్రి హరిచేత ముక్తుఁడయ్యెనని నాకిప్పుడు కొంతదుఃఖ ముపశమిల్లినది.

కృ—వత్సా! భగదత్తా! నీవు లోకానుభవమున కపరిచితుఁడవు గాన నన్యథా భావింపవేని నే నించుక యుపదేశింపఁ దలఁచుచున్నాఁడను.

శుక్ర—ఇది వాని ననుగ్రహించుట.

భగద—ఇందు నే నన్యథా తలఁపవలసిన దేమున్నది?

కృ—నరుఁ డెంత తేజశ్శాలియైనను గుణహీనుఁ డయినచో నభ్యుదయము నొందఁడు. దానికి నీతండ్రియే తార్కాణము.

శా. ఆతేజంబున కాబలంబునకుఁ దోడై నీతియే యుండెనా
నీతండ్రంతటివాఁడు ముజ్జగముల న్నిక్కంబుగా లేఁడు నూ
నీతిభ్రష్టుఁడు గాన నిట్లు చెడియె న్నీతండ్రి నీవు న్నరా
రాతు ల్పోయిన పోకఁబోక గుణివై ప్రాగ్జ్యోతిషం బేలుమా.

శుక్ర—కుమారా! ఈయుపదేశము నీ కనుసరణీయమయినది.

భగద—ఇది నేను శిరసావహించుచున్నాఁడను.

కృ—ఇంకను నీ కుపదేశింపఁదగినవి రెండు గలవు. మహానుభావు లగుతపోధనులయెడ వినయవృత్తి నెఱపుము. పరకాంతలయందు మాతృభావము నిలుపుము. వీనియందు ధర్మవిరుద్ధముగా వర్తించుట స్వనాశముం దెచ్చుకొనుటయె.

సీ. ఋషికి నెగ్గొనరించి వృషలుఁడై జనియించె నవనిలో సహవర్తి యంతవాఁడు
మునులచేఁ బల్లకి మోయించి యజగరంబై పడె నహుషునియంతవాఁడు
జడదారి కొకకీడు సలిపియే శాపోపహతుఁ డయ్యె నమరేంద్రునంతవాఁడు
బ్రహ్మర్షియాల్కకుఁ బాత్రుఁడై నాఁ డట్టు లడఁగెం బెవింధ్యునియంతవాఁడు
కాంతకై చెడె రావణునంతవాఁడు, అతివకై చెడె మీతండ్రియంతవాఁడు
యెవఁడు సుఖియించెఁ బరకాంతి గవయఁగోరి, యెవఁడు వర్ధిల్లె ఋషులకు నెగ్గు చేసి.

మఱియు నిన్నొకధర్మకార్యమునకు నియోగింపఁదలఁతు. అది యేదందువేని,

తే. గీ. తల్లిదండ్రుల కెడబాపి తెంపుమాలి
పదియునాఱ్వేలకన్నెలఁ బట్టి తెచ్చి
చెఱల బంధించె మీతండ్రి చవటి యగుచు,
విడిచిపుచ్చుము వారి వేవేగ నిపుడు.

శుక్ర—అవును. నరకునిపాలిఁటి మృత్యుదేవతలో యనునట్లు లోకన్యలు దుఃఖ విహ్వలమతులయి యున్నవారు. తత్క్షణము వారిని విడువుము.

భగద—ఇదిగో నిప్పుడే నేనుపోయి వారిని విడిపించెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

సత్య—దేవా! అనాథ లగునారాజకన్యలను విపత్సముద్రమునుండి యుద్ధరించి మీరు పుణ్యముఁ గట్టుకొనిరి. మీమేలు వారెన్నఁడు మఱవరని తలంచెద.

కృ—సుందరీ! నే ననాథలకు నాథుఁడను. అగతికలకు గతినిగద.

సత్య—అందుచేతనే దేవతలు, మహర్షులు మిమ్మాశ్రయించిరి.

శుక్రు—(ఆశ్చర్యముతో) ఎవరో యంతరిక్షమునుండి దిగి యిటువచ్చుచున్నారు!

కృ—(చూచి) మహేంద్రసఖుఁ డగుచిత్రరథుఁడను గంధర్వుఁడు.

సత్య—ఈవిజయమునుగూర్చి మిమ్ము బహూకరించుటకు మహేంద్రుఁ డత నినిఁ బంపియుండును.

శుక్రు—అదిగో బృహదశ్వమహాముని యిటు వచ్చుచున్నాఁడు.

సత్య—ఇతఁడు తన్నిమిత్తముననే యిటు వచ్చియుండును.

[అప్పుడు చిత్రరథుఁడు బృహదశ్వుఁడు ప్రవేశించుచున్నారు.]

చిత్ర—బృహ—విజయతాం విజయతాం దానవగజేంద్రపంచానన!

కృ—గంధర్వరాజునకు స్వాగతము. మహర్షి కభివాదనము.

శుక్రు—బృహదశ్వా! బదరికాశ్రమవాసులకుఁ గుశలమా! చిత్రరథా! దివ్యుల కభ్యుదయమా!

చిత్ర—బృహ—ఇప్పు డభ్యుదయమే.

కృ—మీరాకచేత ధన్యుఁడ నయితిని.

చిత్ర—దేవా! మహేంద్రుఁడు మీరొనర్చిన యుపకారమునకుఁ గృతజ్ఞుఁడయి తనభక్తిని మీకు విన్నవింపు మని నన్నుం బనిచె. ఇదిగో నాతనిమాటలు వినుఁడు.

క. అనుజుఁడవై యొకమారా
దనుజుభయం బుడిపి యొక్కదరిఁ జేర్చితి నీ
వనుజుఁడవై యిప్పు డిటి
తనుజుల నరిదించి నన్ను దయఁ జూచితివో.

కృష్ణు—ఎంతమాట. మహేంద్రునకు నేనా యుపకారము చేయఁగలవాఁడను. ఈజయమునకుఁ గారణము మహేంద్రప్రభావమే.

తే. గీ. అన్న సన్నద్ధుఁడై పోరకున్న నేమి
తమ్ముఁగుఱ్ఱయె గెల్చె గా దనుజతతిని
మాపుల నినుండు లేఁ డన్నమాటె గాని
చంద్రకాంతియు నతనితేజంబు కాదె?

చిత్ర—ఇది కేవల వినయోక్తి.

బృహ—దేవా! బదరికాశ్రమతాపసులు తమభక్తి విన్నవింపుమని నన్ను మీవద్దకుఁ బుత్తెంచిరి.

మ. శ్రవణానందముగా వినంబడియె నీశూరమ్మనన్య గర్వాంధు డై
త్యవిభు న్నీ విటఁ జంపినశుభవార్తల్తాపసశ్రేణిచే

భువనంబు ల్పదునాలుగుం బడసె సంపూర్ణప్రమోదంబు నీ
భువి నీరాక్షస మయ్యె నీకరుణ నుత్ఫుల్లాంబుజాతేక్షణా!

* కృష్ణ—దివ్యులయు మహర్షులయు ననుగ్రహముచే నిప్పుడు విజయలక్ష్మీసమేతుండ నయితిని.

బృహ—ఇప్పుడుగాదు. ఈవిజయలక్ష్మిని నీవు ద్వారకనుండియే వెంటఁదెచ్చితివి.

చిత్ర—అవునవును.

క. ఇత్తలిరుంబోడిచేఁ గ్రొ
న్నెత్తురులను ద్రావునట్టి నీ దనుజులకున్
మొత్తించుట మెత్తనిపువు
గుత్తులతో రాళ్ళు పగులఁ గొట్టించుటఁ జూ!

బృహ—దివ్యమనుష్యాంగనలలో నెవ్వరు నీమెకు సవతు రారు.

శుక్రు—లావణ్యముండుచోట పరాక్రమ ముండుట యరిది.

[అప్పుడు భగదత్తుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భగద—దేవా! మాతండ్రిచేత బంధింపఁబడినరాజకన్యకల విడిపించితిని. వారందఱు రమానాథుఁడు జగన్నాథుఁడే మాకు నాథుఁ డని మిముం బరిణయ మగుటకుఁ గోరుచున్నారు.

చిత్ర—ఇది మీరు నిరాకరింపఁదగినది గాదు.

బృహ—జగత్కల్యాణకరునకుఁ గల్యాణము లగుట వింతగాదు.

శుక్రు—ఆకన్య లనుగ్రహింపఁబడుదురు గాక!

కృష్ణ—ఇందు నేను మధ్యస్థుఁడను. సత్యభామయే దానిని నిర్ణయింపవలయును.

సత్య—భరియించువారు మీరుండఁగ నేను నిర్ణయింపవలసిన దేమి?

కృష్ణ—సవతులతో వేగవలసినదానవు నీవు.

సత్య—ఇందఱుభార్యలతో మీరు వేఁగఁగా సవతులతో నే వేఁగఁజాలనా?

కృష్ణ—భగదత్తుఁడా! మహర్షిసమక్షమున నందఱ నేను బరిగ్రహించితి.

చిత్ర—దేవా! పోవుటకు మాకింక ననుజ్ఞ యిమ్ము.

మ. అవతారంబుల నెత్తి భూభరము ద్రోయ మీనమై కూర్మమై
సువరాహం బయి నారసింహ మయి కుబ్జుం డ్రోడనై మీఁద భా
ర్గవుఁడై రాఘవుఁడై యదుప్రవరుఁడై కల్యాణముల్గూర్చి యా
దివిజానీకము గాచు వైష్ణవమహాతేజంబు మమ్మేలుతన్.

బృహ—దేవా! నిన్ను నేను గొనియాడఁజాలను; కాని

సీ. ప్రామిన్కుటువిదల సీమంతమణిం దాచు నలరారు నెవ్వాని యడుగుదోయి
బ్రహ్మాండగృహమందు రతనంపుదివ్వెలై కడు వెల్గు నెవ్వానికన్నుదోయి
శ్రితజనంబుల కెల్లఁ జేయూఁతకోలలై క్రాలెడు నెవ్వానికేలుదోయి
దుష్టనాశము దెల్పు ధూమకేతువు లౌచు ముడివడు నెవ్వానిబొమ్మదోయి
యట్టిజగదేక గురునకు నచ్యుతునకు, నాదిమధ్యాంతరహితున కవ్యయునకు
విశ్వమోహనునకు మహావీరునకును, జ్ఞానమయునకు నంజలి నేనొనర్తు.

కృష్ణ—దేవతలయు మహర్షులయు నీప్సితములు సిద్ధించుఁ గాక!

బృహ—జగముల కిదివఱకే యనంతకళ్యాణములైనవి. వెండియు నిట్లగుఁగాక!

చ. నెలకును మూడువాన లవనిం గురియందగు బంట లెచ్చ రా
జులు ప్రజలం బలెం బ్రజలఁ జూచుకొనం దగుఁ బ్రేమమీఱ నీ
వలెఁ దలిదండ్రు లింక దలవంపులఁ దెచ్చెడు చెడ్డబిడ్డలన్
బెలుచని శిక్ష జేయఁదగుఁ బ్రేముఁ దొఱసి ప్రసన్నయాదవా!

కృష్ణ—తథాస్తు. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

సమాప్తము.

బలిబంధనము

(గ్రంథకర్త:— చందాల కేశవదాసుగారు.)

ఆంధ్రరంగస్థలములకు చిరపరిచితమైన కనకతారానాటకరచనమున ఖ్యాతిఁగాంచినది ఈ కవిచంద్రుఁడే!—శ్రీ మహావిష్ణుదేవుని పంచమావతారమగు వామనచరిత్రమే ఇది యని యితివృత్తము! దానవీరులలో నొక్కఁడగు బలిని, రసాతలమున స్థాపించిన భక్తి వీర రససమ్మేళనమగు ప్రఖ్యాతపురాణకథానకము! దేవదానవుల సహజ విరోధభావములు— బలిదానవేంద్రుని ప్రతాపవిజృంభణము—పరంధాముని భక్తవాత్సల్యము—అను గుణగుణములను రసపూరితములుగా, చిత్రింపబడినవి. ముండకామల హాస్యకథ మూలకథతో నతుకబడి రంగరంగమధ్యమునను రంగులీనుచు, హాస్యరసమును పూర్తిచేయుచున్నది. అసాధారణభావకల్పనములతో అక్షరలక్షలుచేయు పద్యములతో—అత్యద్భుతమగు కథాకల్పనముతో—అఖిలజనానందదాయకమగు, సపూర్వవేదాంత తర్కవితర్కములతో—ప్రఖ్యాతిగాంచిన బలిబంధన మహాఘట్టముతో—విభ్రాంతిని గలిగించు వామనావతార విశ్వరూపప్రదర్శనముతో—కథావస్తువు, గంభీరముగ కడముట్టినది. ఒకవంక నటశేఖరులకు, ఒకవంక గాయకలోకమునకు, ఒకవంక భక్తకోటికి, ఒకవంక వేదాంతులకు, ఒకవంక హాస్యరసప్రియులకు, ఒకవంక అధునాతనసభావాభిలాషులకు, మనోరంజకముగ, మహా సమగతతో రచింపబడిన ఈ నూతననాటకమునకు విలువ నిర్ణయించుట యసాధ్యమైనను, సర్వజనులకును సాధ్యముగ నుండుటకై—స్వల్పమూల్యము నిర్ణయింపఁబడినది.

వెల 1—0—0.

కుదుకూరి సుబ్బారావు. సరస్వతీ బుక్ డిపో; బెజవాడ, కృష్ణాజిల్లా.

కాలకేతనము.

(గ్రంథకర్త:—సోమరాజు రామానుజరావుగారు.)

కథానాయకుఁడగు కాలకేతనుఁడు మహాభయంకర స్వరూపుఁడై - నిరంతర హత్యాదాహముచే, ప్రకృతిభీకరుఁడై - యొనరించినహత్యలసంఖ్యాకములు. కాలకేతనునివంటి భయంకరవ్యక్తి మన ఆంధ్రనాటకములలో నింతవఱకున్ను చిత్రింపఁబడి యుండలేదు. ప్రథమమునందే యుఁదీసిన మాపలి యాత్మశక్తి మహాపిశాచమై - కాలకేతనుని తుదవఱకును వెంటాడినది. రాజస్యాలకుఁడగు నీలకంఠుఁడు రాజ్యాకాంక్షాతురుఁడై - రాజనాశనసంకల్ప మహాయజ్ఞమున కంకురార్పణము చేసినాఁడు. చోరశిఖామణియు, జూదరియు నగు మృగేశుఁడా యజ్ఞమునకు ఉపద్రష్టగా నిలువఁబడినాఁడు. చిన్నభార్య యగు మంగళ ప్రబోధనలు చెవికెక్కి - కాలకేతనుఁడు - మహాసాధ్వియగు పెద్దభార్యను సులోచనను ఘోరముగ హత్యచేసినాఁడు. భీషణమైన యారాత్రి - కాలకేతనజీవితమునం దొక మహాకాళరాత్రి; ఆరాత్రియే సులోచనావధానంతరమున విశ్వాసపాత్రభృత్యుఁడగు ఆగభాషి కాలకేతనునిభీకరకరవాలాగ్రమున నేలగూలినాఁడు. ఆరాత్రియే తండ్రియగు కాలకేతనుఁడు శాంతికేతనుని గ్రుడ్లుతీసినాఁడు! పాపము పండినది! ప్రకృతికాంత కాలకేతనుంజూచి వికృతహాసము గావించినది! దిశలు దద్దరిల్లినవి! మంగళా నీలకంఠ మృగేశుల ద్రోహములు రత్నహారమూలమున బయల్పడినవి! కాలకేతనము - మృత్యుసూచకమై అంబరస్థలమున సంచలించుచున్నది. సర్వజననాశన మొనరించి కాలకేతనుఁడు పశ్చాత్తాపశోకముచే ఆత్మహత్య చేసికొన్నాఁడు. చదువఁ దగిన భయానక నాటకము!

వెల రు 1—0—0.

వలయువారు:—**సరస్వతీ బుక్ డిపో, బెజవాడ,**

అని వ్రాయవలెను.